

పూల సింగిడి.. మహిళల సందడి


ఓవైపు దేవీ శరన్నవరాత్రులు.. మరోవైపు బతుకమ్మ వేడుకలతో ఏ వీధిలో చూసినా ఆధ్యాత్మికతే వెల్లివిరుస్తోంది. కూకట్‌పల్లి గ్రామంలో ఆదివారం రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలు పేర్చి.. గౌరమ్మను ఆరాధిస్తూ మహిళలు ఆడిపాడారు.

ఈనాడు హైదరాబాద్

HMDA

సోమవారం అక్టోబరు 7, 2024

చర్మం.. వ్యాధుల మర్మం



- ఉతకకుండా పదేపదే వాడితే స్కిన్ ఇన్‌ఫెక్షన్లు
- పిల్లలు, యువతలో 30-40 శాతం మందిలో సమస్యలు

ఈనాడు, హైదరాబాద్: జీన్స్ లేదా దళసరి ప్యాంట్లను ఉతక్కుండా మళ్లీమళ్లీ వేస్తున్నారా. అయితే చర్మ వ్యాధులు పొంచి ఉన్నట్లే. తాజాగా ఉస్మానియా ఆసుపత్రికి వచ్చే పిల్లలు, యువతలో ఈ తరహా చర్మ సమస్యలు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ఫ్యాషన్.. ఇన్‌ఫెక్షన్... చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు ఎక్కువ శాతం మంది జీన్స్ ప్యాంట్లు ధరించడం ప్రస్తుత రోజుల్లో ఫ్యాషన్‌గా మారింది. రఫ్ అండ్ టఫ్‌గా ఉండటం, ఉతక్కపోయినా.. ఇస్త్రి చేయకపోయినా.. వేసుకోవడానికి ఇబ్బంది ఉండదనే భావనతో చాలామంది వీటిపై ఆసక్తి చూపుతుంటారు. ఒకటి రెండుసార్లు వేసుకున్న తర్వాత ఉతికి మళ్లీ ధరిస్తే పెద్దగా ఇబ్బంది లేదు. చాలా మంది వారం పది రోజులు ధరించడంతో చర్మ సంబంధిత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చర్మానికి అంటి పెట్టుకునే (స్కిన్‌ఫిట్)లా ఉండటంతో గాలి ఆడక లోపల చెమట పట్టి వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తున్నాయి. దద్దుర్లు (అర్టికేరియా), గజ్జి (స్కేబిస్), తామర (అటోపిక్ డెర్మటైటిస్) వంటి ఇబ్బందులతో చాలామంది వైద్యులను సంప్రదిస్తున్నారు.

లక్షణాలు..

- చర్మం రంగు మారడం
- ఎర్రగా దద్దుర్లు రావడం
- దురద, మంట, వాపు
- పుండుగా మారి చీము కారడం
- సహజత్వం కోల్పోవడం
- పాలిపోయినట్లు కనిపించడం
- చర్మం దళసరిగా మారడం

ఏదో ఒక సమస్యతో ఆసుపత్రులకు..

0-18 వయసు పిల్లలు, యువతలో 30-40 శాతం మందిలో ఏదో ఒక చర్మ సమస్య వేధిస్తోంది. ప్రధానంగా పౌష్టికాహార లోపం, అపరిశుభ్రత, గాలి, వెలుతురు సోకని ఇళ్లలో పరిమితికి మించి ఉండటం, జన్యు ఇబ్బందులు, కాలుష్యం తదితర కారణాలు దోహదం చేస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. అధిక చక్కెర, నూనెలు, ఉప్పు ఉన్న జంక్‌ఫుడ్ తీసుకోవడంతో యువతలో మొటిమలు వస్తున్నాయని తెలిపారు.

- వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం
- షర్ట్, ప్యాంటు రెండ్రోజులకు మించి వాడకపోవడం
- చర్మం మాయిశ్చరైజర్‌గా ఉంచుకోవడం
- తగినంత నీళ్లు తాగడం
- అలర్జీల నివారణకు చికిత్స
- నిత్యం 30 నిమిషాల పాటు వ్యాయామం
- ఆహారంలో ఆకు కూరలు, పండ్లు ఉండేలా చూడటం
- స్ట్రాబెర్రీలు, యాపిల్స్,

జాగ్రత్తలు..

పుచ్చకాయ, అరటి పండ్లు తీసుకోవడం

- చర్మం కాలుష్య బారిన పడకుండా దుస్తులు ధరించడం
- రోజులో కొంత సమయం చర్మానికి ఎండ తగిలే చూడటం
- జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండటం
- సమస్య ఉంటే వైద్యున్ని సంప్రదించాలి.

ఉస్మానియాలో ప్రత్యేక విభాగం...

చర్మ వ్యాధులకు ఉస్మానియాలో ప్రత్యేక విభాగం అందుబాటులోకి తెచ్చినట్లు డెర్మటాలజీ ప్రొఫెసర్ డాక్టర్ భూమేష్‌కుమార్ వెల్లడించారు. ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. నిత్యం 100 మంది వరకు ఓపీ వస్తుండగా... 0-18 ఏళ్ల లోపు వారు ఎక్కువగా ఉంటున్నారు. తీవ్రమైన చర్మ వ్యాధి లక్షణాలు ఉంటే బయాప్సీ పరీక్షలు చేస్తామన్నారు. పిల్లల కోసం పీడియాట్రిక్ డెర్మటాలజీ శిక్షణ కేంద్రం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. డీఎం తర్వాత పీడియాట్రిక్ డెర్మటాలజీలో ఫెలోషిప్ అందిస్తున్నట్లు చెప్పారు.

తీర్థ యాత్రల పేరుతో ఘరానా మోసం



ఉప్పల్: తక్కువ ప్యాకేజీలో తీర్థ యాత్రలకు తీసుకెళ్తామంటూ నమ్మించాడు.. ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశాడు. చివరకు వందల మందికి కుచ్చుటోపి పెట్టాడు ఉప్పల్‌లోని ఓ నిర్వాహకుడు. పోలీసుల, బాధితుల కథనం ప్రకారం.. ఉప్పల్‌లోని హైకోర్టు కాలనీలో ఉండే **భరత్‌కుమార్ శర్మ**(45) గాయత్రి టూర్స్ అండ్ ట్రావెల్స్‌ను నడిపిస్తున్నాడు. పలు భక్తి చానళ్లలో తక్కువ ప్యాకేజీలో మానస సరోవర్, ఇతర యాత్రలకు తీసుకెళ్తామని ప్రకటనలు ఇచ్చారు. నమ్మేసి నగరంతో పాటు, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో డబ్బులు ఇచ్చారు.

వందల మందికి టోకరా: తీర్థ యాత్రలకు ఆసక్తి చూపిన వారిలో అందరూ వయోవృద్ధులు ఉన్నారు. వీరంతా దాచుకున్న, పెన్షన్ డబ్బులను అతడికి చెల్లించారు. ఒక్కొక్కరి నుంచి రూ.2 నుంచి 4 లక్షల వరకు తీసుకున్నాడు. వందల మంది నుంచి రూ.కోట్లలో వసూలు చేశాడు. ఏళ్లు గడుస్తున్నా ఒక్కరినీ తీర్థయాత్రలకు తీసుకెళ్లకుండా రకరకాల కారణాలు చెప్తూ వస్తున్నాడు. వీరిలో కొందరికి ఇచ్చిన చెక్కుల కూడా బౌన్స్ అయ్యాయి. వాళ్లను నమ్మించేందుకు నిత్యం వీడియోలు చేసి వాట్సాప్‌లకు పంపించేవాడు. తను ఉప్పల్‌లోనే ఉంటూ జమ్మూకశ్మీర్‌లో ఉన్నట్టుగా నమ్మించేవాడు. దీంతో విసుగెత్తిన రామంతాపూర్‌కు చెందిన ప్రియారెడ్డి ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి భరత్‌కుమార్‌శర్మను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ముందుకు కదల్లేరు.. వెనక్కి వెళ్లలేరు

- నగరంలో నిత్యం ట్రాఫిక్ పద్మవ్యూహం
- రోజూ 5 లక్షలమంది యాతన



ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మహానగరం నలువైపులా ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. నిత్యం ఏదో ఒక సమయంలో ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించిపోతుండటంతో సుమారు 5 లక్షల మంది వాహనదారులు గంటల పాటు ఎటూ కదల్లేక నరకం అనుభవిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ఆదేశించినా ఫలితం కనిపించడం లేదు.

నగరంలో నిత్యం 40-50 లక్షల వాహనాలు తిరుగుతున్నాయని అంచనా. ఈ సంఖ్యకు అనుగుణంగా ప్రధాన మార్గాల్లో విస్తరణ పనులు జరగడం లేదు. రద్దీ ప్రాంతాలను గుర్తించి వాటికి ప్రత్యామ్నాయ రూట్లను పరిశీలించి వాహనాలు మళ్లిస్తే కొంతవరకు ఒత్తిడి తగ్గుతుంది. గతంలో హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం అదనపు కమిషనర్‌గా ఏవీ రంగనాథ్ ఉన్న సమయంలో అనేక ప్రాంతాల్లో ఇలాంటి ప్రయోగాలే చేసి ఫలితాలు సాధించారు. రాజధాని పరిధిలో 3328 మంది పోలీసులు ట్రాఫిక్ విభాగంలో ఉంటే వీరిలో రోడ్డు మీదకు వచ్చే వారు 300 మంది దాటడం లేదు. చాలాచోట్ల హోంగార్డులను పెడుతున్నారు.

- లక్డీకాపూల్ నుంచి ఎస్ఆర్‌నగర్, ప్యారడైజ్ ఉంచి బేగంపేట, జేబీఎస్ నుంచి ప్యారడైజ్, నల్లకుంట నుంచి ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, జేఎన్‌టీయూ నుంచి సైబర్‌టవర్, కోఠి నుంచి ఎల్బీనగర్ వరకు ఇలా అనేక రూట్లలో నిత్యం ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. హైటెక్ సిటీ, మాదాపూర్ పరిసర ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసినా గంటల పాటు నరకమే.

- నగరంలో పది పన్నెండు కారిడార్లలో నిత్యం ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. ఇందులో ప్రధానమైనది మాసాబ్‌ట్యాంక్ నుంచి ఆరాంఘర్ వరకు ఉన్న కారిడార్. శుక్రవారం సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ట్రాఫిక్ స్తంభించింది. ఇక్కడ చాలామంది రోడ్లపైనే వాహనాలు ఉంచి వ్యాపారాలు చేస్తున్నారు. రాత్రయితే ప్రైవేటు బస్సులు అడ్డుగా నిలుపుతున్నారు. అత్తాపూర్ నుంచి మాసాబ్‌ట్యాంక్ వచ్చే రోడ్డులోనూ ఇదే పరిస్థితి.

ఇవీ మరికొన్ని కారణాలు!

- ట్రాఫిక్ అధికంగా ఉన్న రోడ్డులో గ్రీన్‌సిగ్నళ్లను అధిక సమయం ఉంచి తక్కువ ట్రాఫిక్ ఉండే రూట్లలో కొంత అధిక సమయం రెడ్ సిగ్నల్‌ను ఉంచే ఆటోమెటిక్ వ్యవస్థ ఉంది. దీన్ని పోలీసులు ఉపయోగించడం లేదు. నగరంలో 121 ప్రాంతాల్లో యూటర్న్‌లు, ఫ్రీలెఫ్టులు చేయొచ్చని అధికారులు గుర్తించారు. వీటిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. మహానగరంలో దాదాపు 200 ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే ముంపు నీరు ట్రాఫిక్‌కు అవరోధంగా మారుతోంది.
- నిబంధనల ప్రకారం రాత్రి పది గంటల తరువాతే ప్రైవేటు బస్సులు నగరంలో ప్రవేశించాలి. చాలా ప్రాంతాల్లో రాత్రి 8.30 నుంచే వచ్చేస్తున్నాయి.

గునుగు పూవు పుయ్యాలో.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



బతుకమ్మ ఉత్సవాల్లో గునుగు పూలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కందుకూరు శివారులో ఆ పూలను వృద్ధులు సేకరిస్తూ సద్దుల బతుకమ్మ రోజు విక్రయించేందుకు పోగు చేసుకుంటున్న దృశ్యం.

3 మాసాలు.. 5 వేల వివాహాలు



ఈనాడు, హైదరాబాద్: నగరానికి పెళ్లి కళ వచ్చేసింది. మూడునెలల పాటు మంచి ముహూర్తాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నట్టు పురోహితవర్గాలు అంచనా వేస్తున్నాయి. మూడు జిల్లాల్లో గత ఐదేళ్లలో జరిగిన వివాహాలతో పోల్చితే అత్యధికంగా వచ్చే మూడు నెలల్లో దాదాపు 5 వేల పెళ్లిళ్లు జరగనున్నట్టు ఫంక్షన్‌హాళ్లు, బ్యాంకెట్ హాళ్ల నిర్వాహకులు చెబుతున్నారు.

ముహూర్తాలు ఇలా..

నెల	తేదీలు
అక్టోబరు	12,13,16,20,27
నవంబరు	3,6,7,8,9,10,13,14,16,17
డిసెంబరులో	5,6,7,8,11,12,14,15,26

పెరిగిన అడ్వాన్స్ బుకింగ్‌లు.. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు, తదితర శుభకార్యాలకు ఈ నెల ఎంతో అనుకూలమైనదని రాష్ట్ర అర్చక సంఘం కన్వీనర్ శ్రీరంగం గోపీక్రిష్ణమాచార్యులు తెలిపారు. ఇప్పటికే బుకింగ్‌లు మొదలయ్యాయని తెలిపారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో 25 రోజుల పాటు మంచి ముహూర్తాలు ఉండటంతో భాజభజంత్రీలు, మండపాలను అలంకరించే వారికి, కేటరింగ్ సంస్థలకు సైతం ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. దసరా ఉత్సవంతో పాటు శుభకార్యాలకు అనువైన నెల కావడంతో మార్కెట్‌లోనూ సందడి నెలకొంది. వస్త్ర దుకాణాలు, బంగారం దుకాణాల్లో అమ్మకాలు పెరిగినట్టు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

హత్య చేసి.. హత్యాచారంగా చిత్రీకరించి



ప్రియాంక (మృతురాలు) మంజుల (నిందితురాలు)

మూసాపేట: రూ.10 వేలు కూడా విలువ చేయని వెండి వస్తువుల కోసం ఓ మహిళ మరోమహిళను హతమార్చి.. హత్యాచారంగా చిత్రీకరించేందుకు విఫలయత్నం చేసింది. ఈ కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 2న మహిళ మృతదేహం వెలుగుచూడగా.. సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని అరెస్టు చేశారు. డీసీపీ కె.సురేష్‌కుమార్ ఆదివారం కూకట్‌పల్లిలో వివరాలు వెల్లడించారు.

వెండి నగలపై వివాదం.. నిజామాబాద్ జిల్లా యెడపల్లి మండలానికి చెందిన ధర్మారం ప్రియాంక(23) భర్తతో విడిపోయి.. 2 నెలల క్రితం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీకాలనీ మెట్రో స్టేషన్ కింద ఉంటోంది. చెడు వ్యసనాలకు బానిసైన ఆమెకు కూకట్‌పల్లిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కటారి మంజుల(35) పరిచయమైంది. ప్రియాంక తన 2 వెండి గొలుసులు, మెట్టెలు మంజులకు ఇచ్చి దాచాలని కోరింది. కొన్ని రోజులకు తిరిగి అడగ్గా మంజుల ఇవ్వడం లేదు. విసిగిపోయిన ప్రియాంక నడిరోడ్డుపై మంజులతో గొడవకు దిగింది. తెలిసిన ముగ్గురితో కలిసి ఆమె ఇంటకెళ్లి బెదిరించి తన నగలు తీసేసుకుంది. దీన్ని అవమానంగా భావించిన మంజుల ప్రియాంకను అంతమొందించాలని పథకం వేసింది.

పట్టించిన సీసీ కెమెరాలు..

సెప్టెంబరు 30న మద్యం తాగుదామంటూ ప్రియాంకను ఇంటికి ఆహ్వానించి ఎక్కువ మద్యం తాగించి స్పృహ తప్పే వరకూ ఎదురుచూసింది. రాత్రి 11.30 గంటలకు బయటకు వెళ్దామంటూ తన స్కూటీపై ప్రియాంకను కేపీహెచ్‌బీకాలనీలో ఉదాసీన్ మఠానికి చెందిన నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి బ్లేడుతో ప్రియాంక గొంతు కోసి హత్య చేసింది. ఆమె వెండి నగలు తీసుకుంది. హత్యాచారంలా చిత్రీకరించేందుకు ప్రియాంక ఒంటిపై లోదుస్తులు చింపేసి. . జననాంగం వద్ద, గొంతు నుంచి ఛాతీ వరకూ బ్లేడుతో గాట్లు పెట్టింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాలు దొరికిపోయింది.



- న్యూస్‌టుడే, గచ్చిబౌలి

క్యాన్సర్‌ను ఖతం చేద్దాం

'రన్ ఫర్ గ్రేస్- స్క్రీన్ ఫర్ లైఫ్' నినాదంతో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం ఉదయం నిర్వహించిన పరుగులో ఐటీ ఉద్యోగులు, యువతీ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, యశోద ఆసుపత్రి ఎండీ పవన్ గోరుగంటి, డాక్టర్ చినబాబు, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నీఫర్, డాక్టర్ బర్త్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ డేవిడ్ జోయల్ పాల్గొన్నారు.





తెలుగుతల్లి వంతెన కింద ఆగిన ద్విచక్ర వాహనదారులు

నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం

నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. అడ్డగుట్ట కమ్యూనిటిహాల్ పరిధిలో అత్యధికంగా 43.8 మి.మీ వర్షపాతం నమోదైంది. న్యూమెట్టుగూడ ప్రైమరీ పాఠశాల పరిధిలో 28.3 మి.మీ, సీతాఫల్‌మండి పరిధిలో 24.3 మి.మీ, రాజీవ్‌గృహకల్ప పరిధిలో 16.0 మి.మీ వర్షం కురిసింది. నాలుగు ప్రాంతాల్లో మోస్తరు.. 16 చోట్ల స్వల్ప వర్షపాతం నమోదైంది.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

స్మార్ట్ కార్డు.. తప్పదు నిరీక్షణ

- రెండు నెలలు దాటినా అందని వైనం
- ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వాహనదారులు



ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా వాహన లైసెన్సులు, ఆర్సీలకు సంబంధించి స్మార్ట్ కార్డులు పెండింగ్‌లో ఉంటున్నాయి. కొన్ని కార్యాలయాల్లో రెండు నెలలు దాటుతున్నా వాహనదారులకు చేరడం లేదు. దీంతో వారంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాయి. గ్రేటర్ వ్యాప్తంగా నిత్యం రెండు వేల వాహనదారులు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. మరో 500 వరకు లైసెన్సులు జారీ చేస్తుంటారు. ఈ కార్డుల కోసం వాహనదారులు పోస్టల్ ఛార్జీలతో పాటు నిర్ణీత రుసుం చెల్లిస్తున్నారు. అయితే రెండు, మూడు నెలలు దాటుతున్నా కార్డు పోస్టు ద్వారా రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమ స్మార్ట్ కార్డు వేరెవరికైనా చేరిందా..? అన్న అనుమానంతో సంబంధిత ఆర్టీఏ కార్యాలయాల్లో సిబ్బందిని సంప్రదిస్తున్నారు.

టీఎస్ కోడ్ అమల్లో ఉన్నప్పుడు వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పటికీ ఇంకా చాలా మందికి స్మార్ట్ కార్డులు జారీ కాలేదు. మార్చి 12 తర్వాత టీజీ కోడ్‌ను అమల్లోకి తెస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పటికే గ్రేటర్ వ్యాప్తంగా లక్షన్నర పైగా స్మార్ట్ కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. తొలుత వీరందరికీ టీఎస్ కోడ్‌తోనే స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలని భావించినా ఇంకా కార్డులు ప్రింటింగ్ కాకపోవడంతో పెండింగ్‌లో ఉన్న కార్డులను కూడా కొత్త కోడ్‌తో జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. అవి పూర్తి స్థాయిలో ఇంకా వాహనదారులకు చేరలేదు.

దిల్లీ నుంచి రావాలి..

స్మార్ట్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ ఈసారి దిల్లీకి చెందిన సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇంతకు ముందు హైదరాబాద్‌లోనే ఈ కార్డుల ప్రింటింగ్ జరిగేది. అప్పట్లో పలుసార్లు ఈ కార్డుల పంపిణీలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. రిబ్బన్ లేదని, పెండింగ్ నిధులు విడుదల కాలేదని రకరకాల కారణాలు చెప్పి నిలిపివేశారు. తాజాగా ఇక్కడ నుంచి సమాచారం పంపించిన తర్వాత దిల్లీలో కార్డులు ప్రింటింగ్ చేసి మళ్లీ కొరియర్‌లో పంపిణీ చేస్తున్నారు. దీంతో వీటి పంపిణీలో ఆలస్యం జరుగుతోందని చెబుతున్నారు. కొత్త కోడ్ వచ్చిన తర్వాత ఇప్పటివరకు లక్షన్నర కార్డుల పైనే ప్రింటింగ్ కోసం దిల్లీకి అధికారులు పంపారు. ఇప్పటికైనా అధికారులు కార్డుల జారీపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

మూడు జోన్లు.. మూడు నెలల గడువు

వేసవి డిమాండ్ తట్టుకునేందుకు విద్యుత్తు వ్యవస్థ బలోపేతంపై దృష్టి



ఈనాడు, హైదరాబాద్: వేసవి డిమాండ్‌ను తట్టుకునేందుకు నగరంలోని మూడు జోన్ల పరిధిలో నెట్‌వర్క్ బలోపేతంపై విద్యుత్తు పంపిణీ సంస్థ దృష్టిపెట్టింది. ఇప్పటికే పలు సర్కిళ్ల పరిధిలో కొత్తలైన్లు వేస్తున్నారు. ఎల్‌టీ, 11కేవీ, 33 కేవీ లైన్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. బహుముఖ వ్యూహంతో ఈ పనులను డిస్కం చేపట్టింది. గతేడాది వేసవిలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పెరిగే డిమాండ్‌ను తట్టుకోవడం ఒకటైతే.. అంతరాయలను తగ్గించడం, సరఫరా నష్టాలకు అడ్డుకట్ట వేసేందుకు పనులు చేపట్టింది. గత వేసవిలో కొన్ని ప్రాంతాల్లో 30-50 శాతం వరకు డిమాండ్ పెరిగింది. వీటిని దృష్టిలో పెట్టుకుని 60 శాతం లోడ్ దాటిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అదనపు పీటీఆర్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఉపకేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయి. మాస్టర్‌ప్లాన్, ఆపరేషన్, కన్‌స్ట్రక్షన్ విభాగాలు పనులు చేస్తున్నాయి. వీటికి వేర్వేరు పథకాల కింద నిధులు సమకూర్చుకునేలా డిస్కం కసరత్తు చేస్తోంది. శివారుల్లో విస్తరణ పనులు ఎక్కువగా చేపట్టిన రంగారెడ్డి జోన్‌లోనే రూ.212 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మెట్రోజోన్, మేడ్చల్ జోన్‌లో పెద్ద ఎత్తున పనులను చేపట్టారు. డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులకు సీఎండీ లక్ష్యాలు నిర్దేశించారు.

సికింద్రాబాద్

•సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్



కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ సరస్వతి

విశ్వకర్మ పథకంపై అవగాహన

లాలాపేట, న్యూస్‌టుడే: తార్నాక డివిజన్ లాలాపేటలో ఆదివారం మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర నోడల్ అధికారి శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం సాంప్రదాయ కుల వృత్తుల వారికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. లబ్ధిదారుని కనీస వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. కంటి విజయ్, రాజనర్సింహ, ప్రశాంత్, యాదగిరి, కిషన్ గౌడ్, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భారతీయ కళామహోత్సవం



మణిపుర్ కళాకారులతో బ్రిటిష్ డిప్యూటీ కమిషనర్ గరేత్ విన్ ఓవెన్

బొల్లారం, న్యూస్‌టుడే: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరుగుతున్న భారతీయ కళామహోత్సవం ఆదివారం ముగిసింది. సెప్టెంబరు 28న ప్రారంభమైన ఈ మహోత్సవంలో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 430 మంది కళాకారులు గిరిజన ఉత్పత్తులు, సంస్కృతి, సంప్రదాయాలు, నృత్యాలను ప్రదర్శించారు. దక్షిణాది ప్రాంతాల్లో ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని తెలుసుకోవాలన్న ఉద్దేశంతో ఈ ఉత్సవాలను ఈశాన్య అభివృద్ధి, సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసింది. ఎనిమిది రోజుల పాటు సందర్శనకు ఉచిత అనుమతి కల్పించడంతో లక్షపైన పర్యటకులు తరలివచ్చారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చివరి రోజు బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరేత్ విన్ ఓవెన్, రక్షణ దళ ఉన్నతాధికారులు పలువురు న్యాయమూర్తులు కుటుంబాలతో కలిసి ప్రదర్శనను తిలకించారు. నిర్వహణ అధికారి రజిని ప్రియ కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (ఆదివారం నాటివి.. కిలో రూ.లో) టమాటా 59, వంగ 28, బెండ 50, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 19, క్యారెట్ 43, దొండ 50, ఆలు 38, ఉల్లి 34, సొర 19, పొట్ల 28, బీన్స్ 90, గోరుచిక్కుడు 35, చిక్కుడు 50, దోస 25, బీర 45, కాకర 38, చామగడ్డ 40, కీర 45, క్యాప్సికం 70, బీట్‌రూట్ 26, కందగడ్డ 55, చిలకడదుంప 35, మామిడి 115, మునగ 75, ముల్లంగి 6 (ఒకటి).

బతుకమ్మ వేడుకలు నేడు

బన్సీలాల్‌పేట్, రాణిగంజ్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళీ అమ్మవారి ఆలయంలో సోమవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ప్రకటనలో తెలిపారు.

అంతర్గత రహదారులకు మోక్షం



చిలకలగూడలో మరమ్మతులకు కాలిబాటను తవ్వుతున్న పొక్లెయినర్

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అంతర్గత రహదారుల పునర్నిర్మాణానికి మోక్షం లభించింది. అందులో భాగంగా సీతాఫల్‌మండి డివిజన్‌లోని రహదారులకు తాజాగా రూ.1.55 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటిల్లో పలు రోడ్లను ఇప్పటికే ప్రారంభించగా, మిగతావాటికి కూడా శంకుస్థాపన చేయనున్నారు. నవరాత్రులు అవగానే అన్ని రోడ్లను నిర్మించేలా కార్యాచరణ రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. నియోజకవర్గంలోని ఆయా డివిజన్లలోని రోడ్లను తవ్విపూడ్చివేయడంతో వర్షాలకు చెదిరిపోయి, గుంతలు తేలి ప్రమాదకరంగా మారాయి. మంచినీరు, డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణంతోపాటు వివిధ కేబుల్ లైన్లకోసం అన్ని రకాల రోడ్లను తవ్వేసి మట్టితో పూడ్చేశారు. అలా పూడ్చేసిన రోడ్లు.. వర్షాలకు, డ్రైనేజీలు పొంగి మురుగు పారడంతో అధ్వానంగా తయారయ్యై రాకపోకలకు అడ్డుగా తయారయ్యాయి. అలాంటి రోడ్లను పునర్నిర్మించాలని గతేడాదిగా యంత్రాంగం ప్రతిపాదనలు పంపగా.. వరుసగా ఎన్నికలు రావడంతో నిధుల మంజూరు ఆగిపోయింది. సర్కిల్ పరిధిలోని సీతాఫల్‌మండి, మెట్టుగూడ, బౌద్ధనగర్, తార్నాక, అడ్డగుట్ట డివిజన్ల పరిధిలోని అనేక ప్రాంతాల్లో అతుకుల, గతుకుల రోడ్లను బాగుచేయండంటూ స్థానిక ప్రజలు ఫిర్యాదుల మేరకు ఎక్కడెక్కడ నిధులు మంజూరవుతున్నాయో అక్కడ తక్షణమే పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఇరువైపులా కాలిబాటలు..

సీతాఫల్‌మండి డివిజన్‌లో అంతర్గత రహదారుల నిర్మాణాలతోపాటు డివిజన్ పరిధిలో విస్తరించిన ప్రధాన రహదారికి ఇరువైపులా కాలబాటలను కూడా నిర్మిస్తున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న రోడ్డు కుంగినట్లు ఉండడంతో ప్రయాణీకులు, వాహనదారులు అవస్థలు పడడమే కాకుండా ప్రమాదాలబారిన పడుతున్న ఫిర్యాదులు రావడంతో, ఆ ఫుట్‌పాత్ రోడ్లను ప్రధాన రోడ్డుకు సమాంతరంగా చేసే పనులకు రూ.70లక్షల విడుదలయ్యాయి. సీతాఫల్‌మండి డివిజన్‌లోని అమర్ టాకీస్ చౌరస్తా నుంచి చిలకలగూడ, మైలార్‌గడ్డ, సీతాఫల్‌మండి, నామాలగుండు మీదుగా వారాసిగూడ వరకు ఈ పనులు చేపట్టనున్నారు.



సీతాఫల్‌మండిలో తవ్వివదిలేసిన రోడ్డు

నిధులు మంజూరైనవి ప్రారంభం..

పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఇబ్బందులకు గురిచేస్తున్న అంతర్గత రోడ్లను త్వరితగతిన కొత్తగా నిర్మించాలనే ఉద్దేశంతో అధికారులు నిధులను మంజూరు చేయించి పనులు మొదలుపెట్టారు. సీతాఫల్‌మండి డివిజన్‌లో సుమారు మరో పది రోడ్లను నిర్మించేందుకుగాను రూ.2.43కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మిగతా డివిజన్లలో కూడా కోటికిపై నిధులతో పలు రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరై ఉన్న రోడ్ల నిర్మాణాలను ప్రారంభిస్తున్నామని, సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో మరిన్ని రోడ్ల నిర్మాణాలకు అవసరమైన నిధులకోసం ప్రతిపాదనలు పంపించినట్లు సర్కిల్ డీసీ సుభాష్‌రావు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



పార్టీ నాయకులతో డా.కోట నీలిమ

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అందరం కలిసి పనిచేద్దామని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి డా.కోట నీలిమ నాయకులకు సూచించారు. అమీర్‌పేట డీకే రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నాయకులతో సమావేశం నిర్వహించారు. దేవి శరన్నవరాత్రులు జరుగుతున్న నేపథ్యంలో ఆయా దేవాలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అమీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రావు, నాయకులు నవీన్‌రాజు, గోవింద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతకు అద్దంపట్టేలా...



సంస్కృతిక కార్యక్రమాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శన

బన్సీలాల్‌పేట్ రాణిగంజ్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళీ అమ్మవారి ఆలయంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న సంస్కృతిక కార్యక్రమాలు మరింత వైభవాన్ని పెంచుతున్నాయి. మయూరి నృత్యాలయ, నాట్యమయూరి డాన్స్ అకాడమీ నేతృత్వంలో సాగిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

సికింద్రాబాద్ : 8008573368
కంటోన్మెంట్ : 8008573361
సనత్‌నగర్ : 8008573356

రెజిమెంటల్‌బజార్, కంటోన్మెంట్, న్యూస్‌టుడే:

? సికింద్రాబాద్‌లోని సెకండ్‌బజార్‌లో పారిశుద్ధ్య సమస్య ఎక్కువగా ఉంది. పారిశుద్ధ్య సిబ్బంది రాకపోవడంతో చెత్త చెదారం రోడ్లపై పేరుకుపోయింది. – నారాయణ సెకండ్‌బజార్

✓ సెకండ్‌బజార్‌లో రోజూ పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. –డీఈ ధర్మారెడ్డి

? బదే వార్డు పరిధిలోని కాకాగూడ కాలనీల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. –మంగ, కాకాగూడ

✓ కాకాగూడ కాలనీల్లో వీధి కుక్కలను పట్టుకుంటాం. – ఆకుల మహేందర్, పారిశుద్ధ్య విభాగాధిపతి.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కార్యాలయానికి పుష్పగుచ్ఛం, లేఖను పంపారు. దీంతోపాటు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. తనకు శుభాకాంక్షలు తెలపడం పట్ల ఎమ్మెల్యే తలసాని సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు.

సంజీవరెడ్డినగర్: ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ తెలిపారు. హనుమాన్ దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి వేడుకల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు.

* మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానంలో భారాస నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.



ఎల్లమ్మకు పూజలు చేస్తున్న శేషుకుమారి, భారాస నాయకులు

పద్మారావునగర్: ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం బన్సీలాల్‌పేట్ డివిజన్ తలసాని ఫాలోవర్స్ యువ నాయకులు సీనియర్ నాయకుడు నాగుల ప్రేమ్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్ బండ్ ప్రాంతంలో ఉన్న గోశాలలో గోమాతకు పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రోత్సవాలు



బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



సనత్‌నగర్: హనుమాన్ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని



బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో సినీనటుడు గోపీచంద్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దేవి శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.
– న్యూస్‌టుడే, బృందం



సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి ముత్యాలమ్మ ఆలయంలో కుంకుమార్చనలో మహిళలు



న్యూబోయిన్‌పల్లి హర్షవర్ధన్‌కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఛండీ హోమం చేస్తున్న స్థానికులు

పూల పండగ.. సంబరం మెండుగ

సంజీవరెడ్డినగర్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండగ ప్రజలందరికీ సుఖసంతోషాలు పంచాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. సనత్‌నగర్ నియోజకవర్గం భాజపా ఆధ్వర్యంలో అమీర్‌పేట మున్సిపల్ మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన సతీమణి కావ్యారెడ్డితో కలిసి పాల్గొన్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాలని తేడా లేకుండా రాష్ట్ర ప్రజలు ఈ బతుకమ్మ, దసరా వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జెక్ కాలనీలోని వనమాల రెసిడెన్సీలో..

సనత్‌నగర్: అమీర్‌పేటలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. సనత్‌నగర్ జెక్ కాలనీలోని నార్త్‌స్ట్రీట్‌లోని వనమాల రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వద్ద వేడుకలు నిర్వహించారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్లు తదితరులు

శారీరక శ్రమకు కొంత సమయం కేటాయించాలి

పద్మారావునగర్ : మారుతున్న జీవన విధానంలో రోజూ శారీరక శ్రమకు అందరూ కొంత సమయాన్ని కేటాయించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెక్లెస్ ప్రైడ్ పార్కులో గెయిల్ సంస్థ సీఎస్ఆర్ సమాకూర్చిన ఓపెన్ జిమ్ ఆయన ప్రారంభించారు. నెక్లెస్ ప్రైడ్ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ సమీర్, వైస్ ప్రెసిడెంట్ కటకం యాదగిరి పాల్గొన్నారు.

గాంధీ నుంచి హత్యాచార బాధితురాలి డిశ్చార్జి

గాంధీఆసుపత్రి : ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో జరిగిన హత్యాచారయత్నం ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆదివాసీ మహిళ గాంధీ ఆసుపత్రిలో కోలుకుని ఆదివారం డిశ్చార్జి అయ్యింది. మంత్రి సీతక్క ఆసుపత్రికి వచ్చి ఆమె యోగక్షేమాలు తెలుసుకొని, సొంతూరికి పంపించారు.

విజ్ఞాన భాండాగారం.. ఎస్సార్‌నగర్ గ్రంథాలయం



సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: విజ్ఞాన భాండాగారంగా ఎస్సార్‌నగర్ గ్రంథాలయం కొనసాగుతోంది. నిత్యం వందల మంది యువతీయువకులు ఇక్కడకు వచ్చి వారికి కావల్సిన పుస్తకాలు చదువుతూ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటుకుంటున్నారు. ఇక దినపత్రికలు, నవలలు, డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించిన పుస్తకాలు ఇక్కడ అనేకం ఉన్నాయి. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ గ్రంథాలయం తెరచి ఉంటుండడంతో దూర ప్రాంతాల నుంచి పాఠకులు ఇక్కడకు వస్తున్నారు. సుమారు 40 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఈ గ్రంథాలయానికి నేటికీ ఆదరణ తగ్గలేదు. అధిక సంఖ్యలో పాఠకులు వచ్చే వాటిలో నగరంలో ఎస్సార్‌నగర్ గ్రంథాలయం మూడో స్థానంలో ఉంది.



గ్రంథాలయంలోని పుస్తకాలు, చదువుకుంటున్న పాఠకులు

వేల సంఖ్యలో పుస్తకాలు

ఈ గ్రంథాలయంలో వేల సంఖ్యలో పుస్తకాలు ఉన్నాయి. మొదట్లో 15వేల పైచిలుకు పుస్తకాలు ఉండేవి. మిస్సింగ్, డామేజ్ పోను ప్రస్తుతం తెలుగు, హిందీ, ఆంగ్లం, మరాఠీకి సంబంధించిన పుస్తకాలు 7057 ఉన్నాయి. వీటికి అదనంగా పోటీ పరీక్షల పుస్తకాలు, అన్ని భాషల దినపత్రికలు అందుబాటులో ఉంటాయి. ఈ గ్రంథాలయంలో 1335 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. ఎస్సార్‌నగర్ అంటేనే సరస్వతీ నిలయం. పేరున్న విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లు ఎన్నో ఇక్కడ ఉన్నాయి. వీటికి వచ్చే విద్యార్థులు, యువతీయువకులు ఖాళీ సమయంలో గ్రంథాలయాన్ని వినియోగించుకుంటారు. పోటీ పరీక్షలకు సంబంధించి ఖరీదైన పుస్తకాలూ ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఇక పార్కు మధ్యలో గ్రంథాలయం ఉండటం, చుట్టూ పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం ఈ గ్రంథాలయం ప్రత్యేకత. ఇక్కడ పుస్తకాలు చదివి కానిస్టేబుళ్లు, ఎస్సై ఉద్యోగాలకు ఎంపికైన వారూ ఉన్నారని గ్రంథపాలకుడు హరిబాబు చెప్పారు.

మొదటి అంతస్తు వేయాలి

ప్రస్తుతం ఉన్న గ్రంథాలయ భవనం ఇరుకుగా ఉంది. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు పెరగడంతో కూర్చోవడానికి చోటు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గ్రంథాలయం భవనంపై మొదటి అంతస్తు ఏర్పాటు చేస్తామని సంబంధిత అధికారులు చెప్పినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. పాఠకులకు అనుగుణంగా గ్రంథాలయంలో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పాఠకులు కోరుతున్నారు.

నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలి

బౌద్ధనగర్, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 9న ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు నిర్వహించనున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్ఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఎమ్ఎస్పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఎమ్ఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ ప్రదీప్ మాదిగ, తుమ్మల శివప్రసాద్ మాదిగ, కొప్పుల సాయికుమార్ మాదిగ, త్రినేత్ర మాదిగ, దేవేందర్ మాదిగ, మహేష్ మాదిగ, గిరి మాదిగ తదితరులు పాల్గొన్నారు

మ్యాన్‌హోల్‌పై మూత పెట్టేదెన్నడో..



బౌద్ధనగర్ డివిజన్ జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న సంగీత్ కాలనీ ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ మూత పగిలి పోవడంతో అందులో ఎవరైనా పడిపోతారేమో అని స్థానికులు విరిగిన కుర్చీని అడ్డుగా పెట్టి జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. సిబ్బంది వచ్చి అడ్డుగా ఇనుప కంచెను పెట్టారు. కానీ నూతన మూత పెట్టలేదని, ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
– న్యూస్‌టుడే, సికింద్రాబాద్

మహిళ అదృశ్యం

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. తుకారాంగేట్ సీఐ శంకర్‌నాయక్ కథనం ప్రకారం.. తుకారాంగేట్‌లో ఉంటున్న ఎన్.రోసీ(30) గృహిణి. ఈ నెల 5న ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఎక్కడ వెతికినా కనిపించలేదు. అదే రోజు రాత్రి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక వ్యాధులపై అవగాహనకు వాకథాన్



సంజీవయ్య పార్కులో నిర్వహించిన వాకథాన్‌లో వైద్యులు తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: వరల్డ్ మెంటల్ హెల్త్ అవేర్నెస్ వీక్‌లో భాగంగా ఎర్రగడ్డలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ (ఐఎంహెచ్) ఆధ్వర్యంలో మానసిక వ్యాధులపై అవగాహన కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కులో మానసిక వ్యాధులపై పనిచేస్తున్న పలు సంస్థలతో కలిసి దీన్ని నిర్వహించారు. ఐఎంహెచ్ సూపరింటెండెంట్ డా.అనిత, హెచ్ఓడీ సుధ ఆధ్వర్యంలో జరిగిన వాకథాన్‌లో సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.అశోక్, ప్రధాన కార్యదర్శి డా.విశాల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు డా.నరేష్, మెంటల్ హెల్త్ కమిటీ ఛైర్మన్ డా.జార్జ్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు డా.ఫణికాంత్, డా.రిషికేష్, డా.రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

గజల్స్‌తో ప్రజల్లో చైతన్యం

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు, భాష, భావనతో మంచి కూర్పు చేసి రాసే గజల్స్ ప్రజల్లో ఎంతో చైతన్యం తెస్తాయని ఎమ్మెల్సీ, ప్రముఖ ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజల్స్ విప్లవాత్మక చైతన్యానికి దోహదపడుతాయని తెలిపారు. కవులు కొత్త గజల్స్‌ను వెలుగులోకి తేవడం అభినందనీయమని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ పేర్కొన్నారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్: (ఆదివారం నాటివి..కిలో రూ.లో) టమాటా 59, వంగ 28, బెండ 50, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 19, క్యారెట్ 43, దొండ 50, ఆలు 38, ఉల్లి 34, సొర 19, పొట్ల 28, బీన్స్ 90, గోరు చిక్కుడు 35, చిక్కుడు 50, దోస 25, బీర 45, కాకర 38, చామగడ్డ 40, కీర 45, క్యాప్సికం 70, బీట్‌రూట్ 26, కందగడ్డ 55, మునగ 75, ముల్లంగి 6(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టమాటా రూ.63, వంగ 40, బెండ 45, పచ్చిమిర్చి 28, కాకర 38, బీర 60, క్యాబేజీ 21, బీన్స్ 95, క్యారెట్ 41, దొండ 45, చిక్కుడు 45, క్యాప్సికం 70, ఆలు 38, కీర 26, దోస 23, చామగడ్డ 37, అరటి 10, బీట్‌రూట్ 25, సొర 19, గోకర 35.

తరంగ్‌నైట్స్ పేరుతో అనుమతి లేకుండా వేడుకలు

అల్వాల్, న్యూస్‌టుడే: దాండియా పేరుతో అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించిన వారిపై అల్వాల్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి మచ్చబొల్లారంలోని పెంటారెడ్డి గార్డెన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు తరంగ్‌నైట్స్ పేరుతో వేడుకలు నిర్వహించారు. వారం రోజులుగా భారీ ఎత్తున ప్రచారం చేశారు. చివరి రోజు పెద్ద ఎత్తున యువత తరలిరావడంతో అధిక ధరలకు టికెట్లను అమ్ముకున్నారు. దీంతో పాటు సందర్శకుల వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించకపోవడంతో డీఏడీ కాలనీ, గోపాల్‌నగర్, సాయికాలనీ, తిరుమల ఎన్‌క్లేవ్, సర్వేసన్‌గుట్ట ప్రాంతాల్లో వీధుల్లో నిలిపారు. కార్యక్రమంలో డీజేను ఉపయోగించడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఫిర్యాదు రావడంతో పోలీసులు వేడుకలను నిలిపివేయించి కేసు నమోదు చేశారు.

అలరించిన సంగీత విభావరి



గౌతంనగర్, న్యూస్‌టుడే: కూచిపూడి నృత్య భారతి అకాడమీ ఆధ్వర్యంలో దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా మల్లికార్జున్‌నగర్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భక్తి సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. కళాకారులు వాయించిన అమ్మ ఆనందదాయిని, శ్రీగణనాథం, భజామ్యహమ్, అంబవాణి, భజగోవిందం తదితర కీర్తనలు ఆకట్టుకున్నాయి. వేణువు రమణ, విశాల్, కీర్తి, యశస్వీ, వీణ దివ్య గాయిత్రి, అచ్యుతానంద మృదంగ సహకారం అందించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి వస్త్రదానం

మౌలాలి, న్యూస్‌టుడే: దీన్‌దయాల్‌నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బందికి ఆదివారం వస్త్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈటల జమున హాజరై మాట్లాడారు. స్వచ్ఛ నగరంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం అన్నారు. కార్యక్రమంలో గున్నాల చంద్రశేఖర్ యాదవ్‌తో పాటు పలువురు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూడలిలో ప్రయాణం.. నిత్యం నరకం

ఓల్డ్ అల్వాల్‌లో ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

అల్వాల్, న్యూస్‌టుడే: ఓల్డ్ అల్వాల్ కూడలిలో వాహనదారులు, ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. పెరిగిన రద్దీకి తగ్గట్టుగా ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడమే సమస్యలకు కారణమవుతోంది. మద్యం, కల్లు దుకాణాలకు తోడు షాపింగ్‌మాల్స్, వాణిజ్య భవనాలు బస్టాండ్ చౌరస్తాలో ఉండడంతో కొనుగోలుదారులు వారి వాహనాలను అక్కడే రోడ్డు వెంట నిలుపుతుండడంతో రద్దీ మరింత పెరుగుతోంది. సెలవు రోజుల్లో అయితే గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో పలువురు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



ఇష్టానుసారంగా వాహనాల రాకపోకలు

దుకాణాల ముందు వాహనాలు నిలపడంతోనే..

చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణం వివిధ దుకాణాల ముందు రోడ్డుపై నిలుపుతున్న వాహనాలే. చౌరస్తాను ఆనుకొని ఆయా దుకాణాలు ఉండడంతో మత్తులో పలువురు వాహనాలకు అడ్డొస్తున్నారు. కూడలిలోనే బస్టాండ్ ఉండటంతో చౌరస్తాలోని పెట్రోల్ బంకు వద్ద ఉదయం, సాయంత్రం సమయాల్లో లారీలను నిలుపడంతో సమస్యను మరింత జఠిలం అవుతోంది. ఇటీవల ఫుట్‌పాత్ వ్యాపారుల సంఖ్య పెరిగింది. పండ్లు, పూలు తదితర సీజనల్ వ్యాపారాన్ని రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. కొనుగోలుదారులు వాహనదారులకు ఇబ్బందికరంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

చౌరస్తా విస్తరించాలన్న ప్రతిపాదన ఉన్నా...

చౌరస్తాలో నెలకొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సిబ్బంది, పోలీసుల గస్తీని ఏర్పాటు చేయాలని స్థానికులు నుంచి విజ్ఞప్తులు ఉన్నాయి. ట్రాఫిక్ విభాగానికి గుర్తొచ్చినప్పుడే అన్నట్లుగా కానిస్టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వీరు కూడా చలాన్లు వేయటానికే పరిమితమవుతున్నారు. పోలీసులు రాత్రి సమయాల్లో మద్యం దుకాణాలను నిర్ణీత సమయాల్లో మూసివేయించడమే తమ బాధ్యత అన్నట్లుగా ఉంటున్నారు. మిగతా సమయాల్లో పత్తా ఉండడం లేదు. చివరకు పగటి పూట మందుబాబులతో సమస్యలు వస్తున్నాయని బస్టాండ్‌లోని మహిళలు వాపోతున్నా అటువైపు కన్నెత్తి చూసే నాథుడు కరవయ్యారు. మరోవైపు కూడలిని విస్తరించాలన్న ప్రతిపాదన ఉంది. 2009 ఎన్నికల నుంచి నేతలూ హామీలు ఇస్తున్నారు. కానీ ప్రయోజనం లేకుండా పోయింది. కొన్ని నెలల క్రితం డివైడర్లను ఏర్పాటు చేశారు. విస్తరణ లేకుండా ఏర్పాటు చేసిన వీటితో రోడ్డు విస్తీర్ణం తగ్గి ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేశారు. విస్తరణ లేకపోవడంతో వీటివల్ల కూడా సమస్య తీవ్రమవుతోంది.

చర్యలు తీసుకుంటాం..

– నాగరాజు, సీఐ ట్రాఫిక్ విభాగం

కూడలిలో ట్రాఫిక్ సమస్యలపై అధ్యయనం చేసి సిబ్బందిని ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. రోడ్లపై వాహనాలు నిలిపితే కేసులు నమోదు చేస్తాం. కూడలిలో వాహనదారులకు, ప్రయాణికులకు అసౌకర్యంగా మారిన దుకాణాల యజమానులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

గౌతంనగర్, మల్కాజిగిరి, డిఫెన్స్ కాలనీ, అల్వాల్, న్యూస్‌టుడే:

? గౌతంనగర్ 19వ వీధిలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. – పాండు, గౌతంనగర్

✓ చెత్త నిల్వలను డంపింగ్ యార్డుకు తరలిస్తాం.
–నాగరాజు, పారిశుద్ధ్య నిర్వహణ సూపర్‌వైజర్

? మల్కాజిగిరి డివిజన్ ఆనంద్‌బాగ్, భ్రమరాంబిక నగర్‌లలో చెత్తకుప్పలను తొలగించడం లేదు. – వసంత, కాలనీవాసి

✓ చెత్తకుప్పలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, పర్యవేక్షకుడు, సర్కిల్ పారిశుద్ధ్య విభాగం

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి బస్తీలోని పోచమ్మ ఆలయం ఎదురు వీధిలో రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. అపరిశుభ్రంతో ఇబ్బందులు పడుతున్నాం. – పెంటయ్య, స్థానికుడు

✓ చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలిస్తాం.
–నాగరాజు, పారిశుద్ధ్య అధికారి

? మచ్చబొల్లారంలోని డీఏడీ కాలనీలో విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేశారు. కానీ వీధిదీపం ఏర్పాటు చేయకపోవడంతో వీధిమొత్తం చీకటిగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. –రాజమల్లయ్య, స్థానికుడు

సమాధానం: వీధిదీపం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.
– రఘుపతిరెడ్డి, డీఈ, వీధిదీపాలు

ఆర్యూబీల నిర్మాణం పూర్తి చేయాలని వినతి

గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్, అల్వాల్ పరిధిలో పెండింగులో ఉన్న ఆర్యూబీల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరికి చెందిన సబర్బన్ ట్రైన్ అండ్ ట్రావెల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, డీఆర్‌యూసీసీ సభ్యుడు నూర్ ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సికింద్రాబాద్-గోవా రైలు ప్రారంభోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లో మంత్రిని నూర్ కలిసి మాట్లాడారు. మల్కాజిగిరి స్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తయిన వెంటనే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలన్నారు. ఆనంద్‌బాగ్, లయోలా కళాశాల ప్రాంతంలో కొత్త ఎంఎంటీఎస్ స్టేషన్లు నిర్మించాలని కోరారు.

కంటి అద్దాల పంపిణీ

గౌతంనగర్, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి సెంట్రల్ ఆధ్వర్యంలో గత నెల 28న వాణీనగర్ సామాజిక భవనంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పలువురు పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 56 మందికి ఆదివారం కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా చేయించనున్నట్లు తెలిపారు.

మహిళా శక్తిని దసరా ఉత్సవాలు చాటుతాయి



సుజాతను సత్కరిస్తున్న నేతలు

అల్వాల్, న్యూస్‌టుడే: మహిళా శక్తిని దసరా ఉత్సవాలు చాటుతాయని బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయిప్రసాద్ అన్నారు. శనివారం మచ్చబొల్లారంలో ఓబీసీ సెల్ ప్రచారకార్యదర్శి మోయి సుజాత, ప్రసన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలను ఐక్యంగా ఉంచడమే పండగల ఉద్దేశమన్నారు. భారతీయ పండగల్లో ప్రకృతి రక్షణ కోరుతూ ఆరాధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సుదర్శిని, దివాకర్, వెంకటేశ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారోత్సవంలో ఫోరం కమిటీ సభ్యులు

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వీరస్వామి, ఇంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌రెడ్డి కోశాధికారిగా సుదర్శన్, మీడియా అధికార ప్రతినిధిగా గగన్‌కుమార్, మహిళా అధ్యక్షురాలిగా అనంత లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా జానకిరెడ్డి నియమితులయ్యారు. అనంతరం అల్వాల్‌లోని ఆచార్య జయశంకర్ విగ్రహం వద్ద తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు శివకుమార్ కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం పనిచేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా అవసరం



మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయశాంతి

అల్వాల్: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా అవసరమని కార్పొరేటర్ విజయశాంతి అన్నారు. ఆదివారం మహర్షి పతంజలి యోగా, హెల్త్ కేర్ కేంద్రం ఆధ్వర్యంలో ఓల్డ్‌అల్వాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. యోగాతో అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. యోగా గురువు నారాయణ గోపినాథ్ ఆధ్వర్యంలో బాలలకు అవగాహన కల్పించారు.

అన్న ప్రసాదిని.. అభయ ప్రదాయిని



సంతోష్‌నగర్‌లో గాయత్రిదేవి అలంకరణలో..



ఆనంద్‌బాగ్ లలితాపరమేశ్వరి గుడిలో..



టెంపుల్ అల్వాల్ ఉమా చంద్రమౌళేశ్వర ఆలయంలో..



మౌలాలిలోని అష్టలక్ష్మీ దేవాలయంలో..



సైనిక్‌పురి శృంగేరి శంకర్ మఠంలో వైష్ణవ మాతగా..

మల్కాజిగిరి, గౌతంనగర్, న్యూస్‌టుడే: నవరాత్రుల్లో నాలుగోరోజైన ఆదివారం మల్కాజిగిరిలోని అమ్మవారి ఆలయాలను భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. తూర్పు ఆనంద్‌బాగ్ డివిజన్ అనంత సరస్వతీనగర్‌లోని జ్ఞాన సరస్వతీదేవిని అన్నపూర్ణమాతగా అలంకరించి 108 రకాల ప్రసాదాలను నైవేద్యం పెట్టారు. సాయిబాబా ఆలయం, లలితా పరమేశ్వరి దేవాలయంలోని అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించి పూజలు చేశారు. ★ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గౌతంనగర్ డివిజన్ యాదవనగర్ సిద్ధి వినాయక ఆలయంలోని మండపం వద్ద కార్పొరేటర్ మేకల సునీతాయాదవ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతోష్‌నగర్ అంబ, భవాని అమ్మవార్లు గాయత్రి దేవి అలంకరణలో ప్రత్యేక పూజలందుకున్నారు. సీతారాంనగర్ ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. సాయినగర్ మండపం, గౌతంనగర్ దుర్గాభవాని ఆలయం, ఇందిరానెహ్రూనగర్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష కుంకుమార్చనలో ఎంపీ ఈటల సతీమణి

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: దీన్ దయాల్‌నగర్‌లోని విజయ వినాయక పంచాయతన దేవాలయంలో ఆదివారం జరిగిన లక్ష కుంకుమార్చనలో ఎంపీ ఈటల రాజేందర్ సతీమణి జమున పాల్గొన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళల సామూహిక లక్ష కుంకుమార్చన జరిగింది. దీన్ దయాల్‌నగర్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ఆదివారం అన్నపూర్ణాదేవిగా అలంకరించి అన్న ప్రసాదం నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేశారు. కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, మహిళా సంఘం అధ్యక్షురాలు సంగీత, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ దేవి రూపంలో అమ్మవారు

అల్వాల్, న్యూస్‌టుడే: అల్వాల్‌లోని అమ్మవారి మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. టెంపుల్ అల్వాల్‌లోని ఉమాచంద్రమౌళీశ్వర, మరకత లక్ష్మీగణపతి ఆలయంలో కుంకుమార్చనలు నిర్వహించారు. భారతినగర్‌లోని లక్ష్మీదేవి ఆలయంలో ఎంబీసీ మాజీ ఛైర్మన్ నందికంటి శ్రీధర్ పూజలు చేశారు.

రుద్ర మృత్యుంజయ హోమం

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: సఫిల్‌గూడ విజయదుర్గా కట్టమైసమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రుద్ర మృత్యుంజయ మహాహోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దీన్ దయాల్‌నగర్‌లోని ఆలయంలో జమున



యాదవనగర్ ఆలయంలో కార్పొరేటర్ సునీతాయాదవ్ తదితరులు



మధురానగర్ మైదానంలో..

పూల పండగ.. సంబరం మెండుగా



అల్వాల్, న్యూస్‌టుడే: జ్యోతినగర్‌లో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఓల్డ్‌అల్వాల్, కౌకూర్‌లోనూ వేడుకలను నిర్వహించారు. బతుకమ్మ పాటలతో మహిళలు ఆకట్టుకున్నారు.

స్థల వివాదం.. ఇరు వర్గాలపై కేసు

గౌతంనగర్, న్యూస్‌టుడే: స్థలం మాదంటే మాది అని ఇరు వర్గాలు గొడవ పడిన సంఘటన మల్కాజిగిరి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సత్యనారాయణ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమల నగర్‌లోని 398, 399, 409, 410, 411/1, 411/2 సర్వే నంబర్లలో మల్కాజిగిరి మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి ఆధీనంలో 1969 నుంచి 19 ఎకరాల 20 గుంటల స్థలం ఉంది. ఆ స్థలం తమ పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిందని పేర్కొంటూ మజీద్ షరీఫ్ అనే వ్యక్తి తన అనుచరులతో శనివారం స్థలం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

కాచిగూడ, న్యూస్‌టుడే:: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం... ఆదివారం బుద్వేల్ స్టేషన్ వద్ద కాటేదాన్ బాబుల్‌రెడ్డినగర్‌కు చెందిన వినోద్‌కుమార్(30) పట్టాలను దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మరో ఘటనలో రోడ్డు దాటుతూ..

నల్లకుంట, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లకుంట ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... విద్యానగర్‌లోని ముస్లీం లేన్‌లో నివాసం ఉంటున్న కైసర్‌ఖాన్(55) పంక్చర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం మందులు కొనుగోలు చేసేందుకు విద్యానగర్ - అడిక్‌మెట్ రోడ్డు దాటుతుండగా కారు ఆయన్ను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడగా క్షతగాత్రుడిని స్థానికులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి బంధువు మహ్మద్ ఆయూబ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

'ఛత్తీస్‌గఢ్ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి'

నల్లకుంట, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ పేరుతో 4వ తేదీన 31 మందిని మావోయిస్టు కార్యకర్తలను అన్యాయంగా చంపడాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివారం ఆయన పేర్కొన్నారు. మృతుల వివరాలు ఇప్పటికీ ప్రకటించకపోవడం చట్ట విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఈ చర్యలకు పాల్పడినట్లు తెలుస్తోందని, కొంతకాలం నుంచి 180 మందిని అన్యాయంగా హతమార్చారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రమాదం అంచున ప్రయాణం!



తొందరగా గమ్యం చేరుకోవాలన్న తపనతో కొంతమంది యువకులు ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. మల్కాజిగిరి-సాయినగర్ ప్రధాన మార్గంలో ఓ యువకుడు సైకిల్‌పై వెళ్తూ ఆటోలో కూర్చున్న తన స్నేహితులతో మాట్లాడుతూ ఒక చేత్తో ఆటోను పట్టుకుని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాడు. దీంతో ఆ ఆటో వెనుక వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

-న్యూస్‌టుడే, గౌతంనగర్

నీటి మడుగు.. ఎలా వేయాలి అడుగు?



వర్షం పడితే చాలు రోడ్లపై నీరు నిలిచి వారాలు గడిచినా అలాగే ఉండిపోతుంది. ఎండలకు ఎండి బురదగా మారాల్సిందేగాని.. నీరెళ్లే మార్గం, వాటిని తొలగించే సిబ్బంది గానీ ఉండడం లేదు. నిర్మల్ నగర్ చౌరస్తా సమీపంలో, రామకృష్ణాపురం వంతెన కింద నీరు మడుగును తలపిస్తోంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

-న్యూస్‌టుడే, డిఫెన్స్ కాలనీ

ఆకర్షణీయం.. భక్తిభావం



గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లోని మల్లన్నగుడిలో ఒకే రాతిపై నంది, శివ పార్వతులతో పాటు వినాయకుడు, కుమార స్వామి విగ్రహాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు రామస్వామి నేతృత్వంలో తయారు చేయించి ప్రతిష్ఠించారు. ఆలయంలో నూతనంగా నెలకొల్పిన ఈ విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

– న్యూస్‌టుడే, గౌతంనగర్

గజల్స్‌తో ప్రజల్లో చైతన్యం

బాగ్‌లింగంపల్లి: పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు, భాష, భావనతో మంచి కూర్పు చేసి రాసే గజల్స్ ప్రజల్లో ఎంతో చైతన్యం తెస్తాయని ఎమ్మెల్సీ, ప్రముఖ ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ వార్షికోత్సవ సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ.. గజల్స్ విప్లవాత్మక చైతన్యానికి దోహదపడుతాయన్నారు. కవులు కొత్త గజల్స్‌ను వెలుగులోకి తేవడం అభినందనీయమని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ పేర్కొన్నారు. అనంతరం కవులను జ్ఞాపికలతో సత్కరించారు. సభకు కవి బిక్కి కృష్ణ అధ్యక్షత వహించారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నర్సింహప్ప, డా.విజయలక్ష్మిపండిట్, సీనియర్ జర్నలిస్టు భగీరథ, ఐఆర్ఎస్ అధికారి జల్ది విద్యాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

బిహార్ మాజీ మంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్‌కు ఘన స్వాగతం


గజమాలతో సత్కరిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, అంజన్‌కుమార్ యాదవ్, అరవింద్‌కుమార్ యాదవ్

రాంనగర్, న్యూస్‌టుడే: లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు బిహార్ రాష్ట్ర మాజీ మంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్ హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా ఆదివారం మాజీ ఎంపీ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.అంజన్‌కుమార్ యాదవ్ ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. భారీ గజమాలతో సత్కరించారు. ముషీరాబాద్ నుంచి ర్యాలీగా ఆదర్శ్‌నగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరెస్సెస్ విజయ దశమి వేడుకలు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఆధ్వర్యంలో విజయ దశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అంబర్‌పేటలో ఆరెస్సెస్ కార్యకర్తల కవాతు సాగింది. న్యూ పటేల్‌నగర్‌లో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, భాజపా నేత దయాకర్‌యాదవ్ పూలను చల్లి కవాతుకు స్వాగతం పలికారు.


ఆరెస్సెస్ కార్యకర్తల కవాతు

శంకరమఠంలో బాలపూజ


పూజలో చిన్నారులు, నిర్వాహకులు

నల్లకుంట: నల్లకుంటలో బాలపూజ ఘనంగా నిర్వహించారు. ఆరెస్సెస్, మాతా వాకర్స్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నల్లకుంటలోని శంకరమఠం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలువురు చిన్నారులకు బాలపూజ చేపట్టారు. హరినాథ్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, సురేశ్, సంగీత, మురళీకృష్ణ, లలితకుమారి, విజితారెడ్డి, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోల్నాకలో కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (ఆదివారం నాటివి... కిలోకు రూపాయల్లో) టమాటా 40, ఆలుగడ్డ 40, వంకాయ 40, బెండ 60, దొండ 40, దోసకాయ 30, కాకర 50, బీర 60, సోర 30, క్యాబేజీ 35, క్యాప్సికం 50, బీన్స్ 70, చిక్కుడు 60, క్యారెట్ 45, బీట్‌రూట్ 40, ఉల్లిగడ్డ 40, పచ్చిమిర్చి 40, వెల్లుల్లి 350, అల్లం 80.

దసరా పండుగొచ్చె.. ప్రత్యేక బస్సులొచ్చె

ఆర్టీసీ కాచిగూడ డిపో నుంచి జిల్లాలకు ప్రయాణం

కాచిగూడ, న్యూస్‌టుడే: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ కాచిగూడ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు నగరాలు, పట్టణాలకు బస్సులు బయలుదేరి వెళుతున్నాయి. పాఠశాలలకు ఈనెల 2, ఇంజినీరింగ్ తదితర కళాశాలలకు 6 నుంచి ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించింది. దీంతో నగరంలో నివాసం ఉండే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు పండుగను సొంతూళ్లలో జరుపుకోవడానికి తమ కుటుంబాలతో ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో 8, 9, 10, 11 తేదీల్లో ప్రతి రోజు నగరం నుంచి 800 బస్సులను నడపాలని ఆర్టీసీ ప్రణాళికను సిద్ధం చేసింది.

శనివారం నుంచే ప్రారంభం

ఆర్టీసీ కాచిగూడ డిపో నుంచి శనివారం నుంచే పండుగకు ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. తమ స్వస్థలాలకు వెళ్లేందుకు నగరవాసులు అధిక శాతం ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో పోల్చుకుంటే ఆర్టీసీ టిక్కెట్ ధర తక్కువగా ఉండటమే అందుకు కారణం. మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో ఆర్టీసీ బస్సులు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి.



కాచిగూడ డిపోలోని మొత్తం బస్సులు: 102
జిల్లాలకు వెళుతున్నవి: 20–30(రోజుకు సగటున)
డ్రైవర్లు: 236; కండక్టర్లు: 248

ఆయా నగరాలకు..

డిపో నుంచి బస్సులు గౌలిగూడలోని ఎంజీబీఎస్ స్టేషన్‌కు వెళుతున్నాయి. అక్కడి నుంచి ప్రస్తుతం జడ్చర్ల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, అలంపూర్, కర్నూల్, ఖమ్మం, సూర్యాపేట, కోదాడ, విజయవాడ వెళ్తాయి. రానున్న రోజుల్లో బస్సులను ఇతర నగరాలు, పట్టణాలకు కూడా నడిపే అవకాశం ఉంది.

రద్దీకి అనుగుణంగా..

–రమ, ఆర్టీసీ డిపో మేనేజర్, కాచిగూడ

ప్రస్తుతం నడుపుతున్న వాటికి తోడు రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులను పంపడానికి సిద్ధంగా ఉన్నాం. పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

ముషీరాబాద్, న్యూస్‌టుడే:

? గాంధీనగర్ డివిజన్ లేబర్ కమిషనర్ ఆఫీస్ ఎదురు వీధిలోని పాదబాటపై బండలు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి.
– భాస్కర్ రావు, స్థానికుడు

✓ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. -సన్నీ, జీహెచ్ఎంసీ డీఈ

అమరవీరుల త్యాగాలను గుర్తించండి


మాట్లాడుతున్న రాజేందర్‌పటేల్‌గౌడ్

గోల్నాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అమరవీరుల త్యాగాలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. గత భారాస ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఆదివారం నింబోలిఅడ్డలో ఆయన మాట్లాడారు. అమరవీరుల కుటుంబాలకు రెండు పడక గదుల ఇళ్లు, పింఛన్, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నేతలు పులిజాల కృష్ణ, మెట్టు ముత్యాల్‌రావు, డా.ప్రశాంత్, భూషణ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి


బుచ్చిరెడ్డిని సన్మానిస్తున్న కోటయ్య తదితరులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు నగరంలో వెయ్యి చదరపు గజాల స్థలం కేటాయించాలని టీజీ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం సుందరయ్య కళానిలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ కోటయ్య మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఆర్టీసీ సంస్థకు ఎన్నో సేవలందించిన తమకు ఈపీఎఫ్ పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. ఆసరా, తెల్లరేషన్‌కార్డులను జారీ చేయాలని కోరారు. రెండు పడక గదుల ఇళ్లను కేటాయించాలని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా బుచ్చిరెడ్డి, రీజనల్ హైదరాబాద్ అధ్యక్షుడు పూస నర్సింహ, కన్వీనర్‌గా యాదగిరి తదితరులను ఎన్నుకున్నారు.

గృహ హింస నిరోధానికి కృషి


స్వరూపను సన్మానిస్తున్న పద్మ, మాజీ కార్పొరేటర్ పద్మావతి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: గృహ హింస నిరోధానికి కృషి చేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి పద్మ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో సయోధ్య ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో పొదుపు, మహిళా సంఘాల ప్రతినిధులను మాజీ కార్పొరేటర్ పద్మావతితో కలిసి ఆమె సన్మానించారు. సయోధ్య వ్యవస్థాపకురాలు మృదుల, దేవి, సుజాత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని వినతి

రాంనగర్, న్యూస్‌టుడే: ముస్లిం మైనార్టీల శ్మశాన వాటికల కోసం గ్రేటర్ పరిధిలో 120 ఎకరాల స్థలం కేటాయించాలని ఆలిండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ ఛైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్ మాజీ ఎంపీ వి.హనుమంతరావుతో కలిసి ఏఐసీసీ ఇన్‌ఛార్జి విశ్వనాథన్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంతో పాటు పాతబస్తీలో ముస్లింల జనాభా ఎక్కువగా ఉందని, వారికి సరిపడ శ్మశాన వాటికలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తమ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి శ్మశాన వాటిక స్థలం కేటాయించేలా చూడాలని కోరారు.


విశ్వనాథన్‌కు వినతిపత్రం ఇస్తున్న వి.హనుమంతరావు, ముక్తార్ హుస్సేన్

ప్రజలకు ఉపయోగపడే అంశాలనే ప్రచారం చేయాలి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించే అసత్య ప్రచారాలు ఎక్కువై పోతున్నాయని కేరళ ఎంపీ డా.జాన్ బ్రిట్టాస్ అన్నారు. నిరంతరం ప్రజలకు ఉపయోగపడే అంశాలను ప్రచారం చేసి చైతన్యం తేవాలన్నారు. ఆదివారం రాత్రి సుందరయ్య కళానిలయంలో టీ10 ఆరో వార్షికోత్సవంలో ఆయన హాజరై మాట్లాడారు. ఎలక్ట్రానిక్, డిజిటల్, ప్రింట్ మీడియా ప్రజలకు కచ్చితత్వంతో కూడిన వార్తలను అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతోందన్నారు. టీ10 సీఈఓ సుందర్, సీనియర్ పాత్రికేయుడు ఆర్.సుధాభాస్కర్, ఎస్వీకే ట్రస్ట్ నిర్వాహకుడు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బంగారం పెట్టుబడి పేరుతో మోసం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బంగారం వ్యాపారంలో పెట్టుబడి పెడితే రెండింతలు అవుతుందని నమ్మించిన ఓ యువకుడిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన శీలారాణి కుమార్తె తన స్నేహితుడైన కార్తిక్‌రెడ్డిని తల్లికి పరిచయం చేసింది. దీంతో కార్తిక్ రెడ్డి నమ్మకంగా నటించి పలు వ్యాపార అవకాశాలు చూపుతానంటూ డీఎస్ఆర్ గ్రూపు తన బంధువులదని చెప్పాడు. బంగారం వ్యాపారంలో బంగారాన్ని పెట్టుబడి పెడితే వారంలోనే రెండింతలు అవుతుందని శీలారాణిని నమ్మించాడు. దీంతో ఆమె తన వద్ద ఉన్న ఆభరణాలను కుదువపెట్టి వచ్చిన డబ్బుతో కేజీ బంగారాన్ని కొనుగోలు చేసి ఇచ్చింది. శ్రీనివాసచారి అనే వ్యక్తి ద్వారా తొలుత పంజాగుట్ట ప్రాంతంలో తీసుకుంటానని చెప్పాడు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని అల్కజార్ మాల్ వద్ద ఆగస్టు 13న బంగారాన్ని తీసుకున్నాడు. వారం గడిచినా బంగారం తిరిగి ఇవ్వకపోవడంతోపాటు సందేశాలు పెట్టి సమయాన్ని సాగదీస్తూ వచ్చాడు. దీంతో అనుమానించిన శీలారాణి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీసులకు బదిలీ చేశారు. దీంతో కార్తిక్‌రెడ్డిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి దర్శనం.. పులకించిన భక్తజనం

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాల్లో, మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే బృందం


గోల్నాకలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్


అంబర్‌పేట మహంకాళి మహాగౌరి దేవిగా..


బతుకమ్మకుంట: గాజులతో అలంకరణ..


భోలక్‌పూర్ భవాని శంకరాలయంలో..


చిక్కడపల్లిలో మహాలక్ష్మీ అమ్మవారు


శంకరమఠంలో..


జైస్వాల్‌గార్డెన్‌లో అన్నపూర్ణాదేవి..


జెమినికాలనీ పోచమ్మ ఆలయంలో..


కనకాల కట్టమైసమ్మ ఆలయంలో అన్నపూర్ణగా..

‘ఛత్తీస్‌గఢ్ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి’

నల్లకుంట, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ పేరుతో 4వ తేదీన 31 మందిని మావోయిస్టు కార్యకర్తలను అన్యాయంగా చంపడాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివారం ఆయన పేర్కొన్నారు. మృతుల వివరాలు ఇప్పటికీ ప్రకటించకపోవడం చట్ట విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఈ చర్యలకు పాల్పడినట్లు తెలుస్తోందని, కొంతకాలం నుంచి 180 మందిని అన్యాయంగా హతమార్చారని ఆందోళన వ్యక్తం చేశారు.

నవరాత్రుల్లో వెల్లివిరిసిన మతసామరస్యం


దుర్గామాత విగ్రహాన్ని వితరణ చేసిన సయ్యద్ అలీ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్, రాంనగర్ న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాంనగర్‌కి చెందిన సయ్యద్ అలీ ఆదివారం దుర్గామాతా విగ్రహాన్ని వితరణ చేసి మతసామరస్యాన్ని చాటాడు. రాంనగర్‌లో నివాసం ఉంటున్న సయ్యద్‌అలీ వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మా వైష్ణవి అసోసియేషన్ సభ్యులకు రూ.21వేలతో దుర్గామాతా విగ్రహాన్ని అందించి మతసామరస్యాన్ని చాటుకున్నాడు.

ముగిసిన భారతీయ కళామహోత్సవం


మణిపుర్ కళాకారులతో బ్రిటిష్ డిప్యూటీ కమిషనర్ గరేత్ విన్

బొల్లారం, న్యూస్‌టుడే: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరుగుతున్న భారతీయ కళామహోత్సవం ఆదివారం ముగిసింది. సెప్టెంబరు 28న ప్రారంభమైన ఈ మహోత్సవంలో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 430 మంది కళాకారులు గిరిజన ఉత్పత్తులు, సంస్కృతి, సంప్రదాయాలు, నృత్యాలను ప్రదర్శించారు. దక్షిణాది ప్రాంతాల్లో ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని తెలుసుకోవాలన్న ఉద్దేశంతో ఈ ఉత్సవాలను ఈశాన్య అభివృద్ధి, సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసింది. ఎనిమిది రోజుల పాటు సందర్శనకు ఉచిత అనుమతి కల్పించడంతో లక్షపైన పర్యాటకులు తరలివచ్చారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చివరి రోజు బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరేత్ విన్ వోవెన్, రక్షణ దళ ఉన్నతాధికారులు పలువురు న్యాయమూర్తులు కుటుంబాలతో కలిసి ప్రదర్శనను తిలకించారు. నిర్వహణ అధికారి రజిని ప్రియ కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

కాచిగూడ, న్యూస్‌టుడే:: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం... ఆదివారం బుద్వేల్ స్టేషన్ వద్ద కాటేదాన్ బాబుల్‌రెడ్డినగర్‌కు చెందిన వినోద్‌కుమార్(30) పట్టాలను దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మరో ఘటనలో రోడ్డు దాటుతూ..

నల్లకుంట, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లకుంట ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... విద్యానగర్‌లోని ముస్లిం లేన్‌లో నివాసం ఉంటున్న కైసర్‌ఖాన్(55) పంక్చర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం మందులు కొనుగోలు చేసేందుకు విద్యానగర్ - అడిక్‌మెట్ రోడ్డు దాటుతుండగా కారు ఆయన్ను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడగా క్షతగాత్రుడిని స్థానికులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి బంధువు మహ్మద్ ఆయూబ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అన్నా అని పిలిస్తే.. అసభ్యంగా ప్రవర్తించాడు

జూబ్లీహిల్స్: సోదరుడి వరసయ్యే వ్యక్తి ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్‌కాలనీ ప్రాంతంలో నివసించే ఓ యువతి (27) తన బంధువు (సోదరుడు) అయిన అనీష్‌కు ఇల్లు చూపించడానికి తీసుకెళ్లింది. ఇంటిని చూపించే క్రమంలో ఆమెతో అనీష్ అసభ్యంగా ప్రవర్తించాడు. అతడు చేసిన పనికి ఒక్కసారిగా కంగుతింది. దీనిపై శనివారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యజ్ఞ మహోత్సవానికి నిధుల కేటాయింపుపై హర్షం

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ప్రయత్నంతో గత రెండేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ సంక్షేమ శాఖ, జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో ‘విశ్వకర్మ ‘యజ్ఞ’ మహోత్సవం, పూజాదికాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం యజ్ఞ మహోత్సవానికి రూ.13 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంలకు సంఘం అధ్యక్షుడు డా.వేములవాడ మదన్మోహన్, గౌరవ అధ్యక్షుడు డా.లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

గజల్స్‌తో ప్రజల్లో చైతన్యం

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు, భాష, భావనతో మంచి కూర్పు చేసి రాసే గజల్స్ ప్రజల్లో ఎంతో చైతన్యం తెస్తాయని ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజల్స్ విప్లవాత్మక చైతన్యానికి దోహదపడుతాయని తెలిపారు. కవులు కొత్త గజల్స్‌ను వెలుగులోకి తేవడం అభినందనీయమని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అనంతరం కవులను జ్ఞాపికలతో సత్కరించి అవార్డులను ప్రదానం చేశారు. సభకు కవి బిక్కి కృష్ణ అధ్యక్షత వహించారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నర్సింహప్ప, డా.విజయలక్ష్మిపండిట్, సీనియర్ జర్నలిస్ట్ భగీరథ, ఐఆర్ఎస్ అధికారి జల్ది విద్యాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బిక్కి కృష్ణను సత్కరిస్తున్న నర్సింహప్ప. చిత్రంలో టీడీ జనార్ధన్, విజయలక్ష్మి, గోరటి వెంకన్న

సేవలకు నిలయం సాయిబాబా ఆలయం

విద్యానగర్, న్యూస్‌టుడే: బాగ్ అంబర్‌పేట డివిజన్ శివం రోడ్డులోని షిర్డీ సాయిబాబా సంస్థాన్ ఆలయంలో ఆధ్యాత్మికతతో పాటు విరివిగా సేవా, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ తమ కంటూ ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు, సామూహిక కుంకుమార్చన, సత్యనారాయణ స్వామి వ్రతాలు, భజనలు, కీర్తనల ఆలాపన నిర్వహిస్తుంటారు.

ఉచితంగా యోగా తరగతులు

ప్రముఖ యోగా గురువు ఎం.సింగారావుచే 2004 నుంచి ఆలయంలోని ఆధ్యాత్మిక భవనంలో ప్రతీ రోజు ఉదయం ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండడానికి మెళకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా పలువురు యోగా తరగతుల్లో స్థానికులు పాల్గొంటున్నారు.

ప్రతీరోజు అన్నదానం.. ఉదయం 8 గంటలకు వందలాది మందికి అన్నదానం చేయడం ఈ ఆలయ ప్రత్యేకత. నిత్యం నాణ్యత కలిగిన రుచికరమైన అన్న వడ్డిస్తారు. 2008 నుంచి రుచికి, శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆనందంతో అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. నేలకు రెండు సార్లు మధ్యాహ్నం భోజనం అందిస్తారు.

ప్రవచనాలు.. గత కొన్ని సంవత్సరాలు ప్రవచనాల గురువులు చాగంటి కోటేశ్వర్‌రావు, నాగఫణిశర్మ, గరికపాటి నర్సింహరావు మహాభారతం, రామాయణం, భాగవతం, సాయిలీలలపై ప్రవచనాలు చేబుతున్నారు. భక్తులకు ఆధ్యాత్మిక చింతనపట్ల అవగాహన కల్పిస్తున్నారు.

వైద్య చికిత్సలు.. చర్మ, హోమియోపతి వైద్య నిపుణులు బీవీ.రమణరావు, హిమజ, శివకుమార్‌లతో ఆలయ ప్రాంగణంలో ఉదయం, సాయింత్రం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్యంగా ఉండడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారు. అవసరం అనుకుంటే పరీక్షలు చేస్తు కార్పొరేటర్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలకు సహాయ సహకారాలు అందిస్తారు.


యోగా శిక్షణ


అన్నదాన కార్యక్రమం

వానొచ్చె.. వరద తెచ్చె


రాజా డీలక్స్ చౌరస్తా సమీపంలో..

ముషీరాబాద్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వరదనీటితోపాటు పలుచోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు సైతం పొంగిపొర్లాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పలుచోట్ల ట్రాఫిక్ జాం నెలకొంది. ముషీరాబాద్ ప్రధాన రహదారిలోని రాజా డీలక్స్ వద్ద వరద, మురుగునీరు కలిసి రోడ్డుపై భారీగా చేరింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, వీఎస్టీ చౌరస్తా, అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డు, బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు ముందర, పద్మకాలనీ, ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్, జాంభవినగర్, ప్రేయర్‌పవర్ చర్చి, వైఎస్ఆర్ పార్కు వీధి తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరదనీరు చేరింది.



అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్, న్యూస్‌టుడే: బతుకమ్మ-దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ఉప్పల్‌లోని శిల్పారామంలో పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆదివారం శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీసత్యసాయి నృత్య అకాడమి గురువు ర్యులు చంద్రశేఖర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. ఈ సందర్భంగా కళాకారులు గజవదన బేడువే, బ్రహ్మాంజలి, వరవీణా, శృంగార లహరి, కామాక్షి స్తుతి, సరస్వతి కీర్తన, అష్టలక్ష్మి, చంద్ర చూడ, దుర్గ స్తుతి, తదితర అంశాలపై చక్కటి నృత్యాలను ప్రదర్శించారు.

ఉప్పల్

•ఉప్పల్ •మేడ్చల్

గౌరీ నారాయణి నమోస్తుతే



వీఎస్టీ కాలనీ



అన్నపూర్ణాదేవిగా నిమిషాంబికాదేవి



దమ్మాయిగూడలో



రామంతాపూర్..



ప్రజాసాయిగార్డెన్ వాగ్దేవి మాత



హబ్సిగూడ..



గోఖలేనగర్‌లో..



అన్నోజిగూడ



కీసరగుట్టలో ..



తూంకుంట



గాయత్రి మహాక్షేత్రంలో..



సాయి మారుతీనగర్



జవహర్‌నగర్‌లో మేయర్



నాగారంలో..



లక్ష్మాపూర్‌లో



ఉప్పల్ లలిత త్రిపుర సుందరీదేవి



గుండ్లపోచంపల్లి



ఉప్పల్‌లో అమ్మవారి ఆలయంలో తెదేపా పార్లమెంట్ అధ్యక్షుడు కంది కంటి అశోక్‌కుమార్‌గౌడ్

చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ



ఈసీఐఎల్ కంపెనీలో ఉద్యోగుల బతుకమ్మ సంబరాలు



ఉప్పల్ మున్సిపల్ మైదానంలో దాండియా నృత్యం



అనురాగ్ విశ్వవిద్యాలయంలో సీఈవో నీలిమ,అధ్యాపకులు

ఎస్‌ఎస్‌ఏ మెసెంజర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ఉప్పల్, న్యూస్‌టుడే: రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ మెసెంజర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం ఉప్పల్‌లో జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా కందుకూరి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా బరిగెల సత్యనారాయణ ఎన్నుకున్నారు.



ప్రచార బోర్డులతో కప్పేసి..!

శామీర్‌పేట, న్యూస్‌టుడే: శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయం కన్పించకుండా ప్రైవేట్ వ్యక్తుల ప్రకటన బోర్డులు కప్పేశాయి. అయినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

రామదండు.. ఆధ్యాత్మికత మెండు

ఉద్యోగాలతో పాటు ధార్మిక కార్యక్రమాల్లో యువత

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: సమాజంలో అనుమానాలను రూపుమాపడం శాంతి, సామరస్యంలో ఆధ్యాత్మిక చింతన గొప్పతనాన్ని పరిచయం చేస్తూ ధర్మ పరిరక్షణ తపనతో యువత కృషి చేస్తోంది. యువత, చిన్నారులను హిందూ ధర్మ గొప్పతనం తెలియజేయడంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను ప్రచారం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు జవహర్‌నగర్ బాలాజీనగర్‌కు చెందిన బ్రహ్మచారి మారేడుపాక. 15 ఏళ్లుగా అయ్యప్ప భజన గీతాలను, సామూహిక భజనలు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం 6గురు మిత్రులతో కలిసి శ్రీరామదండు ధర్మప్రచార కమిటీని ఏర్పాటు చేశారు. ఇప్పుడు దాదాపు 100 మంది సభ్యులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతం చేశారు. బ్రహ్మచారి, ఆయన మిత్రుడు రాజేశ్వర్‌రెడ్డి గుర్తింపు పొందిన ఆర్థిక రంగ సలహాదారులుగా సొంత సంస్థల డైరెక్టర్లుగా పనిచేస్తూ కొంత సమయాన్ని శ్రీరామదండు ఆధ్యాత్మిక ధర్మప్రచార కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు.



ధర్మప్రచార కార్యక్రమంలో శ్రీరామదండు

చిన్నారులకు ప్రాధాన్యం

శ్రీరామదండు ధర్మప్రచారంలో చిన్నారులకు శ్లోకాలను నేర్పించడం, కుటుంబ విలువలు, భగవద్గీత వచనాన్ని ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆధ్యాత్మికతను దిన చర్యలో భాగం చేసుకుని సామాజిక విలువలను పాటించడం వంటి అంశాలపై చిన్నారులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు. దేశానికి వెన్నెముకగా నిలిచే యువతరం లక్ష్యం వైపు అడుగులు వేసేలా తమ ధార్మిక కార్యక్రమాలు కొనసాగించాలన్న ఆలోచనతో శ్రీరామదండు కదులుతోంది. యుక్తవయసులో మానసిక సంఘర్షణలో ఒత్తిడికి గురవుతూ తమను తాము నిందించుకుని లక్ష్యాన్ని చేరలేకపోతున్నారని అలాంటి యువతకు సత్సంగ ప్రవచనాలు, భజనలు, సామూహిక భక్తి కార్యక్రమాలతో ఉపశమనం కల్పిస్తున్నారు. ఆత్మస్థైర్యంతో మానసిక ఒత్తిడిని అధిగమించి తమ స్వప్నాలు సాధించేలా తమ కార్యాచరణ ఉంటుందని బ్రహ్మచారి వెల్లడించారు.



సామూహిక భజనలో భక్తులు

కార్యక్రమాల నిర్వహణపై దృష్టి

అయ్యప్ప దీక్షతో పాటు వినాయక నవరాత్రులు, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో సామూహిక భజనలతో శ్రీరామదండు తమ ప్రత్యేకతను చాటుతోంది. అయ్యప్ప భజనలు, నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక ప్రచారాలను చేసేలా నిర్వహిస్తున్నారు.

❖ ప్రతి కార్యక్రమంలో రామాయణ, మహాభారతం కావ్యాల విశిష్టత తెలియజేయడం

❖ హనుమాన్ చాలీసా, విష్ణుసహస్రనామ పఠనం విధిగా ఉంటుంది.

❖ భావితరాలకు హిందూ ధర్మ గొప్పతనాన్ని వారసత్వంగా అందించి సమాజంలో శాంతి స్థాపన లక్ష్యం

❖ సభ్యులు శ్యామ్ సుందర్, ఉష, నరేష్‌చారి, యోగి, సాధ్విక్, దీపక్, నర్సింహాచారి తదితరులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడంలో తోడ్పాటు అందిస్తున్నారు.

ఉద్యమకారుల పోరాటాన్ని గుర్తించాలి

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అమరుల త్యాగాలతో పాటు ఉద్యమకారుల పోరాటాన్ని ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డా. చీమ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో 120 మంది ఉద్యమకారులను సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటని, రాష్ట్ర ఆవిర్భావ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం నిజాయతీగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు సుధాకర్‌చారి, ప్రకాశ్, నర్సింహ, అనంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



సత్కారం పొందిన ఉద్యమకారులు

ప్రజల సంక్షేమమే భాజపా లక్ష్యం

నాచారం, న్యూస్‌టుడే: దేశరక్షణ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోందని భాజపా ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డా. కల్యాణ్‌నాయక్ తెలిపారు. ఆదివారం నాచారం హెచ్ఎంటీనగర్‌లో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి నేనావత్ రవినాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భాజపా డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యకర్తలకు సభ్యత్వ నమోదు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మల్క ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ కార్డులు ఇస్తున్న పార్టీ నేతలు

మెట్టు ఎక్కితేనే శామీర్‌పేటలోకి చేరేది......

తూంకుంట పుర పాలికలో విలీనమైన శామీర్‌పేట మండల కేంద్రంలోకి ఎవరైనా రావాలంటే మెట్టు ఎక్కిరావాల్సిందే..అదేంటీ అలా అంటున్నారని అనుకుంటున్నారా...? శామీర్‌పేట-ఉద్దెమర్రి ప్రధాన రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయి మెట్టుగా ఏర్పడింది. రాజీవ్ రహదారి దర్గా చౌరస్తా నుంచి, బాబాగూడ, బొమ్మరాశిపేట, పొన్నాల, అద్రాస్‌పల్లి, ఉద్దెమర్రి గ్రామాల నుంచి వచ్చే బస్సు ప్రయాణికులు, ద్విచక్రవాహనదారులు ఎగుడుదిగుడు మార్గం గుండానే పోవాల్సి వస్తోంది. న్యూస్‌టుడే, శామీర్‌పేట



మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

న్యూస్‌టుడే: బోడుప్పల్, నాచారం, కీసర, నాగారం, మేడ్చల్

? పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో జలమండలి సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరా బిల్లుల్లో తీవ్రమైన వ్యత్యాసాలు ఉంటున్నాయి. ఇష్టం వచ్చినట్లుగా బిల్లులు పంపుతున్నారు.
–పిట్టల మల్లేష్, కార్పొరేటర్, పీర్జాదిగూడ.

✓ తాగునీటి సరఫరా బిల్లులు కేటగిరీ వారీగానే అందజేస్తున్నాం. ఎవరికి ఎక్కువ బిల్లులు పంపించం. అధిక బిల్లులు వస్తే కార్యాలయంలో సంప్రదించాలి.
–తిరుపతి, ఏఈ, జలమండలి, పీర్జాదిగూడ.

? నాచారం కార్తికేయనగర్ వీధి నంబరు-10లో మ్యాన్‌హోల్ పైకప్పు పూర్తిగా విరిగిపోయింది. -అరుణ, నాచారం

✓ కొత్తగా పైకప్పు ఏర్పాటు చేస్తాం.
–వేణుగోపాల్, జలమండలి మేనేజర్, నాచారం

? నాగారం పట్టణంలోని 16వ వార్డులో ఖాళీ స్థలం ఎక్కువ ఉండి పిచ్చి మొక్కలు పెరిగి దోమల బెడద తీవ్రంగా ఉంది.
–సుభాష్ , రాజ్‌సుక్‌నగర్, నాగారం

✓ రెండు రోజుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తాం. – రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నాగారం

? నాగారం పట్టణ బీఎంఆర్ ఎన్‌క్లేవ్‌కు చిన్న వర్షం కురిసినా ఇబ్బందులు పడుతున్నాం
– మహేష్ కుమార్, బీఎంఆర్ కాలనీ, నాగారం

✓ పైనుంచి వచ్చే వరదను సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. – రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నాగారం

? కండ్లకోయ సమీపంలో బ్రిడ్జి నిర్మాణంలో సర్వీసు రోడ్డులో మార్గంలో మార్చారు. ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయలేదు.
– మహేశ్, కండ్లకోయ.

✓ సూచికలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.
–హనుమాన్‌గౌడ్, సీఐ ట్రాఫిక్ మేడ్చల్.

? కీసరగుట్టలోని బాలుర గురుకుల పాఠశాల ఎదురుగా చెట్టు కొమ్మ మధ్యలోకి విరిగి రోడ్డు మధ్యలోకి వచ్చింది. ప్రమాదకరంగా ఉంది – వెంకటేశ్, కీసరగుట్ట

✓ పరిశీలించి సిబ్బందితో చెట్టు కొమ్మను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
– ధన్‌రాజు, రోడ్లు భవనాల శాఖ అధికారి, కీసర

బస్సులు కిటకిట

ఉప్పల్, న్యూస్‌టుడే: బతుకమ్మ-దసరా ఉత్సవాలను పురస్కరించుకొని నగరం నుంచి పెద్ద సంఖ్యలో జిల్లాలకు తరలిపోతున్నారు. ఆదివారం ఉప్పల్ రింగురోడ్డులో ప్రయాణికులతో సందడి నెలకొంది. బస్సులలో సీట్ల కోసం పోటీ పడుతూ కనిపించారు. ఆర్టీసీ అధికారులు ఎవరూ అక్కడ లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది.

ముగిసిన సువార్త మహాసభలు

కీసర, న్యూస్‌టుడే: కీసరలోని ది పెంతెకోస్తు మిషన్ చర్చిలో గత నాలుగు రోజులుగా జరిగిన సువార్త మహాసభలు ఆదివారం ముగిశాయి. గ్రేటర్ హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దైవ భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భారత దేశ చీఫ్ పాస్టర్ అబ్రాహం మాథ్యూ, పాస్టర్ పి. జి థామస్, తెలంగాణ రాష్ట్ర పాస్టర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

మురుగు వస్తుందని తాళం వేసిన కాలనీవాసులు



హబ్సిగూడ, న్యూస్‌టుడే: రామంతాపూర్ డివిజన్ గాంధీనగర్‌లోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాలును ఆదివారం రాత్రి కాలనీవాసులు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గాంధీనగర్ మూడో వీధిలో కాలనీవాసులు ఏర్పాటుచేసిన అమ్మవారి మండపం వద్దకు ఇక్కడి మురుగు చేరుతోంది. తీవ్ర దుర్గంధం వస్తోంది. అమ్మవారికి పూజలు చేయలేక స్వామి దీక్షలో ఉన్న భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. మల్టీపర్పస్ ఫంక్షన్ హాలులోని మ్యాన్‌హోల్ నిండి కాలనీలోకి వస్తుందని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు తాళం వేశారు.

హిందూ పరిరక్షణకు కృషి

ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: హిందూ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రీయ స్వయంసేవక్ క్షేత్ర సేవ ప్రముఖ్ ఎక్క చంద్రశేఖర్ సూచించారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం హౌసింగ్ బోర్డ్ కాలనీలో విజయదశమి వేడుకలు నిర్వహించారు.ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

ఈ అందం.. చూపు తిప్పుకోనివ్వదు



ఉప్పల్ శిల్పారామం రాహదారిలోని చెట్లకు పూసిన పూలన్నీ గులాబీ రంగులో కనిపిస్తూ.. పాదచారులను ఆకర్శిస్తున్నాయి. పూల పొదనిల్లు పక్షులకు ఆలవాలంగా నిలుస్తోంది. ఆ దారిలో వెళితే మనసుకు ఉల్లాసంగా..హాయిగా ఉంటోంది.

హబ్సిగూడ, న్యూస్‌టుడే

సౌకర్యాలు కల్పించాలని నిరసన

ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్ భగాయత్‌లోని హెచ్ఎండీఏ లే అవుట్‌లో సౌకర్యాలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు. నాడు ప్లాట్లు విక్రయించి హెచ్ఎండీఏ.. ఇప్పుడు వివిధ రూపాల్లో పన్నులు వసూళ్లు చేస్తున్న జీహెచ్ఎంసీ కూడా సౌకర్యాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ ఆదివారం ఆందోళన చేపట్టారు. వెంటనే డ్రైనేజీ, పారిశుద్ధ్యం, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భగాయత్ అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న భగాయత్‌వాసులు

ఆర్ఎస్ఎస్ ఉత్సవ ర్యాలీ

హబ్సిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) బర్కత్‌పురభాగ్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవ ర్యాలీని ఆదివారం సాయంత్రం చేపట్టారు. రామంతాపూర్ గణేష్‌నగర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, ఆరోరా విద్యాసంస్థల ఛైర్మన్ డా. రమేష్‌బాబు, తెలంగాణ సహప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్ జీ, మల్కాజిగిరి పార్లమెంటు ఉపాధ్యక్షుడు తిండేరు హన్మంతరావు స్వాగతం పలికారు.



ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

పగిలిపోయి.. కుంగిపోయి



కాప్రా, న్యూస్‌టుడే: కాప్రా డివిజన్‌లోని నేతాజీ నగర్‌లో పలు వీధుల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కాలనీలోని రెండో వీధిలో కొన్ని మ్యాన్‌హోళ్లు పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. కొన్ని భూమిలోనికి కుంగిపోవడంతో పైపుల్లో మురుగు నిలిచిపోతోంది.

ఈనెల 27న కీసరలో నాభిశిల బోనాలు

కీసర, న్యూస్‌టుడే: కీసరలో ఈనెల 27న బోనాల పండుగ నిర్వహించేందుకు ఆదివారం ఉత్సవ నిర్వాహకులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గత ఏడాది గ్రామంలో నాభిశిల(బొడ్రాయి) పండుగ వైభవంగా నిర్వహించారు. తిథి ప్రకారం ఈనెల 23న బుధవారం అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి, 27న అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. ఆడ పిల్లలతో బొడ్రాయిపై నీళ్ల పోసి బోనాలు తీసుకోవాలని గ్రామ పురోహితులు వి.ప్రభాకర్‌శర్మ, సాయికిరణ్‌శర్మ తెలిపారు.

గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ అపారం

శామీర్‌పేట, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ అపారంగా ఉందని, దాన్ని వెలికి తీసేందుకు జీఎన్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని జీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఎంపీపీల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.చంద్రశేఖర్ యాదవ్, కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు బుద్ధిశ్రీనివాస్, మండల భాజపా అధ్యక్షుడు కైర యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు జిడిపల్లి వేణు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల

స్త్రీశక్తిని పూజించే సంప్రదాయమే హైందవ ధర్మం

నాచారం, న్యూస్‌టుడే: స్త్రీ శక్తిని పూజించే సంప్రదాయం హైందవ ధర్మంలో మాత్రమే ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహ క్షేత్ర ప్రచారక్ శ్రీరాంభరత్ తెలిపారు. ఆదివారం నాచారంలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో ఆర్ఎస్ఎస్ ఉప్పల్ భాగ్ ఆధ్వర్యంలో విజయ దశమి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్య అతిథిగా సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సర్వేయర్ జనరల్ పంకజ్‌మిశ్రా, ముఖ్య ప్రసంగికులు శ్రీరాంభరత్, భాగ్ సంఘచాలక్ అంకం శంకర్ పాల్గొని ఆయుధపూజ చేసి విజయ దశమి విశిష్టత గురించి వివరించారు. ఈసందర్భంగా శ్రీరాంభరత్ మాట్లాడుతూ... హిందూ సమాజం సంఘటితంతోనే దేశంలో శాంతి సాధ్యమన్నారు. సామాజిక సమరసత, కుటుంబ ప్రబోధన, స్వభావన, నాగరిక శిష్టాచారీ, పర్యావరణ పరిరక్షణ... వంటి పంచ పరివర్తన ద్వారా దేశంలోని 140కోట్ల మంది ప్రజలను జాగృతం చేస్తున్నామన్నారు. పంకజ్ మిశ్రా మాట్లాడుతూ.... భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, జీవన విధానం, ఆచార వ్యవహారాలు ప్రపంచానికే ఆదర్శనీయమన్నారు. అంతకు ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ నుంచి 4కిలోమీటర్లు స్వయం సేవకులు గోష్ వాయిద్యాలతో నడుమ పద సంచలనం నిర్వహించారు.



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ సహక్షేత్ర ప్రచారక్ శ్రీరాంభరత్, వేదికపై పంకజ్‌మిశ్రా




పద సంచలనం చేస్తున్న స్వయం సేవకులు

అభినయ మయూరి

చిన్న వయసులోనే ఎన్నో అవార్డులు అందుకున్న హేమ



మేడ్చల్, న్యూస్‌టుడే: చదువుకుంటే ఏదో ఒక ఉద్యోగమో.. వ్యాపారంలో స్థిరపడడమో సాధ్యమవుతుంది.. చదువుతో పాటు ఏదో ఒక కళలో ప్రవేశం ఉంటే ఎంతో సంతోషాన్ని ఇస్తుందని మేడ్చల్‌కు చెందిన అప్పాల హేమాయాదవ్ చెబుతోంది. సరదా చిన్ననాటి నుంచి మొదలెట్టి.. కూచిపూడిలో అందరి మెప్పు పొందుతోంది. మేడ్చల్ పట్టణంలో నివాసం ఉండే అప్పాల హేమయాదవ్ డిగ్రీలో బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చిన్నప్పటి నుంచి పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో కూచిపూడిపై మక్కువ ఏర్పడింది. దాంతో పాటు నాటకాలు వేస్తూ ఎన్నో బహుమతులు అందుకుంది. కూచిపూడిలో రాణించాలని మేడ్చల్‌లోని శ్రీ చారుచంద్ర కూచిపూడి నాట్య నికేతన్‌లో చేరింది. ఓ వైపు శిక్షణ తీసుకుంటూనే అనేక కార్యక్రమాలలో పాల్గొని రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు, ప్రశంసా పత్రాలు సాధించింది.



పది ప్రపంచ రికార్డుల్లో పాల్గొని..పురస్కారంతో హేమ

● తెలంగాణ ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28న రవీంద్రభారతిలో నంది అవార్డును గెలుచుకుంది.

● భారతీయ విద్యాభవన్‌లో అంతర్జాతీయ ప్లాటినం బుక్ ఆఫ్ రికార్డులో భాగమయ్యింది.

● భారత్ ఆర్ట్స్ అకాడమీలో అవార్డు

● జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో పాల్గొంది.

● కళాకార్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

● తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించింది.

● జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు, వండర్ బుక్ ఆఫ్ రికార్డులో ఔట్ స్టాండింగ్ పెర్ఫార్మెన్స్ అవార్డు సొంతం చేసుకుంది.




గాజుల అలంకరణలో, గాయత్రీదేవిగా బల్కంపేట ఎల్లమ్మ



అన్నపూర్ణాదేవిగా ఉజ్జయిని మహాకాళి



గాయత్రీదేవిగా పెద్దమ్మతల్లి



మహాలక్ష్మిగా ప్రత్యంగిరా అమ్మవారు

దేవీ నవరాత్రోత్సవాల్లో ఆదివారం నగరంలోని పలు ఆలయాల్లోని అమ్మవారు పలు రూపాల్లో కనిపించారు. బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానంలో మూలవిరాట్‌ను రంగురంగుల గాజులతో అలంకరించారు. అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అన్నపూర్ణాదేవిగా, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి గాయత్రీదేవిగా, ఆర్కేపురంలోని కుర్తాళం పీఠానికి చెందిన వారాహి సమేత ప్రత్యంగిరా దేవి మహాలక్ష్మి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. – సంజీవరెడ్డినగర్, బన్సీలాల్‌పేట్, రాణిగంజ్, జూబ్లీహిల్స్, ఆర్కేపురం, న్యూస్‌టుడే

కదలని చెత్తవాహనాలు

నగరంలో చెత్త వాహనాలు సరిగా పనిచేయట్లేదు. రోజూ ఉదయాన్నే వ్యర్థాలను తొలగించాల్సిన వాహనాలు రెండు, మూడు రోజులకోసారి వస్తున్నాయి. ఆ వాహనాలకు రవాణా విభాగం సహాయ ఇంజినీర్లు నిత్యం డీజిల్ కూపన్లు ఇస్తున్నారు. రెండు, మూడు వారాలకోసారి బ్రేక్‌డౌన్ పేరుతో మరమ్మతులు చేసినట్లు బిల్లులు పెడుతున్నారు. ఇప్పటివరకు ఒక్కో వాహనానికి చేసిన మరమ్మతుల ఖర్చుతో కొత్త వాహనాన్ని కొనుగోలు చేయొచ్చని అధికారులే అంటున్నారు. ఏళ్లుగా జరుగుతోన్న ఈ దందా ఇటీవల మరింత పెరిగింది. నగర పారిశుద్ధ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

ఈనాడు, హైదరాబాద్



జీహెచ్ఎంసీ ఆర్ఎఫ్‌సీ వాహనం

35 వాహనాల్లో 90 శాతం

◆ ఐదు నుంచి పది వీధుల్లోని చెత్త కుప్పలను తొలగించేందుకు జీహెచ్ఎంసీ రవాణా విభాగం 2016లో 35 రెఫ్యూజ్డ్ కంపాక్టర్ వాహనాలను(ఆర్ఎఫ్‌సీ) కొనుగోలు చేసింది. మొదట్లో ఆయా వాహనాలు పక్కాగా పనిచేశాయి. కంటైనర్ లాంటి ట్రాలీలో వ్యర్థాలను ఎక్కువ మొత్తంలో నింపడం వాటి ప్రత్యేకత. తద్వారా ఒకేసారి ఎక్కువ వీధులను శుభ్రం చేయొచ్చనే ఉద్దేశంతో అధికారులు వాటిని సమకూర్చుకున్నారు. ఇప్పుడు వాటిలోని 90శాతం వాహనాలు రోజువారీ విధుల్లో పాల్గొనట్లేదు. రెండేళ్లుగా వాహనాల డ్రైవర్లు నరకం చూపిస్తున్నారని, మాట వినడం లేదని సర్కిళ్ల పారిశుద్ధ్య విభాగం అధికారులు నిత్యం కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేస్తున్నారు.

◆ రోజూ డీజిల్ తీసుకుని.. మూడ్రోజులకోసారి విధులకు

◆ విధులు సరిగా నిర్వర్తించట్లేదనే కారణంతో.. సంబంధిత అధికారులు వాటికి కేటాయించిన చెత్త కుప్పలను తగ్గించారు. అంబర్‌పేట, ముషీరాబాద్, సికింద్రాబాద్, తదితర సర్కిళ్లలోని 70 చెత్తకుప్పలనే వాటికి అప్పగించారు. అయినా ఫలితం కనిపించట్లేదు. అంబర్‌పేటలో 3 రోజులకోసారి వాహనాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయని, ఫోన్ చేస్తే డ్రైవర్లు స్పందించడం లేదని, విధుల్లోకి వచ్చిన రోజు సైతం అసంపూర్తిగా పని చేస్తున్నారని సర్కిల్ పారిశుద్ధ్య అధికారి 'ఈనాడు'కు తెలిపారు. చెత్త కుప్పలను శుభ్రం చేసే బాధ్యతను ప్రైవేటు వాహనాలకు అప్పగిస్తామనే హెచ్చరికను డ్రైవర్లు ఖాతరు చేయట్లేదని, ప్రైవేటు వాహనదారులను బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

చెత్త రవాణా వాహనాలు, అధికారులు ఉపయోగించే వాహనాలకు జీహెచ్ఎంసీ ఏటా రూ.25 కోట్ల డీజిల్‌ను వినియోగిస్తోంది. మరమ్మతులకు మరో రూ.5 కోట్ల ఖర్చు. అందులో 70 శాతం నిధులు దారి మళ్లుతున్నాయనే విమర్శలున్నాయి. చెత్త రవాణా, ఇతర తనిఖీ వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చడం, చేయని మరమ్మతులకు బిల్లుల మంజూరు, డీజిల్ కూపన్ల మాయాజాలం ఏళ్లుగా కొనసాగుతోంది.

హోటళ్ల నుంచి వ్యర్థాలను సేకరించే వాహనాలు లేవు. స్వచ్ఛ ఆటోలే ఆ పని చేస్తున్నాయి. కొన్ని హోటళ్లు వ్యర్థాలను మురుగు కాలువల్లో, చెరువుల్లో వదిలేస్తున్నాయి. చెత్తకుప్పల తొలగింపును నిర్లక్ష్యం చేస్తోన్న వాహనాలను రాత్రివేళ హోటళ్ల వ్యర్థాల సేకరణకు ఉపయోగిస్తే బాగు.



అయ్యప్ప సొసైటీ సర్వే ఆఫ్ ఇండియా కాలనీ జంక్షన్



పంజాగుట్ట మోడల్ హౌస్ - జేవీఆర్ పార్కు రోడ్డు

దెబ్బతిన్న రహదారులు

ఈనాడు, హైదరాబాద్

రాజధానిలో రహదారులు ధ్వంసమయ్యాయి. వీధి దీపాల సమస్య కూడా తోడవడంతో గల్లీల దారులపై గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం జీహెచ్ఎంసీకి గుంతలపై వందలాది ఫిర్యాదులు అందుతున్నా స్పందన లేదు. ఐదేళ్ల క్రితం 800 కి.మీ ప్రధాన రహదారులను జీహెచ్ఎంసీ ప్రైవేటు నిర్వహణకు ఇచ్చింది. గుంతలు, అపరిశుభ్రత, పగిలిన మ్యాన్‌హోళ్లు, మసకబారిన విభాగినిలు, అసంపూర్తి కాలిబాటలు, ఇతరత్రా సమస్యలు కనిపించకుండా ప్రధాన రహదారులను మెరిసేలా తీర్చిదిద్ది.. ఐదేళ్లపాటు అలాగే కొనసాగించాలన్న లక్ష్యంతో బడా గుత్తేదారు సంస్థలకు వాటిని అప్పగించింది. అందుకు బల్దియా ఐదేళ్లలో రూ.1,585 కోట్లు వెచ్చించింది. కాంట్రాక్టు కాలపరిమితి డిసెంబరుతో ముగియనుంది.

ఉదాహరణలు..

● నారాయణగూడ నుంచి రామంతాపూర్‌నకు వెళ్లే వారంతా అరగంటపాటు నరకం చూపే రోడ్లపై ప్రయాణించాల్సిందే. అంబర్‌పేట 6 నంబరు చౌరస్తా నుంచి ముక్రం హోటల్ వరకు పైవంతెన వల్ల ఏర్పడ్డ మోకాలులోతు గుంతలను దాటి వెళ్లాలి. లేదంటే.. ప్రత్యామ్నాయ దారి డీడీకాలనీ, సాయిబాబా దేవాలయం, మల్లికార్జుననగర్ మీదుగా రామంతాపూర్ చేరుకోవాలి. నల్లకుంట ప్రధాన కూడలిలో, సాయిబాబా దేవాలయం రోడ్డు, సీజన్స్ ఆస్పత్రి సమీప రహదారుల్లో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ● పంజాగుట్ట మోడల్‌హౌస్ - జలగం వెంగళరావు పార్కు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

వీధి లైట్లు సరిగా వెలగడం లేదు

■ రాజ్‌భవన్ రోడ్డు, కేసీపీ కూడలి వద్ద తవ్విన భూగర్భ జలాశయం పనులతో కొద్దిపాటి వర్షానికే రహదారిపై రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

■ అయ్యప్ప సొసైటీ గోదావరి కట్స్ దుకాణం చౌరస్తా అస్తవ్యస్తంగా మారింది. అక్కడి నుంచి కైత్లాపూర్ వెళ్లే రోడ్డుపై అడుగడుగునా గుంతలే. ఇది ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చిన రోడ్డు అయినప్పటికీ.. సర్వే ఆఫ్ ఇండియా, తులసినగర్ రోడ్డు చౌరస్తాలో మోకాలులోతు గుంతలు ఏర్పడ్డాయి. మ్యాన్‌హోళ్లన్నీ ధ్వంసమయ్యాయి. దాదాపు ఏడాదిన్నరగా ఈ కూడలిలో మరమ్మతులు జరగకపోవడం గమనార్హం. ఇదే రోడ్డులో శ్రీచైతన్య అకాడమీ వద్ద కాలిబాట ధ్వంసమై.. ఆ ప్రాంతం మురికికూపంగా మారింది.

■ సికింద్రాబాద్ మెట్టుగూడ మెట్రో స్టేషన్ కింద, ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ కింద గుంతలమయంగా మారాయి.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో కృష్ణాయాదవ్, కార్పొరేటర్లు

గోల్నాక, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రకృతితో మమేకమై పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను తెలియజేస్తుందని తెలిపారు. ఆదివారం గోవింద్‌నగర్‌లో జరిగిన అంబర్‌పేట నియోజకవర్గం మహిళా చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. పొదుపు సంఘాల మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈనెల 9న సాయంత్రం అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, కార్పొరేటర్లు ఉమారాణి, అమృత, నేతలు మూల రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సహజ సిద్ధ శిలా కళా సౌందర్యానికి నిలయం తెలంగాణ



కార్యక్రమంలో ప్రొ.వేదకుమార్, మహేందర్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు

రాయదుర్గం న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రకృతి చెక్కిన సహజ సిద్ధ శిలా కళా అద్భుతాలు అనేకం ఉన్నాయని, వాటికి యునెస్కో గుర్తింపునకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ఛైర్మన్ ప్రొ.వేదకుమార్ మణికొండ అన్నారు. అంతర్జాతీయ భౌగోళిక వైవిధ్య దినోత్సవం సందర్భంగా ఖాజాగూడ ఫక్రుద్దీన్ గుట్టపై జియో హెరిటేజ్ ట్రయల్, టాక్ ఆన్ జియో డైవర్సిటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి వేదకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. తెలంగాణలో లక్షల ఏళ్ల నాటి భౌగోళిక వైవిధ్యాలు అనేకం ఉన్నాయని, అవి ప్రపంచంలోని అతిపెద్ద ప్రాకృతిక రాతి సౌందర్యాలుగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పాండవుల గుట్టను మాత్రమే జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించాయన్నారు. ఇప్పటికీ మరెన్నో గుర్తింపునకు అర్హమైన ప్రదేశాలున్నాయని చెప్పారు. వాటిని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వ విధానాలు, ఆచరణలు అమలులోకి తీసుకు రావాలన్నారు.

జీఎస్ఐ విశ్రాంత డైరెక్టర్ కమతం మహేందర్‌రెడ్డి ప్రసంగిస్తూ.. భౌగోళిక ప్రాధాన్య ఆస్తులు పోతే తిరిగి పొందలేమని చెప్పారు. జీఎస్ఐ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ చక్కిలం వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రకృతి సహజసిద్ధ శిలాకళాకృతులతో అలరారుతున్న కొండలు భౌగోళిక అద్భుతాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కొండలను హైదరాబాద్ గ్రానైట్ కాంప్లెక్స్‌గా పిలుస్తారని తెలిపారు. అవి 250కోట్ల సంవత్సరాల కిందటివని, 10000 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయని వివరించారు. ఇంకా అనేక ప్రకృతి వింతలు, విశేషాలపై అధ్యయనాలు జరగాల్సి ఉందన్నారు. చరిత్రకారుడు రామోజు హరగోపాల్, సీనియర్ సైంటిస్ట్ సోమా రామ్మూర్తి, ఎ.ఆర్.రామ్‌రాజ్, సకీనా, జాజిర్ హుస్సేన్, వేముగంటి మురళీకృష్ణ, శోభాసింగ్, ఎస్.ఎస్.ప్రసాద్, మహేందర్‌రెడ్డి, వై.సుభాష్‌రెడ్డి, మహమ్మద్ అఫ్జల్, ఇలియాస్, ఎస్.ధనుంజయ, పి.నరహరి పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రుల సమయంలో భారీ విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బందులు లేకుండా ట్యాంక్‌బండ్‌పై పలు విద్యుత్తు స్తంభాలను తొలగించారు. తాజాగా వాటిని యథాస్థానంలో ఏర్పాటు చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.





కుమార్తె పాడె మోస్తున్న రాజేంద్రప్రసాద్

ముగిసిన గాయత్రి అంత్యక్రియలు

భావోద్వేగానికి గురైన రాజేంద్రప్రసాద్

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: సినీనటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి(38) అంత్యక్రియలు కేపీహెచ్‌బీ ఏడోఫేజ్‌లోని కైలాసవాసంలో ముగిశాయి. ఆమె భర్త రాజ్‌కుమార్ చితికి నిప్పంటించారు. కుమార్తె పాడె మోసిన రాజేంద్రప్రసాద్ తోటి కళాకారులు, కుటుంబసభ్యుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. ఏపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, నిర్మాతలు అశ్వినీదత్, అల్లు అరవింద్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, శివాజీ, రమాప్రభ, చోటాకెనాయుడు గాయత్రి భౌతికకాయానికి నివాళులర్పించారు.

వడ్డీ మాఫీ.. అదనపు ఛార్జీలు రద్దు

పెండింగ్ నీటి బిల్లులకు ఓటీఎస్‌తో రాయితీ పొందే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: మీ నీటి బిల్లులు రూ.వేలు లేదా లక్షల్లో పేరుకుపోయాయా.. అయితే, జలమండలి ప్రవేశపెట్టిన వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం(ఓటీఎస్)తో భారీ రాయితీ పొందే అవకాశమంది. గతంలో ఈ స్కీంతో అనేకమంది లబ్ధి పొందారు. జలమండలికి పెద్దఎత్తున ఆదాయం సమకూరింది. దీంతో మరోసారి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఉన్న బకాయిలపై వడ్డీతోపాటు అదనపు ఛార్జీలు రద్దు చేయనున్నారు. ఈ స్కీం ద్వారా కనీసం రూ.2 వేల నుంచి బకాయిలను బట్టి రూ.లక్షల్లోనే వడ్డీ రాయితీ పొందవచ్చునని అధికారులు తెలిపారు. గ్రేటర్‌వ్యాప్తంగా 13లక్షల నల్లా కనెక్షన్లు ఉండగా.. 7.1 లక్షల నల్లాదారులకు బకాయిలున్నాయి. గృహ నల్లాల నుంచి బల్క్ కనెక్షన్ల వరకు మొత్తం రూ.1961 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో వడ్డీ, అదనపు రుసుమే రూ.705 కోట్ల వరకు ఉంది. తాజాగా ఓటీఎస్ ద్వారా ఒకేసారి బకాయిల చెల్లింపునకు ముందుకు వచ్చే నల్లాదారులకు వడ్డీ మొత్తం మాఫీ చేయనున్నారు. గతంలో ఈ స్కీం ద్వారా లబ్ధి పొందిన వారు సైతం 50శాతం వరకు రాయితీ పొందే వీలుంది. ఉచిత నీటి పథకం వల్ల చాలా మంది బకాయిలు చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. దీనిపై వడ్డీల భారం పడుతోంది. ఎప్పటికైనా పెండింగ్ బిల్లులు చెల్లించక తప్పదు. ఈ తరుణంలో ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని జలమండలి సూచిస్తోంది.



కె.అశోక్‌రెడ్డి, ఎండీ, జలమండలి

నీటి బకాయిలు (రూ.కోట్లల్లో)

కేటగిరి	నల్లాల సంఖ్య	31.08.24 వరకు బకాయిలు	బకాయిలపై వడ్డీ	అసలు మొత్తం
గృహ నల్లాలు	557165	683.37	171.83	511.55
డొమెస్టిక్ స్లమ్	130338	88.14	36.65	51.49
వాణిజ్య	23219	190.58	61.81	128.77
పారిశ్రామిక	481	202.38	111.44	90.95
ఎంఎస్‌బీ	7049	20.89	4.29	16.60
బల్క్	9	663.29	271.20	393.09
కాలనీలు	179	112.59	48.53	64.06
మొత్తం	718440	1961.25	705.75	1255.51

సద్వినియోగం చేసుకోండి: అశోక్‌రెడ్డి, ఎండీ, జలమండలి

ఇప్పటివరకు ఉన్న బకాయిలపై వడ్డీ, ఆలస్య రుసుం రద్దు అవుతుంది. అవసరమైతే డివిజన్ వారీగా శిబిరాలు ఏర్పాటు చేసి అక్కడికక్కడ బకాయిలు చెల్లించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఈ నెలాఖరు వరకు ఈ స్కీం అందుబాటులో ఉంటుంది.

నిజాం ఆస్తులు కొట్టేసేందుకు నకిలీ పత్రాలతో కుట్ర

నగర సీసీఎస్‌లో ఏడో నిజాం మనవరాలు ఫిర్యాదు

ఈనాడు, హైదరాబాద్: నిజాం వారసులుగా నకిలీ పత్రాలు సృష్టించి ఆస్తులు కొట్టేసేందుకు కుట్రపన్నారంటూ ఏడో నిజాం ఉస్మానియా అలీ ఖాన్ బహదూర్ మనవరాలు ప్రిన్సెస్ ఫాతిమా ఫౌజియా శనివారం నగర సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మిర్ ఉస్మాన్ అలిఖాన్ రెండో కుమారుడు హైనస్ వాల్షన్ ప్రిన్స్ మౌజ్జమ్ ఝా బహదూర్ కుమార్తె ఫాతిమా ఫౌజిమా బంజారాహిల్స్‌లో ఉంటున్నారు. 2016లో నాంపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు తామే వారసులమంటూ తమ పేరిట జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) చేశారంటూ 150 మంది సాక్షులతో న్యాయస్థానం ద్వారా వారసత్వ పత్రం పొందినట్టు పేర్కొన్నారు. అవన్నీ ఫోర్జరీ సంతకాలతో సృష్టించిన నకిలీపత్రాలని, వాటితో నిజాం ఆస్తులు, ప్రభుత్వం నుంచి పరిహారం పొందుతున్నట్టు వివరించారు. ముస్లిం పర్సనల్ చట్టం ప్రకారం నిజాం 7కు దుల్హాన్ పాషా ఒక్కరే భార్య అని ఆయన భార్యలుగా చెప్పుకొంటున్న వారికి చట్టప్రకారం అర్హత లేదన్నారు. నకిలీపత్రాలతో న్యాయస్థానాన్ని మోసగించారన్నారు. తమిళనాడులో ఉన్న రూ.121 కోట్ల విలువైన ఎస్టేట్‌ను కాజేసేందుకు నిందితులు కుట్రపన్నుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదుచేయకపోవటంతో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాలతో సీసీఎస్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'భారతావనిని కాపాడుకోవడం హిందువుల ధర్మం'

మారేడుపల్లి, న్యూస్‌టుడే: మనం అర్హత లేనివారికి స్వేచ్ఛను ఇవ్వడంతో భారతావనిలో స్వేచ్ఛ లేకుండా పోతోందని దానిని కాపాడుకోవడం హిందువుల ధర్మమని మానేపల్లి గ్రూప్ ఆఫ్ ఛైర్మన్, భువనగిరిలోని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణదాత రామారావు, ఆర్ఎస్ఎస్ తెలంగాణ జనరల్ సెక్రటరీ కాచం రమేష్‌లు అన్నారు. వెస్ట్‌మారేడుపల్లి తపాలా కార్యాలయం సమీపంలోని క్రీడా మైదానంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ సంఘం వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని సికింద్రాబాద్ శాఖ ఆధ్వర్యంలో విజయదశమి, సంఘం శతాబ్ది ప్రారంభోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలకు ఆయుర్వేద వైద్యులు కృష్ణప్రసాద్‌తో కలిసి విచ్చేసి మాట్లాడారు. కరసేవకులు కవాతు నిర్వహిస్తూ రూట్ మార్చ్‌గా బయలుదేరి వెస్ట్‌మారేడుపల్లి, మహాత్మాగాంధీనగర్, ఈస్ట్‌మారేడుపల్లి మీదుగా క్రీడా మైదానం చేరుకొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రామారావు, కాచం రమేష్, కృష్ణప్రసాద్

బాలికను గర్భవతిని చేసిన వలస కార్మికుడు

నిందితుడిపై పోక్సో కేసు

శంషాబాద్, న్యూస్‌టుడే: బాలికను బెదిరించి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడి గర్భవతిని చేసిన వలస కార్మికుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆర్జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన దంపతులు గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో రోజువారీ కార్మికులుగా పని చేస్తూ ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటున్నారు. ఇటీవల తల్లి తను పనిచేసే పరిశ్రమ వద్దకు ఓ కుమార్తె(16)ను వెంట తీసుకుని వెళ్తోంది. అదే పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న బిహార్‌కు చెందిన అన్సారీ(24) ఆ బాలికపై కన్నేశాడు. అదనుచూసి ఆమెను బెదిరించి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఇటీవల ఆ బాలిక అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లగా గర్భవతిగా తేలింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు ఆదివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

లాభాలంటూ ఆశ.. మాదకద్రవ్యాలంటూ బెదిరింపులు

■ 18 మంది అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్ట్

■ దేశవ్యాప్తంగా నిందితులపై 319 కేసులు

ఈనాడు, హైదరాబాద్, నారాయణగూడ, న్యూస్‌టుడే: షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు, ఫెడెక్స్ కొరియర్ పేరిట బెదిరింపులకు పాల్పడుతూ రూ.6.94కోట్లు కొట్టేసిన 18 మంది అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. సీపీ సీవీ ఆనంద్ ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. అంతరాష్ట్ర నేరగాళ్లు కేవలం స్మార్ట్ ఫోన్‌తోనే సామాన్యులను మోసగిస్తున్నారు. తాము సేకరించిన సమాచారం ఆధారంగా వాట్సాప్, ఫోన్ నంబర్లకు లింకులు పంపుతారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపుతారు. ఫెడెక్స్ కొరియర్‌లో మాదకద్రవ్యాలు వచ్చాయని బెదిరిస్తారు. నగరంలో ఈ తరహా మోసాలపై 10 కేసులు నమోదయ్యాయి. వేర్వేరు ప్రాంతాల్లోని నిందితులను పట్టుకునేందుకు సైబర్‌క్రైమ్ డీసీపీ కవిత దార, ఏసీపీలు చాంద్‌పాషా, శివమారుతి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు ప్రసాదరావు, నరేశ్, శీతారాములు, రాజు, ప్రమోద్ కుమార్ బృందాలు రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్రల్లో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించారు. నిందితుల ఫోన్ నంబర్ల ఆధారంగా లొకేషన్ గుర్తించి పక్కా సమాచారంతో దాడులు చేశారు. బ్యాంకు ఖాతాల నిర్వహణ, కమీషన్ కోసం అద్దె ఖాతాలను సేకరిస్తున్న మూడు రాష్ట్రాలకు చెందిన నిఖేశ్ భటి, సంజయ్ బిమన్‌దాస్, యోగేశ్ కుమార్, దేవరాజ్ చంద్రావత్, రోహన్ యాదవ్, అమిర్ కాశీనాథ్ జాదవ్, ఆరిఫ్ బర్కత్ అలీ, సాకేత్ సతీశ్, అన్నగోకుల్ ధాగే, అజయ్ గోపీనాథ్ మిశ్రా, కపిల్‌భౌ సాహెబ్ నగారే, రిధి బేడి, శ్రీధర్, ఉదయ్ కుమార్, వరుణ్ కుమార్, జి.కౌశిక్, సమీన్‌ఖాన్, షేకుల్ ఖాన్‌లను అరెస్ట్ చేశారు. నిందితులపై దేశవ్యాప్తంగా 319 కేసులు ఉండగా, తెలంగాణలో 45 కేసులు ఉన్నాయి. వారి నుంచి రూ.5 లక్షల నగదు, 26 ఫోన్లు, 16 ఏటీఎం కార్డులు, 11 చెక్ బుక్స్, 7 పాస్‌పుస్తకాలు, 10 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లోని రూ.1.61 కోట్ల నగదు లావాదేవీలను స్తంభింపజేశారు. అనుమానాస్పద లావాదేవీలు, ఫోన్ కాల్స్‌పై టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కళాకృతులు.. కళావిహీనం









షేక్‌పేట నుంచి ఫిలింనగర్ వెళ్లే మార్గంలో ఆకట్టుకునేలా కనిపించేలా డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన కళాకృతులకు నిర్వహణ కరవైంది. కొన్నింటి కాళ్లు, చేతులు విరిగిపోగా మరికొన్నింటి చేతుల్లో అమర్చిన సామగ్రి మాయమైంది. ఆకతాయిలు నిత్యం అక్కడ తిష్ఠ వేస్తున్నారు. అధికారులూ స్పందించండి

మీరు డబ్బులిస్తే.. నే యూపీఐలో చెల్లిస్తా

మహానగరంలో మాయగాళ్ల హల్‌చల్



ఈనాడు, హైదరాబాద్: పెట్రోల్‌బంక్ వద్దకెళ్లిన యువకుడు తనకు నగదు చెల్లిస్తే ఆన్‌లైన్‌లో బదిలీ చేస్తానంటూ నిర్వాహకుడిని కోరాడు. 10శాతం అదనంగా సొమ్ము వస్తుందనే ఆశతో అతను అంగీకరించాడు. మొబైల్ నంబర్‌కు బ్యాంకు సందేశం రావటంతో మురిసిపోయాడు. కొంత సమయం తరువాత నగదు నిల్వలు పరిశీలించుకొని మోసపోయినట్టు గుర్తించాడు. గుర్తుతెలియని వ్యక్తి ఒకేరోజు మూడు చోట్ల ఇదే తరహాలో రూ.లక్షన్నర మేర కాజేశాడు. ఏటీఎం కేంద్రం వద్ద మధ్యవయస్కుడు తాను డెబిట్ కార్డు మరచిపోయానంటూ.. ఒక మహిళ వద్ద నగదు తీసుకొని యూపీఐ ద్వారా రూ.50 వేలు చెల్లించాడు. ఇంటికెళ్లి చూసుకున్న మహిళ నగదు రాలేదని పోలీసులను ఆశ్రయించింది. నగరంలో మాయగాళ్లు కొత్త తరహా మోసాలకు తెగబడుతున్నారు. ఏవో కారణాలు చెబుతూ 'మీరు నగదు ఇస్తే.. తాను యూపీఐలో చెల్లిస్తా' నంటూ బురిడీ కొట్టిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరా చేసుకొని వీలైనంత పెద్దమొత్తంలో కొట్టేస్తున్నారు.

మోసం రూపాలు అనేకం

నగదు చెల్లింపుల్లో యూపీఐ వినియోగం పెరిగింది. జేబుల్లో ఏటీఎం కార్డులు లేకున్నా ఫోన్‌లోనే లావాదేవీలు నిర్వహించే వెసులుబాటు వచ్చింది. ఈ అవకాశాన్ని మోసగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. రాజస్థాన్‌కు చెందిన ముఠా సభ్యులు.. నగరంలోని పలు దుకాణాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసి యూపీఐ ద్వారా నగదు చెల్లించారు. కొంత సమయానికి ఆ నగదు ఉపసంహరణ జరగటంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో అంతర్రాష్ట్ర ముఠా యూపీఐ చెల్లింపులను ఆసరా చేసుకొని రూ.4కోట్ల విలువైన వస్తువులు కాజేసినట్టు నిర్ధారించారు. దేశవ్యాప్తంగా 10 కేసులతో ప్రమేయం ఉన్న 13 మందిని అరెస్ట్ చేశారు. తాజాగా ఇదే తరహాలో బ్యాంకులు, పెట్రోల్ బంకులు, షాపింగ్‌మాల్స్ వద్దకు చేరి తమకు అత్యవసరంగా డబ్బులు కావాలని. . కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఉన్నారంటూ అవతలి వారిని బోల్తా కొట్టిస్తున్నారు. వారి నుంచి నగదు చేతికి అందగానే యూపీఐ స్కానర్ ద్వారా చెల్లింపులు పూర్తిచేస్తున్నారు. బ్యాంకు ఖాతాలో నగదు జమైనట్టు ఫోన్‌కు సందేశం రావటంతో తేలికగా నమ్ముతున్నారు. నగదు నిల్వల్లో తేడాలున్నట్టు గుర్తించి అడిగితే సాంకేతిక కారణాలు కావచ్చంటూ మభ్యపెట్టి మాయమవుతున్నారు. సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న దొంగలు, సైబర్ నేరస్థులకు సహకరిస్తున్న ఏజెంట్లు ఈ తరహా మోసాలకు పాల్పడే అవకాశం ఉందని పోలీసు అధికారి అభిప్రాయం వ్యక్తంచేశారు. పరిచయం లేని వ్యక్తులతో నగదు లావాదేవీలు నిర్వహించటం నష్టంతోపాటు కొన్నిసార్లు పోలీసు కేసుల్లో ఇరుక్కొనే అవకాశం ఉందని హెచ్చరించారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 114–00	డ్రెస్డ్ 197–00
రిటైల్ 136–00	స్కిన్‌లెస్ 224–00

అమెరికాలో బతుకమ్మ సంబరాలు



అమెరికాలోని నార్త్ కరోలినా కాంకార్డ్ కానన్స్ ప్రాస్పెక్ట్‌లో తెలంగాణకు చెందినవారు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా పిల్లలు, పెద్దలు కలిసి ఆడిపాడారు. -ఈనాడు డిజిటల్, హైదరాబాద్

నిస్సాన్ న్యూ మ్యాగ్నెట్ కారు ఆవిష్కరణ

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: సరికొత్త టెక్నాలజీతో రూపొందించిన నిస్సాన్ న్యూ మ్యాగ్నెట్ కారును ఆదివారం నటీమణి వర్షిణి సౌందర్ రాజన్ ఎర్రగడ్డ బ్రైట్‌లైన్ నిస్సాన్ షోరూంలో ఆవిష్కరించారు. ఎండీ సిరాజ్‌బాబూఖాన్ మాట్లాడుతూ.. టెక్నాలజీ, 40 ప్లస్ స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్స్ ఉన్న ఈ కారు ధర అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. ఏఎస్ఎం అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న వర్షిణి సౌందర్‌రాజన్, ఎండీ సిరాజ్ బాబూఖాన్

సంతాన భాగ్యం.. కల సాఫల్యం

● గాంధీలో త్వరలో అత్యాధునిక ఐవీఎఫ్ కేంద్రం

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రిలో సంతాన సాఫల్య కేంద్రంలో పూర్తిస్థాయి వైద్య సేవల్ని అందించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పెళ్లై ఏళ్లు గడిచినా పిల్లలు పుట్టకపోవడంతో ఎంతోమంది దంపతులు కార్పొరేట్, ప్రైవేటు సెంటర్ల చుట్టూ తిరుగుతూ రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇది పేద, మధ్యతరగతి వారికి తలకుమించిన భారమే. ఇలాంటి వారికి ఊరట కలిగిస్తూ.. పైసా ఖర్చు లేకుండా సంతాన సాఫల్యం కల్పించేందుకు సర్కారు గాంధీ ఆసుపత్రిలో ఇన్ విట్రో ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురానుంది.



కేంద్రంలో పరికరాలు

మంత్రి ఆదేశాలతో.. ఇటీవల గాంధీ ఆసుపత్రిని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సందర్శించారు. ఈసందర్భంగా కేంద్రం ఏర్పాటుకు నిధులు మంజూరైన విషయాన్ని తెలుసుకొని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

సాకారం కానున్న ఐదేళ్ల కల... గాంధీలో 2018లో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేశారు. కోవిడ్ కారణంగా ఈ ఆసుపత్రిని నోడల్ సెంటర్‌గా మార్చడంతో ఫెర్టిలిటీ సేవలు నిలిచిపోయాయి. కరోనా అనంతరం 2021 సెప్టెంబరులో తిరిగి పునఃప్రారంభించారు. 2022 జనవరిలో పలు రకాల వసతులు కల్పించి ఇంట్రా యుటెరిన్ ఇన్‌సెమినేషన్(ఐయూఐ) అందుబాటులోకి తెచ్చారు. ప్రతి నెల సుమారు 800 మందికి వైద్య సేవలు అందించి 40శాతం ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో 200 పడకల మదర్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) సూపర్ స్పెషాలిటీ సెంటర్ అందుబాటులోకి రావడం, మంత్రి ఆదేశాలు జారీ చేయడంతో ఐవీఎఫ్ కేంద్రాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు తగిన నిధులు కేటాయించి, అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా.. గాంధీ ఎంసీహెచ్ భవనంలో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ సెంటర్‌ను అధునాతన పరికరాలు, సౌకర్యవంతమైన వసతులతో కార్పొరేట్‌కు దీటుగా రూపొందించారు. ఎంబ్రియాలజీ ల్యాబ్, ఐవీఎఫ్ ఆపరేషన్ థియేటర్, ఆండ్రాలజీ ల్యాబ్‌లు, ఫలదీకరణ చేసేందుకు ఆధునిక ఎక్విప్‌మెంట్, సెమన్ ఎనాలసిస్ యంత్రాలు, రీఏజెంట్స్ డయాగ్నోస్టిక్ హిస్టరీ లేపరోస్కోపీ, అల్ట్రాసౌండ్, కంట్రోల్ వేరియంట్, హైపర్ స్టిమిలేషన్ (సీఓఏ)లను సమకూర్చుతున్నారు. ఐవీఎఫ్‌లో ఎంబ్రియాలజీ ప్రక్రియ అత్యంత కీలకమని వైద్యనిపుణులు తెలిపారు.

అన్నిరకాల సేవలు ఉచితం

– రాజకుమారి, గాంధీ సూపరింటెండెంట్



సంతానంలేని దంపతులు పిల్లల కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తుంటారు. ఇక్కడి ఐవీఎఫ్ సెంటర్‌లో అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చు. మందులు, స్కానింగ్ ఇతర వైద్యపరీక్షలు, సేవల కోసం పైసా ఖర్చు చేసే అవసరం లేదు. త్వరలోనే ఐవీఎఫ్ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తాం.



రవీంద్ర భారతిలో బతుకమ్మ ఆడుతున్న మంత్రి సీతక్క

బతుకమ్మను బతికించుకుందాం: సీతక్క

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: చినుకులు రాలుతున్న వేళ.. రవీంద్రభారతి ఆరుబయట బతుకమ్మలు ఆడుతూ.. మహిళలు సందడి చేస్తూంటే.. కూమందరితో గాయని గాయకులు 'ఆమని పాడవే హాయిగా' శీర్షికన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి స్వరనీరాజనం సమర్పించారు. వేదికలో పాల్గొన్న మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ.. అత్తారింటికి వెళ్లిన ఆడబిడ్డ అప్పుడప్పుడు తల్లిగారింటికి రావాలని, తమ కష్టసుఖాలు కన్నవాళ్లతో, స్నేహితులతో పంచుకోవడానికి చక్కటి వేదిక బతుకమ్మ అన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, గాయని గాయకులు సురేఖామూర్తి, వినోద్‌బాబు తదితరులు ఉన్నారు.

ప్రతి గౌడ బిడ్డ 'గోపా'లో సభ్యుడవ్వాలి: మంత్రి



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం నెక్లెస్ రోడ్డు, పీవీమార్గ్‌లోని నీరా కేఫ్‌లో ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ ప్రతి గౌడ బిడ్డ గోపాలో సభ్యుడిగా చేరాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, రాజేశంగౌడ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, హస్తకళల ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్, బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు కోడూరు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. గోపా నూతన కార్యవర్గంలో అధ్యక్షుడు డాక్టర్ బండి సాయన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి జీవీ శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి మొగిలి రఘునాథ్ గౌడ్‌లతో పాటు 50 మంది ఒకేసారి ప్రమాణం చేశారు.

సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

కాచిగూడ, బర్కత్‌పుర – న్యూస్‌టుడే: సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని నేటి యువతకు తెలియజేయాలన్నారు. అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సనాతన ధర్మ సమ్మేళనానికి హాజరు కావాలని ఆదివారం కాచిగూడలోని నివాసంలో సమితి ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. సమితి సలహాదారు దుర్గాప్రసాద్‌రెడ్డి, ఛైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షుడు శంకర్‌గౌడ్ రంగంపల్లి రాజు, పంజాల గిరిధర్‌గౌడ్, బిరి మల్లికార్జున్‌గౌడ్, దోమకొండ కిషోర్, కె చంద్రశేఖర్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డికి పత్రిక అందజేస్తున్న దుర్గాప్రసాద్‌రెడ్డి, ప్రతినిధులు

అటవీశాఖ అధికారుల క్రీడా పోటీలు షురూ

దుండిగల్, న్యూస్‌టుడే: శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంలో క్రీడలు దోహదపడతాయని రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి, అటవీ దళాల అధిపతి ఆర్ఎం డోబ్రియల్ పేర్కొన్నారు. దూలపల్లిలోని తెలంగాణ అటవీ అకాడమీలో ఏడో రాష్ట్రస్థాయి అటవీశాఖ అధికారుల క్రీడా పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో అంతర్భాగమని, క్రమశిక్షణను నేర్పుతాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 815 మంది అటవీ శాఖ అధికారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జోనల్, రాష్ట్రస్థాయిలో ప్రతిభచూపిన వారు ఈనెల 16న రాయపూర్ వేదికగా జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనున్నారు. ప్రారంభ వేడుకలో రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారులు ఎలుసింగ్ మేరు, సువర్ణ, రామలింగం, రాష్ట్ర అటవీ అకాడమీ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎం డోబ్రియల్

విశ్వ వేదికపై భారతీయ ప్రమాణాలకు అగ్రస్థానం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: విశ్వవేదికపై భారతీయ ప్రమాణాలు ప్రత్యేక స్థానం పొందుతున్నాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఉదయం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రన్ ఫర్ క్వాలిటీలో పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ఐమాక్స్ వద్ద ఉన్న హెచ్ఎండీఏ మైదానం నుంచి జలవిహార్ వరకు పరుగు సాగింది. బీఐఎస్ హైదరాబాద్ శాఖ అధిపతి పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ ఐఎస్ఐ మార్కు వినియోగదారుల భరోసాగా నిలుస్తోందని, ప్రతీ ఒక్కరూ బీఐఎస్ స్టాండర్డ్స్ మార్కు ఉన్న వస్తువులను మాత్రమే కొనాలని కోరారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్లు సుజాత, తన్నీరు రాకేశ్, సెక్షన్ ఆఫీసర్ వనజ మూర్తి, ఎస్పీఏ అభిసాయి పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

అందుబాటులోకి వెన్నెముక ఆరోగ్య సంరక్షణ కొత్త విధానం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: శస్త్రచికిత్స అవసరం లేకుండా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని వెన్నెముక ఆరోగ్య సంరక్షణతో ఒక కొత్త విధానాన్ని ఆదివారం నగరంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫిన్‌లాండ్‌లోని నార్డిక్ హెల్త్ భాగస్వామ్యంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 92లో ఎన్-ష్యూర్ హెల్తీ స్పైన్ పేరుతో ఏర్పాటుచేసిన ఈ వెన్నెముక ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని బ్యాడ్మింటన్ ఛాంపియన్, జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వెన్నెముక విషయంలో కృత్రిమ మేధ సహకారంతో రూపొందించిన ఈ విధానంలో ఉపయోగించే ఉపకరణాల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు అవుతుందన్నారు. ఎన్-ష్యూర్ హెల్తీ స్పైన్ ఛైర్మన్ కాసు ప్రసాద్‌రెడ్డి, సహ వ్యవస్థాపకులు డాక్టర్ సుకుమార్ సురా, సీఈఓ నరేష్‌కుమార్ పగడిమర్రి మాట్లాడుతూ పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ (పీజీబీఏ) సహకారంతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుందని అన్నారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు చాముండేశ్వరీనాథ్, హైసియా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ లింగిరెడ్డి, ఫిన్‌లాండ్‌లోని నార్డిక్ హెల్త్‌లో శిక్షణ, విద్యావిభాగాధిపతి జోహన్నా పెంటి తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రంతో పుల్లెల గోపీచంద్, చిత్రంలో చాముండేశ్వరనాథ్, కాసు కృష్ణారెడ్డి, డాక్టర్ సుకుమార్ సురా తదితరులు

లంగ్ క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే ప్రాణాలు కాపాడొచ్చు

మాదాపూర్, న్యూస్‌టుడే: మన దేశంలో ఊపిరితిత్తుల వ్యాధులు, ముఖ్యంగా ఊపిరితిత్తుల క్యాన్సర్లు, క్షయ, న్యుమోనియాలు పెరుగుతున్నాయని హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ సీనియర్ పల్మనాలజీ వైద్య నిపుణులు డాక్టర్ వి.నాగార్జున మాటూరు అన్నారు. సీటీ స్కాన్‌ల వాడకం పెరగడంతో చాలా సందర్భాల్లో ఊపిరితిత్తుల నోడ్యూల్స్ గుర్తిస్తున్నారని తెలిపారు. ఆదివారం మాదాపూర్‌లోని యశోద ఆసుపత్రిలో 'నోడ్యూల్ సమ్మిట్-2024' సదస్సు నిర్వహించారు. డాక్టర్ వి.నాగార్జున మాటూరు మాట్లాడుతూ.. ఊపిరితిత్తుల క్యాన్సర్ భారత్‌లో మరణాలకు ప్రధాన కారణమన్నారు. యశోద గ్రూప్ హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్.పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. హైటెక్ సిటీ యశోద హాస్పిటల్‌లోని పల్మనరీ మెడిసిన్ స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ డిపార్ట్‌మెంట్, క్లినికల్, ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ రంగంలో రోగుల సంరక్షణ, పరిశోధన, విద్యలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిందన్నారు. కార్యక్రమంలో విదేశీ వైద్యులు డాక్టర్ మషాహిదే ఓకీ, డాక్టర్ కైల్ హోగార్త్, డాక్టర్ యాన్ మింగ్ సాయ్, డాక్టర్ లిన్ షెంగ్ హావో, డాక్టర్ ఎరిక్ డేనియల్ టెండా పాల్గొన్నారు.



సదస్సు ప్రారంభిస్తున్న వైద్యులు నాగార్జున మాటూరు, పవన్ గోరుకంటి తదితరులు

దాండియా జోరు.. యువత హుషారు



నవరాత్రి ఉత్సవ్‌లో యువతీ యువకుల జోరు

బేగంపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కంట్రీక్లబ్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవ్- 2024 బేగంపేటలోని పోలీసు హాకీ స్టేడియంలో ఆదివారం రాత్రి దాండియా వేడుకలు ఆకట్టుకున్నాయి. కంట్రీక్లబ్ సీఎండీ రాజీవ్ రెడ్డి, ఈవెంట్ నిర్వాహకులు సందీప్ కుమార్ పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి




నిరంజన్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్, ప్రీతి

కాచిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని బీసీలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ అన్నారు. ఆదివారం కాచిగూడలో మున్నూరు కాపు సంఘం మహాసభ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రీతి, ప్రధాన కార్యదర్శి సునీత ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలకు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిరంజన్ హాజరయ్యారు. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి హన్మంత్‌రావు, ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్, అనిల్‌కుమార్, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ రఘునాథ్‌రావు, ట్రస్టీలు పాల్గొన్నారు.

పండగలతో ప్రజల మధ్య ఐకమత్యం

అబిడ్స్, న్యూస్‌టుడే: పండగలు ప్రజల మధ్య సమైక్యత దోహదం చేస్తాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన బషీర్‌బాగ్‌లోని చారిత్రక కనకదుర్గ నాగలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఛైర్మన్ రామరాజు, కార్పొరేటర్ డా.సురేఖ, సభ్యులు రమేశ్‌యాదవ్, శ్రీశైలం, భీష్మ రవీందర్, మాజీ కార్పొరేటర్ రాంచందర్‌రాజు, ఆల పురుశోత్తంరావు, ప్రకాశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేసిన తలసాని శ్రీనివాస్‌యాదవ్

కనువిందు చేస్తున్న నవరాత్రి కంచిపట్టు చీరలు



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తొమ్మిది రంగులు, తొమ్మిది డిజైన్లతో రూపొందించిన నవరాత్రి పట్టు చీరలు జూబ్లీహిల్స్ మంగళగౌరీ గ్రాండియర్ శాఖలో కనువిందు చేస్తున్నాయి. ఆదిపరాశక్తి తొమ్మిది రూపాలు, నవరాత్రి పూజల ప్రత్యేకతలను ప్రతిబింబిస్తూ బంగారం, వెండి, రాగి తీగలతో కూడిన డిజైన్లతో తెలుపు, ఎరుపు, గాఢ నీలం, పసుపు, బాటిల్ గ్రీన్, గ్రే, లేత నీలం, ఆరంజ్, పింక్ ఇలా తొమ్మిది రంగులతో రూపొందించినట్లు మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.కృష్ణమూర్తి తెలిపారు. దేశంలోని వివిధ ప్రదేశాల చేనేత కళాకారులతో తొమ్మిది నెలల కాలంలో తొమ్మిది రంగుల్లో తొమ్మిది ప్రత్యేకమైన డిజైన్లతో విశిష్టమైన తొమ్మిది రకాల పట్టు చీరలకు రూపకల్పన చేశామన్నారు. దేవీ నవరాత్రుల సందర్భంగా వీటిని కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

తగ్గింపు ధరల్లో బ్రాండెడ్ దుస్తులు



మాదాపూర్, న్యూస్‌టుడే: మాదాపూర్‌లోని రహేజా మైండ్ స్పేస్ ఐటీ పార్కులోని ది వెస్టిన్ హోటల్‌లో ప్రముఖ దుస్తుల కంపెనీ తమ ఫ్రెష్ కలెక్షన్స్ స్టాక్ 80శాతం వరకు తగ్గింపుతో విక్రయిస్తున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు దుస్తుల విక్రయం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. 35కుపైగా కౌంటర్లలో 30వేలకుపైగా దుస్తులు ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ప్రసిద్ధ బ్రాండ్ దుస్తులు, పాదరక్షలు భారీ తగ్గింపుతో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8 వరకు అమ్మకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల వితరణ



సైదాబాద్, న్యూస్‌టుడే: జీబీఆర్‌ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో దసరా పండగ సేవల్లో పలువురు పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు బహూకరించారు. సైదాబాద్ ఎస్సీహెచ్ గడ్డిఅన్నారం-1 కాలనీలోని పద్మావతి కల్యాణ మండపం ఎదుట ఆదివారం నిర్వహించిన పంపిణీ కార్యక్రమాన్ని ట్రస్ట్ సభ్యుడు గొట్టుముక్కల రామరాజు ప్రారంభించారు. 20 మంది మహిళలకు వస్త్రాలు అందజేసినట్లు ట్రస్ట్ ఓ ప్రకటనలో పేర్కొంది. కాలనీసంఘం కార్యదర్శి వైవీ రామరాజు, ఉపాధ్యక్షురాలు నీరజ, కోశాధికారి వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎల్.బి.నగర్

• ఎల్.బి.నగర్ • మలక్‌పేట

కాలనీలో ఆసుపత్రి నిర్మాణం వద్దంటూ ఆందోళన

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: కాలనీలో ఆసుపత్రి నిర్మాణం చేపట్టొద్దని శాతవాహన నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం ఆందోళన చేపట్టారు. లింగోజిగూడ డివిజన్ శాతవాహన నగర్ కాలనీ ప్రధాన రోడ్డులో నిర్వహిస్తున్నా ఓ ప్రైవేటు ఆసుపత్రి అక్కడే మరో భవన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. విషయం తెలుసుకున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు ఆదివారం అక్కడికు చేరుకొని పనులను అడ్డుకున్నారు. నివాసాల మధ్య ఎట్టి పరిస్థితుల్లో ఆసుపత్రి నిర్మాణం చేపట్టొద్దని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య స్వల్ప ఘర్షణ వాతావరణ చోటు చేసుకుంది. అనంతరం పనులు నిలిపివేయడంతో సమస్య సద్దుమణిగింది. స్థానికుల మాట్లాడుతూ.. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం, న్యూస్‌టుడే: వనస్థలిపురం పరిధి సచివాలయనగర్ రెడ్ వాటర్‌ట్యాంక్ సమీపంలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా సాగుతున్నాయి. మూడోరోజు ఆదివారం మంగళ వాద్యాలతో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. సుప్రభాతసేవ, సువర్ణ పుష్పార్చన, అభిషేకం, సూర్య హోమం, సింహవాహనంపై తిరువీధి ఉత్సవం, శ్రీహరి కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కే. లక్ష్మయ్య, సత్యనారాయణ, గణపతి, జగదీశ్ కుమార్, పాపారావు, శ్యామల, రామలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పరామర్శ

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: పితృవియోగంతో బాధపడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు కలిసి పరామర్శించారు. అనంతరం మంత్రి తండ్రి పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిధులు విడుదల చేయాలని మంత్రికి వినతి

మూసారాంబాగ్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏళ్లుగా ప్రభుత్వ వసతి గృహాలకు నిధులు మంజూరుకాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేశ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేసినట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమ వసతిగృహాల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. సభ్యులు సత్యం, కుమార్, మేడి నాగరాజు, సతీశ్, యోగేశ్, ఎలిజబెత్, ఉష, పూజ పాల్గొన్నారు.

గాడితప్పిన వరద కాల్వల నిర్వహణ

☛ రహదారులపై నిలుస్తున్న నీరు ☛ లోతట్టు ప్రాంతాల ప్రజలకు తప్పని అవస్థలు



ఎస్సీహెచ్ కాలనీ రహదారిపై వరద

సైదాబాద్, న్యూస్‌టుడే: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో వరద కాల్వల నిర్వహణ గాడితప్పింది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే రహదారులపై వాహనాలు ఎక్కడికక్కడే గంటల తరబడి నిలుస్తున్నాయి. అంతర్గత మార్గాల్లో వరద పెద్ద ఎత్తున నిలుస్తుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలానికి ముందే వరద కాల్వల్లో పూడిక వ్యర్థాలు తొలగించాల్సి ఉండగా.. గుత్తేదారులు నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. బల్దియా ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయి నిర్వహణ బాధ్యత వర్క్స్ ఇన్‌స్పెక్టర్లకు వదిలి వేయడంతో పర్యవేక్షణ గాడితప్పింది.

క్యాచ్‌పిట్లలోకి చెత్తాచెదారం..

వరద ఉద్ధృతితో పాటు రహదారుల పక్కనే నిల్వ ఉండే చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు.. క్యాచ్‌పిట్లలోకి చేరుతున్నాయి. కొన్ని కచ్చా మోరీ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు, నిర్మాణ వ్యర్థాలు, సామగ్రి సైతం వరద కాల్వల్లోకి చేరి, ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. వర్షం కురిసే సమయంలో యంత్రాంగం ప్రధాన రహదారులపైనే దృష్టి పెట్టి, అంతర్గత మార్గాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నిర్లక్ష్యం చూపుతున్నారు. వరద కాల్వలపై చాలా ప్రాంతాల్లో సిమెంట్ మూతలు ఏర్పాటుచేశారు. కొన్ని ప్రాంతాల్లో ఇనుము గ్రిల్స్, మరికొన్ని ప్రాంతాల్లో రాతి కడీలు ఉన్నాయి. వీటిల్లోకి చేరుతున్న చెత్త కారణంగా వరద అనుకున్నంత సాఫీగా వెళ్లడం లేదు. వరద కాల్వల సమీపంలో పారిశుద్ధ్య కార్మికులకు చెత్తాచెదారం, ఇతర వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

కాల్వల్లోకి వేర్లు..

వృక్షాలు, చెట్లు అత్యధికంగా ఉన్న ప్రదేశాల్లోని వరద కాల్వల్లో వేర్లు పెరిగి, సమస్యలు సృష్టిస్తున్నాయి. క్షేత్రస్థాయి పరిశీలన అటకెక్కడంతో సిబ్బంది.. ఈవిషయంలో స్పష్టత ఇవ్వడం లేదు. మలక్‌పేట బీ-బ్లాక్‌లో వరద నీరు నిలుస్తుండటంతో ఇటీవల తవ్వకాలు చేపట్టగా, పైపులు వేర్లు ఆక్రమించాయి. సమీపంలో పెద్దఎత్తున్న చెట్లు ఉండటమే ఇందుకు కారణమని ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. పూడిక వ్యర్థాలతో పాటు వేర్లు తొలగిస్తేనే వరద సాఫీగా వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ఆ దిశగా దృష్టి పెట్టాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.



శ్రీపురంకాలనీలో క్యాచ్‌పిట్ వద్ద చెత్త..

నియోజకవర్గ పరిధిలో..

- వరదకాల్వల పొడవు: 30 కిలోమీటర్లు
- క్యాచ్‌పిట్లు: సుమారు 9,000
- ఏడాదికి నిధుల కేటాయింపు: డివిజన్ రూ.7 లక్షలు
- నియోజకవర్గంలో డివిజన్లు: ఏడు
- ఎన్నిసార్లు శుభ్రం చేయాలి: ఏడాదికి రెండు సార్లు (డిసెంబరు తర్వాత ఒకసారి, జూన్ తర్వాత మరోసారి)

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య	మలక్‌పేట: 80085 73284
ఎల్బీనగర్: 76759 19030	హయత్‌నగర్: 98336 64897
	కర్మన్‌ఘాట్: 94400 32872
	బండ్లగూడ: 96034 78579
	మూసారాంబాగ్: 79933 00559

న్యూస్‌టుడే, సైదాబాద్, బండ్లగూడ, అక్బర్‌బాగ్

? సైదాబాద్ లోకాయుక్త కాలనీ ఉద్యానం వెనుక పాదబాటలపై చెట్ల కొమ్మలు పడేశారు. తొలగించి పదిహేను రోజులు దాటింది. అయినా నేటికీ తరలించడం లేదు. – స్నేహలత, సైదాబాద్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన పరిష్కార చర్యలు తీసుకుంటాం. – అనురాధ, ఏఎంవోహెచ్, మలక్‌పేట

? గోపాలకృష్ణపురం పరిధి కెనడీ పాఠశాల పక్కన పది రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. ఫిర్యాదు చేసేందుకు ఫోను చేస్తే సిబ్బంది స్పందించడం లేదు. –బి.శ్రీను, గోపాలకృష్ణపురం

✓ తక్షణమే క్షేత్ర స్థాయిలో పరిశీలించి, మరమ్మతులు చేపడతాం. – కోటయ్య, సూపర్‌వైజర్, జీహెచ్‌ఎంసీ లైటింగ్ విభాగం

? మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ పక్క వీధి నుంచి రేస్ కోర్స్‌కు వెళ్లే రోడ్డు మూలమలుపు మూత్ర విసర్జనకు అడ్డాగా మారింది. భరించలేని దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. అధికారులు స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలి. –అరుణ, మున్సిపల్ కాలనీ

✓ ఒకసారి క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి, పరిష్కార చర్యలు తీసుకుంటాం. – జయంత్, ఉప కమిషనర్, మలక్‌పేట

చీపుర్లు పట్టి.. స్వచ్ఛతకు కదిలి..



నాగోలు డివిజన్ సాయినగర్ సౌత్ కాలనీలో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కాలనీవాసులంతా చీపుర్లు చేతబట్టి.. వీధులు శుభ్రం చేశారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతని, దుకాణదారులు సైతం వీధుల్లో చెత్తాచెదారం వేయవద్దని సూచించారు. బద్దం భాస్కర్‌రెడ్డి, ఉమేశ్‌గౌడ్, సుధాకర్, రాము, పరమేశ్వర్‌రెడ్డి, శివకృష్ణ, కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, భరత్, వీరాచారి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నాగోలు

పీ అండ్ టీ కాలనీ స్వర్ణోత్సవం



కాలనీవాసులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

నాగోలు: దిల్‌సుఖ్‌నగర్ సమీపంలోని పీఅండ్‌టీ కాలనీ ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం కాలనీ సామాజిక భవనంలో స్వర్ణోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1974లో ఏర్పడిన కాలనీ నుంచి దశలవారీగా పలు చిన్న కాలనీలు ఏర్పడినా.. తన ప్రాభవాన్ని నిలబెట్టుకుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్పొరేటరు ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటరు భవానీ ప్రవీణ్, కాలనీ ప్రతినిధులు అశోక్, మున్నాయాదవ్, శ్రీనివాస్, శ్రీధర్, కిశోర్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి సత్కారం



రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వై. కొండల్‌రెడ్డి ఆదివారం శాసన మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మహేందర్‌రెడ్డి మండలి చీఫ్ విప్‌గా నియామకమైన సందర్భంగా ఆయనను సత్కరించారు. న్యాయవాదులడిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల ముందు లాయర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షల గురించి ఆయనకు వివరించారు. అన్ని విషయాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కొండల్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా మాజీ సహాయ ప్రభుత్వ న్యాయవాది సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం: సీపీఎం




పార్టీ జెండావిష్కరణలో చంద్రమోహన్, నాయకులు

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: దేశంలో రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రమోహన్ అన్నారు. హస్తినాపురం నందనవనంలో ఆదివారం కే.రాములు అధ్యక్షతన పార్టీ తొమ్మిదో మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు తగ్గినా.. దేశంలో నిత్యావసర సరకుల ధరలు మాత్రం నిత్యం పెరుగుతున్నాయన్నారు. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కేంద్రంలో భాజపా ప్రభుత్వం అవినీతిని చట్టబద్ధం చేసే చర్యలకు పెద్దపీట వేస్తుందన్నారు. ధరల నియంత్రణలో ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ఈ నెల 15 నుంచి సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నందనవనం సీపీఎం శాఖ నూతన కార్యదర్శిగా యాదయ్యను ఎన్నుకున్నారు. నేతలు కీసరి నర్సిరెడ్డి, ఆలేటి ఎల్లయ్య, కమర్, రాములు, రవి, లక్ష్మయ్య, గణేశ్ పాల్గొన్నారు.

'సీరత్-ఉన్-నబీ' క్విజ్ పోటీలు

సైదాబాద్, న్యూస్‌టుడే: ప్రవక్త మహమ్మద్ జీవితం, బోధనల గురించి 'సీరత్-ఉన్-నబీ' పేరిట ఆదివారం క్విజ్ పోటీ నిర్వహించారు. మస్జిద్-ఏ-హనాఫియా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఆదివారం సైదాబాద్ శంకేశ్వర్‌బజార్ మస్జిద్-ఏ-హనాఫియాలో ఉన్న మొదటి అంతస్తులో మహిళలకు, రెండో అంతస్తులో పురుషులకు పోటీలు జరిగాయి. ఆబ్జెక్టివ్ రూపంలో 75 ప్రశ్నలతో ముద్రించిన పత్రాలను 125 మందికి అందజేసి, ప్రతిభను పరీక్షించారు. విజేతలకు ఈ నెల 13న నగదు బహుమతులు, జ్ఞాపికలు, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఉపాధ్యక్షుడు హసన్ బిన్ సాలేహ్, కోశాధికారి జహీర్, ప్రతినిధులు అర్షద్, మహమూద్ సిద్ధిఖ్ పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి పూజలు



పల్టన్ హరిహరక్షేత్రంలో అన్నపూర్ణగా..

కర్మన్‌ఘాట్, వనస్థలిపురం, బండ్లగూడ, అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే: ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో దేవీ శరన్నవరాత్రి పూజలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. పలు మండపాల్లో అమ్మవారు ఆదివారం లలితా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పల్టన్ హరిహర క్షేత్రంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవీగా అలంకరించారు. చంపాపేటలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ప్రత్యేక పూజలు చేశారు. లింగోజిగూడ మణిపురి కాలనీలో యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహానికి కాంగ్రెస్ నేత ప్రవీణ్‌రెడ్డి పూజలు నిర్వహించారు. బైరామల్‌గూడ హరిహర క్షేత్రంలో భాజపా నేత సద్దిసందీప్‌రెడ్డి తదితరులు గోపూజ చేశారు. బండ్లగూడలో మహంకాళి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హయత్‌నగర్ డివిజన్ రాజప్ప నగర్‌లో భక్తులకు అన్నదానం చేపట్టారు. రాజప్ప నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దీపావళి శ్రవణ్‌కుమార్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



చంపాపేటలో సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్, నేతలు



బండ్లగూడలో మహంకాళి యూత్ ఆధ్వర్యంలో..

ఉద్యమకారుల పోరాటాన్ని గుర్తించాలి



సత్కారం పొందిన ఉద్యమకారులు

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అమరుల త్యాగాలతో పాటు ఉద్యమకారుల పోరాటాన్ని ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డా.చీమ శ్రీనివాసరావు అన్నారు. జవహర్‌నగర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం 120 మంది ఉద్యమకారులను సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటని, రాష్ట్ర ఆవిర్భావ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం నిజాయతీగా కృషి చేయాలని సూచించారు. సుధాకర్‌చారి, ప్రకాశ్, నర్సింహ, అనంతలక్ష్మీ పాల్గొన్నారు.

యూపీకి చేరిన న్యాయవాదుల క్రికెట్ జట్టు



రాఘవేంద్రరెడ్డికి జెర్సీ అందజేస్తున్న ఆదిత్యనాథ్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: 36వ అఖిల భారత న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ న్యాయవాదుల క్రికెట్ జట్టు ఆదివారం ఉత్తర్‌ప్రదేశ్ చేరుకుంది. అక్కడకు చేరిన తెలంగాణ జట్టుకు ఘన స్వాగతం లభించినట్లు జట్టు కెప్టెన్ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం సుభాన్‌పూర్ గ్రామానికి చెందిన న్యాయవాది పోచారం రాఘవేంద్రరెడ్డి తెలిపారు. తెలంగాణ న్యాయవాదుల జట్టు ఛైర్మన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ పూర్వ ఛైర్మన్ ఎం. రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారులు ఉత్తరప్రదేశ్ వెళ్లారు. ఈ నెల 12 వరకు జరిగే పోటీల్లో మొత్తం 16 రాష్ట్రాలకు చెందిన న్యాయవాదుల జట్లు పాల్గొంటున్నాయి. పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. ఆయా రాష్ట్రాల జట్ల కెప్టెన్లకు జెర్సీలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

యతి నర్సింహానంద మహరాజ్‌పై చర్యలకు డిమాండ్

గోల్కొండ, న్యూస్‌టుడే: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యతి నర్సింహానంద మహరాజ్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం రాత్రి గోల్కొండ కోట నుంచి రాణా వరకు స్థానిక ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆల్ ఇండియా తీరత్ అకాడమీ అధ్యక్షుడు సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ మాట్లాడుతూ.. మతాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసిన వారిని ఉపేక్షించొద్దన్నారు. అన్నీ మతాలను గౌరవించాలన్నారు. కుతుబ్‌షాహీ ఈద్గా అధ్యక్షుడు గులాం మొయినుద్దీన్ పాషా, షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలను నవతరానికి పరిచయం చేయాలి



నాట్యగురువులను సత్కరించిన డా.కె.వి.రమణాచారి, చిత్రంలో జి.వసుంధర, సుధామాల

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: భారతీయ శాస్త్రీయ కళలను నవతరానికి పరిచయం చేయడంతో పాటు ప్రోత్సహించాలని ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె. వి. రమణాచారి అన్నారు. ఆదివారం రెడ్‌హిల్స్‌లోని కె. వి. రమణాచారి క్యాంపు కార్యాలయంలో ఇటీవల నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన '49వ జాతీయస్థాయి సంగీత, నృత్య పోటీలను' విజయవంతం చేసిన నాట్యగురువులకు అభినందనసభ, సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్యగురువులు నిష్ఠల సుధామాల, డా. పి. ఇందిరా హేమలను సత్కరించారు. సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి. వసుంధర, నాట్యగురువులు మధుమతి కులకర్ణి, వి. వాణీరమణ, ఆచార్య ఏలేశ్వరపు చలపతిశాస్త్రి, డా. ఆచార్య ఫణీంద్ర, విశ్వనాథ్ మద్దిపట్ల, బి. వి. నారాయణరావు, వి. రమాదేవి, ఆర్. ఎన్. సుధారాణి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారుల్లో అపార ప్రతిభ : ఈటల

శామీర్‌పేట: గ్రామీణ క్రీడాకారుల్లో అపార ప్రతిభ ఉందని, దాన్ని వెలికి తీసేందుకు జీఎన్‌ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో జీఎన్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ఎంపీపీల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.చంద్రశేఖర్ యాదవ్, కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు బుద్ధి శ్రీనివాస్, మండల భాజపా అధ్యక్షుడు యాదగిరి, కాంగ్రెస్ మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాసానికి అనువుగా ఇల్లు కట్టుకోవాలి

వనస్థలిపురం, న్యూస్‌టుడే: నాలుగు మూలలు కలిగిన స్థలంలో నివాసానికి అనుకూలమైన ఇల్లు కట్టుకోవాలని వాస్తు నిపుణుడు, విశ్రాంత ఇంజినీరు కృష్ణాది శేష సూచించారు. అక్టోబరు మొదటి సోమవారం అంతర్జాతీయ ఆవాస దినోత్సవ సందర్భంగా వనస్థలిపురంలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి భూమ్మీద నివసించేందుకు గాలి, నీరు, ఆహారంతో పాటు ఇల్లు అవసరమన్నారు. అపార్టుమెంట్ కట్టే స్థలం సరిగా లేకపోయినా, అందులో కట్టే భవనం నాలుగు మూలలు కలిగి ఉండేలా కట్టుకుంటే వాస్తు ఫలితాలు పొందొచ్చని తెలిపారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి



షాబాద్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా షాబాద్ మండలం ఆస్పల్లిగూడకు చెందిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పార్టీకి చేసిన సేవలు గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హడలెత్తిస్తున్న వీధి శునకాలు



హనుమాన్ నగర్‌లో కుక్కల సంచారం

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: వీధి శునకాలు రహదారులపై గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. హస్తినాపురం డివిజన్ పరిధి జడ్పీ రోడ్డులోని హనుమాన్‌నగర్, శ్రీరమణ కాలనీ, తుల్జాభవాని నగర్, కస్తూరి కాలనీ, భూపేశ్‌గుప్తా నగర్, నందనవనం కాలనీల్లో ఈ సమస్య నెలకొంది. సమస్య పరిష్కార చర్యలు చేపడుతున్నామని అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రకటనలకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి నెలకొంది. జడ్పీ రోడ్డు, టీకేఆర్ రోడ్డులోని పలు కాలనీల్లో ఖాళీస్థలాలు అధికంగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి పలువురు వ్యక్తులు మాంసం, ఇతర వ్యర్థాలను తీసుకొచ్చి పారబోస్తున్నారు. ఆయా వ్యర్థాల వద్దకు శునకాలతో పాటు పందులు చేరి స్వైరవిహారం చేస్తున్నాయి. వాటిని తిన్న కుక్కలు.. పిచ్చిగా ప్రవర్తిస్తూ, రహదారులపై రాకపోకలు సాగిస్తున్న వారిపై దాడులు చేస్తున్నాయి. హనుమాన్‌నగర్, నందనవనం, భూపేశ్‌గుప్తానగర్, శ్రీరమణ కాలనీ, కస్తూరి కాలనీల్లో ఈ సమస్య నెలకొంది. కుక్కల భయంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఒకటి, రెండ్రోజుల్లో ప్రత్యేక డ్రైవ్..: బానోతు సుజాతానాయక్, కార్పొరేటర్, హస్తినాపురం

కొన్ని కాలనీల్లో నెలకొన్న వీధి శునకాల సమస్యను ఇప్పటికే వెటర్నరీ అధికారులతో దృష్టికి తీసుకెళ్లా. తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించా. మరోసారి అధికారులతో మాట్లాడి.. ఒకటి, రెండు రోజుల్లో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి, కుక్కలను పట్టి తరలిస్తాం. ఆయా కాలనీల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

స్త్రీశక్తిని పూజించడం హైందవ సంప్రదాయం



మాట్లాడుతున్న శ్రీరాం భరత్, వేదికపై పంకజ్ మిశ్రా

నాచారం, న్యూస్‌టుడే: స్త్రీశక్తిని పూజించే సంప్రదాయం హైందవ ధర్మంలో మాత్రమే ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహ క్షేత్ర ప్రచారక్ శ్రీరాంభరత్ తెలిపారు. నాచారంలోని దిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఉప్పల్ భాగ్ ఆధ్వర్యంలో విజయ దశమి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సర్వేయర్ జనరల్ పంకజ్ మిశ్రా, ముఖ్య ప్రసంగికులు శ్రీరాంభరత్, భాగ్ సంఘచాలక్ అంకం శంకర్ పాల్గొని ఆయుధపూజ చేసి, విజయ దశమి విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రీరాంభరత్ మాట్లాడుతూ.. హిందూ సమాజం సంఘటితంతోనే దేశంలో శాంతి సాధ్యమన్నారు. సామాజిక సామరస్యత, కుటుంబ ప్రబోధన, నాగరిక శిష్టాచారి, పర్యావరణ పరిరక్షణ.. వంటి అంశాల ద్వారా దేశంలోని 140 కోట్ల మంది ప్రజలను జాగృతం చేస్తున్నామని తెలిపారు. పంకజ్ మిశ్రా మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, జీవనవిధానం, ఆచార వ్యవహారాలు ప్రపంచానికే ఆదర్శనీయం అని అన్నారు. అంతకు ముందుకు దిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి 4 కిలోమీటర్లు స్వయం సేవకులు గోష్ వాయిద్యాలతో నడుమ పద సంచలనం నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే సుభాశ్‌రెడ్డి, డీపీఎస్ ఛైర్మన్ మల్కా కొమరయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశాల్ జాగరణ్


ఏకరూప దుస్తులతో సమితి ప్రతినిధులు

ధూల్‌పేట: ధూల్‌పేట నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రహీంపురలోని డా.అంబేడ్కర్ క్రీడా మైదానంలో మాతా రాణికా విశాల్ జాగరణ్ వైభవంగా జరిగింది. శనివారం రాత్రి 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు కొనసాగింది. మా శక్తి యువ మండలం భాగ్యనగర్ ప్రముఖ గాయకులు ఠాకూర్ రవిసిర్, సుశ్రీ సాక్షి, రాజన్‌కుమార్‌లతో కూడిన బృందం గేయాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ సమితి ఛైర్మన్ శ్రీధర్‌బాబు, వైస్ ఛైర్మన్ సత్యనారాయణ, అధ్యక్షుడు టి.జితేందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి నిమేశ్‌సింగ్, కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, లాల్‌సింగ్, శశికళ, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీసింగ్, సమితి సలహాదారులు సదానంద్‌గుప్తా, విపిన్‌రాజ్‌సింగ్, సచిన్‌రాజ్ పాల్గొన్నారు.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

దసరాకు ప్రత్యేక బస్సులు సిద్ధం

– న్యూస్‌టుడే, కంచన్‌బాగ్(మిధాని)

దసరా పండగ సందర్భంగా ప్రయాణికులకు టీజీ ఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయం తీసుకుంది. మిధాని డిపో పరిధిలోని బస్సులను సిద్ధం చేశారు. ఇక్కడి నుంచి ఏపీలోని పలు నగరాలు, పట్టణాలకు నడిపేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించేందుకు ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుకింగ్ ఇప్పటికే మొదలైంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణికులు అధిక శాతం టికెట్లు పొందారని ఆర్టీసీ అధికారులు తెలిపారు.


మిధాని డిపో గ్యారేజీలో..

మిధాని డిపో నుంచి 15..

మిధాని డిపో నుంచి ఇతర ప్రాంతాలకు పంపేందుకు ఇప్పటికే 15 బస్సులు సిద్ధం చేశారు. ఎంజీబీఎస్, ఖమ్మం, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు సిద్ధమయ్యాయి. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటారు. దూర ప్రాంతాలకు బట్టి మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని బస్సులు సిద్ధం చేయనున్నారు.

డిమాండ్ మేరకు నిర్ణయం

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు డిపో నుంచి బస్సులు తొలుత ఎంజీబీఎస్‌కు వెళ్తాయి. అక్కడి నుంచి విజయవాడ, ఖమ్మం ప్రాంతాలకు ఈ నెల 12 వరకు రాకపోకలు సాగించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. శనివారం నుంచి పలు ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నారు. ప్రయాణికుల డిమాండ్, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌కు అనుగుణంగా మరిన్ని ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడపడానికి ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రద్దీకి అనుగుణంగా నడిపిస్తాం

– పి.విజయ్‌కుమార్, డీఎం, మిధాని డిపో

డిపోలో 70 బస్సులు అందుబాటులో ఉన్నాయి. 15 ప్రత్యేక బస్సులను సిద్ధం చేశాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటాం. పండుగ కోసం రాకపోకలు సాగించే ప్రయాణికులను సురక్షితంగా నిర్ణీత సమయానికి వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఉన్నతాధికారుల నిర్ణయాల మేరకు బస్సుల కేటాయింపుల్లో మార్పులు ఉండొచ్చు.

వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు


హరిబౌలిలో మాతేశ్వరి పోచమ్మ మహంకాళి


విజయనగర్‌కాలనీలో..

చాంద్రాయణగుట్ట, కార్వాన్, చార్మినార్, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళిని ఆదివారం కూష్మాండదేవిగా అలంకరించారు. ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ మాజీ ఛైర్మన్ కె.వెంకటేశ్ ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించారు. ● సుల్తాన్‌షాహీ జగదాంబ గుడిలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. ఆలయకమిటీ ఛైర్మన్ రాకేశ్ తివారీ, ప్రతినిధులు శశాంక్ తివారి, వేణుగోపాల్ ఉన్నారు. ● ఉప్పుగూడ మహంకాళిని లలితాదేవిగా అలంకరించారు. లాల్‌దర్వాజా మేకలబండ నల్లపోచమ్మను అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. ● కార్వాన్ ధార్మిక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దర్బార్ మైసమ్మ ఆలయ కూడలిలో జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ పాల్గొని పూజలు చేశారు.


లాల్‌దర్వాజా మహంకాళిని దర్శించుకుంటున్న ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


గౌలిపుర హనుమాన్‌నగర్ ఫేజ్-3లోని బంగారు మైసమ్మ గుడిలో హోమం

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

– న్యూస్‌టుడే, చాంద్రాయణగుట్ట, కార్వాన్, బేగంబజార్

? ఉప్పుగూడ మారుతీనగర్ బస్తీలో తాగునీటి సరఫరాలో సమయపాలన పాటించడం లేదు. నిర్ణీత సమయంలో సరఫరా చేయాలి.
– సాయికుమార్, ఉప్పుగూడ

✓ బస్తీలో గతంలో మాదిరిగా నిర్ణీత సమయంలో తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం. – సురేశ్‌కుమార్, డీజీఎం, బాలాపూర్

? తాళ్లగడ్డ, రాంసింగ్‌పుర, కార్వాన్ లేబర్ అడ్డా ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగటం లేదు. పండగ పూట సమస్య పరిష్కరించాలి.
– రాజగోపాల్‌యాదవ్, తాళ్లగడ్డ

✓ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతాం.
– మహ్మద్ ముషారఫ్, వీధి దీపాల విభాగం అధికారి, కార్వాన్

? ఎంజీబీఎస్‌లోని మెట్రో స్టేషన్ వద్ద గల స్టాల్‌లో నిబంధనలకు విరుద్ధంగా సిగరెట్లు విక్రయిస్తున్నారు. కొంత మంది అక్కడే తాగుతున్నారు. ఇబ్బంది పడుతున్నాం. – సురేశ్, ప్రయాణికుడు

✓ ఎంజీబీఎస్ ప్రాంగణంలో సిగరెట్లు విక్రయించినా, వాటిని తాగినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. – శ్రీనివాస్, సీఆర్‌ఎం, ఎంజీబీఎస్

వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంగా జూకు గుర్తింపు


విజేతలకు బహుమతులు అందజేసిన క్యూరేటరు డా.సునీల్ ఎస్.హిరేమత్

చార్మినార్: దేశంలోని తొలి మూడు జంతు ప్రదర్శనశాలల్లో నగర నెహ్రూ జూ పార్కు ఉండడం గర్వకారణమని క్యూరేటర్ డా.సునీల్ ఎస్.హిరేమత్ పేర్కొన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంగా నెహ్రూ జూకు ఎంతో విశిష్టత ఉందన్నారు. ఆదివారం నెహ్రూ జూ పార్కు ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. జూ సిబ్బందికి వివిధ క్రీడా పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. జూలో తాగునీటి శుద్ధి కేంద్రం కోసం రూ.25 లక్షల చెక్కు అందజేసిన సికింద్రాబాద్ బొల్లారంలోని గ్లాండ్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ మేనేజింగ్ ట్రస్టీ కెప్టెన్ రాఘరామన్ క్యూరేటర్ అభినందించారు. ● జూలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఉద్యోగినులు ఆటాపాటలతో సందడి చేశారు. డిప్యూటీ క్యూరేటర్ ఎం.బర్నోబా, డిప్యూటీ డైరెక్టర్(వెటర్నరీ) డా.ఎం.ఎ.హకీం, అసిస్టెంట్ క్యూరేటర్లు బి.లక్ష్మణ్, విష్ణువర్ధన్, అమృత తదితరులు పాల్గొన్నారు.

రహదారి.. మురుగు పారి


లంగర్‌హౌస్ బాపూఘాట్ ఎదురుగా..

గోషామహల్, న్యూస్‌టుడే: పేరుకే అంతర్రాష్ట్ర రహదారి.. ఆ మార్గంలో ప్లైవుడ్, టింబర్, శానిటరీ, హార్డ్‌వేర్, గ్లాస్‌వేర్ హోల్‌సేల్ దుకాణాలు.. వంద అడుగుల దూరంలోనే ఎంఐఎం కేంద్ర కార్యాలయం, అక్కడే దక్కన్ ఇంజినీరింగ్ కళాశాల.. ఒక్కటేమిటి ఈ దారి పొడవునా పేరొందిన సంస్థలు ఉన్నాయి. గోషామహల్-దారుస్సలాం ప్రధాన రహదారిలో మురుగు పారుతూ విపరీతమైన దుర్వాసన నెలకొంది. నడవాలంటే పాదచారులకు కష్టంగా మారింది. నెలల తరబడి సమస్యతో స్థానికులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.
● లంగర్‌హౌస్ బాపూఘాట్ ఎదురుగా ట్రాఫిక్ రద్దీతో ఇబ్బంది ఒకెత్తయితే.. రోడ్డు పక్కన వర్షపు నీరు, మురుగుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


గోషామహల్ - దారుస్సలాంలో...

సంక్షిప్త సమాచారం

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


మహిళకు చీర అందజేస్తున్న జీవేశ్వర యోగీజీ

కార్వాన్, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత నెలకొంటుందని జీవేశ్వర యోగీజీ పేర్కొన్నారు. శివకుండలిని ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం గిర్కపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 2000 మందికి చీరల పంపిణీ చేశారు. యోగీజీ మాట్లాడుతూ.. కార్వాన్ ప్రాచీన, చారిత్రక, పురాతన ఆలయాలకు నిలయమన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించండి

ఐఎస్ సదన్, న్యూస్‌టుడే: మురుగు కాలువ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ జంగం శ్వేత అన్నారు. ఆదివారం ఏపీఎస్‌ఆర్టీసీ కాలనీలో ఆదివారం పనులు పరిశీలించారు. అభివృద్ధిలో కాలనీవాసులు భాగస్వాములు కావాలన్నారు. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. వెంట భాజపా భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్, అజయ్ ఉన్నారు.

వాల్వు ఏర్పాటుతో తాగునీటి సమస్యకు చెక్

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: గౌలిపుర డివిజన్‌లోని ఛత్రినాక ప్రాంతంలో తాగునీటి పైప్‌లైన్ వాల్వు తరచూ మరమ్మతులకు గురికావడంతో కొన్ని నెలలుగా నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఛత్రినాక, వివేకానందనగర్, అంబికానగర్, అచ్చయ్యనగర్, హనుమాన్‌నగర్, దానయ్యనగర్ వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర సమస్యను జలమండలి సీజీఎం, డివిజన్-2బీ జీఎంల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన అధికారులు కొత్త వాల్వ్ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఆదివారం ఛత్రినాక వద్ద తాగునీటి పైపులైన్‌కు 16 డయా వాల్వు ఏర్పాటు చేశారు. పనులను జలమండలి అలియాబాద్ సెక్షన్ మేనేజర్ ముకరం పరిశీలించారు.

సీపీఎం కిషన్‌గంజ్ కార్యదర్శిగా శ్రీరాములు



బేగంబజార్: సీపీఎం కిషన్‌గంజ్, ఫీలాఖానా శాఖ కార్యదర్శిగా నెమ్మది శ్రీరాములు ఎన్నికయ్యారు. కిషన్‌గంజ్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన మహాసభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎల్.కోటయ్య, జిల్లా కమిటీ సభ్యులు కె.జంగయ్య, హన్మంతు, సానప్ప, పి.మోహన్, భీమయ్య, తిరుపతయ్య, పెంటప్ప పాల్గొన్నారు.

సంఘటితంతోనే సమస్యల పరిష్కారం


గుడిమల్కాపూర్‌లో పథ సంచాలన్‌లో సేవకులు

కార్వాన్: హిందువుల సంఘటితంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ సుధీర్‌జీ అన్నారు. దసరాను పురస్కరించుకుని ఆర్‌ఎస్‌ఎస్ గోల్కొండ భాగ్ ఆధ్వర్యంలో ఆదివారం పథ సంచాలన్ నిర్వహించారు. సుధీర్‌జీ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా దాదాపు 35 ప్రధాన సంస్థల ద్వారా సమాజ సేవ, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అమ్మాయిలపై జరుగుతున్న అకృత్యాలు, మారణకాండలు, ఘర్షణలు, మతమార్పిడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. దేశం, ధర్మం, మహిళల పరిరక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందన్నారు. అంతకుముందు గుడిమల్కాపూర్, జాంసింగ్‌దేవాలయం, మెహిదీపట్నం, శివ్‌బాగ్ తదితర ప్రాంతాల్లో వందలాది మంది స్వయం సేవకులు కవాతులో పాల్గొన్నారు. ఆదాయపు పన్నుశాఖ విశ్రాంత కమిషనర్ నరసింహాచార్యులు, డా.వేదప్రకాష్, గంగాధర్‌జీ, కోటం రాజు రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళలు శక్తి స్వరూపిణులు

సుల్తాన్‌బజార్: మహిళలు శక్తిస్వరూపిణులని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర సేవికా సమితి హైదరాబాద్- సికింద్రాబాద్ విభాగ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం 'విజయదశమి ఉత్సవాలు' నిర్వహించారు. జాంబాగ్ రోడ్‌లోని వీవీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులతో పాటు సేవికలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా నాథ్ పీటర్స్ హైజిన్ లిమిటెడ్ సంస్థ ఈడీ అర్చనా మహేశ్వరి హాజరై మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు మహిళా శక్తిని చాటేందుకు రాష్ట్ర సేవికా సమితి కృషి ఎనలేనిదన్నారు. సేవికా సమితి భాగ్యనగర్ విభాగ్ బౌద్ధిక్ సహ ప్రముఖ్ కె.ఉమాదేవి, కార్యవాహిక్ జి.ప్రసన్నలక్ష్మి, సికింద్రాబాద్ విభాగ్ కార్యవాహిక్ బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.


జాంబాగ్.. పథ సంచాలన్‌లో సేవికలు

ఆసుపత్రి ఆవరణ అపరిశుభ్రం



ఉస్మానియా ఆసుపత్రి పాత భవనం సమీపంలోని డాక్టర్స్ క్యాంటీన్ ప్రాంగణం అపరిశుభ్రంగా మారింది. సామగ్రి, చెత్త, ప్లాస్టిక్ డబ్బాలు, వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడే నిల్వ చేస్తున్నారు. అందులో పాములు తిష్ఠ వేస్తున్నాయి. – న్యూస్‌టుడే, ఉస్మానియా ఆసుపత్రి

కాలు పెట్టాలంటే కష్టం



చారిత్రక చార్మినార్‌లో సందర్శకులు ఆదివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దసరా నేపథ్యంలో సెలవులు కావడం, షాపింగ్‌కు రావడంతో పరిసరాలు కిటకిటలాడాయి. రద్దీతో వాహనాలు కదల్లేదు.

వైభవంగా 'మహాకుంభాభిషేక మహోత్సవం'


చండీహోమంలో ఏసీపీ రుద్రభాస్కర్ దంపతులు, భక్తులు

కేశవగిరి, న్యూస్‌టుడే: చాంద్రాయణగుట్టపై కొలువుదీరిన చారిత్రక భ్రమరాంబదేవి సమేత చెన్నమల్లికార్జునస్వామి దేవస్థానంలో 'మహాకుంభాభిషేక మహోత్సవం' వైభవంగా నిర్వహిస్తున్నారు. 35 మంది పండితుల మంత్రోచ్చారణల మధ్య, శాస్త్రోక్తంగా చండీ హోమాలు నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు కోటి హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అలంకరణ, మహాహారతి భక్తిప్రపత్తులతో చేపట్టారు. అన్నదానం చేశారు.

భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యం


సభ్యత్వ నమోదులో భాజపా రాష్ట్ర మాజీ కార్యదర్శి పరమేశ్వరి, వై.కృష్ణ తదితరులు

అబిడ్స్, న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు ప్రతి ఒక్కరూ భాజపా సభ్యత్వం తీసుకోవాలని పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి పరమేశ్వరి అన్నారు. గన్‌ఫౌండ్రిలో డివిజన్ కార్యదర్శి దీపక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం 'సంఘటన్ పర్వ్-సదస్య అభియాన్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించిన అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. నేతలు వై.కృష్ణ, నరహరి, ఎం.కృష్ణ, అజయ్‌సిర్, అజయ్ తుల్షన్, పూనం జైస్వాల్, నితిన్ జైస్వాల్, బబ్లూసింగ్ పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన తప్పనిసరి



అవగాహన సదస్సులో ప్రముఖులు

అబిడ్స్, న్యూస్‌టుడే: పౌరులు ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలని లోకా సమస్త హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపకుడు జీవీ నరసింహులు అన్నారు. అబిడ్స్‌లో మహిళా విభాగం ఛైర్‌పర్సన్ సుశీలకుమారి ఆధ్వర్యంలో మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన పాల్గొని ప్రసంగించారు. పల్లె ప్రవీణ్ ఆధ్వర్యంలో గంగరాజు, వరలక్ష్మి ఆలపించిన జానపద గేయాలు అలరింపజేశాయి. వావ్ అవార్డ్స్ ఫౌండర్ సందీప్, సంస్థ ఆంధ్రప్రదేశ్ సమన్వయకర్త రఘురాము, మోహన్‌రావు, చంద్రప్రభ తదితరులు పాల్గొన్నారు.

మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా



చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: శాలిబండ బేలా ప్రాంతానికి చెందిన పొటేల్ **విఘ్నేష్ యాదవ్**(10) జాతీయ స్థాయిలో జరిగిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటాడు. కర్ణాటక మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 6 వరకు బెంగళూరులో నిర్వహించిన ఫెడరేషన్ ఆఫ్ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఇండియా(ఎఫ్‌ఎంఎంఎఐ) నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో బాలుగు పాల్గొని అండర్-12 జూనియర్ బాలుర విభాగంలో బంగారు పతకం సాధించారు. డిసెంబర్ 6 నుంచి 11 వరకు ఇండోనేషియాలోని జకర్తాలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. తండ్రి పొటేల్ శ్రీనివాస్‌యాదవ్ ప్రోత్సాహంతోనే తాను మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నానని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలనేదే లక్ష్యమని విఘ్నేష్ యాదవ్ చెప్పారు.

శాస్త్రీయ కళలను నవతరానికి పరిచయం చేయాలి


నాట్యగురువులను సత్కరించిన డా.కె.వి.రమణాచారి, చిత్రంలో జి.వసుంధర, సుధామాల

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: భారతీయ శాస్త్రీయ కళలను నవతరానికి పరిచయం చేయడంతో పాటు ప్రోత్సహించాలని ప్రభుత్వ మాజీ సలహాదారు డా.కె.వి.రమణాచారి అన్నారు. ఆదివారం రెడ్‌హిల్స్‌లోని కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో ఇటీవల నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన '49వ జాతీయస్థాయి సంగీత, నృత్య పోటీలను' విజయవంతం చేసిన నాట్యగురువులకు అభినందనసభ, సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్యగురువులు నిష్ఠల సుధామాల, డా.పి.ఇందిరాహేమలను సత్కరించారు. సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర, నాట్యగురువులు మధుమతి కులకర్ణి, వి.వాణీరమణ, ఆచార్య ఏలేశ్వరపు చలపతిశాస్త్రి, డా.ఆచార్య ఫణీంద్ర, విశ్వనాథ్ మద్దిపట్ల, బి.వి.నారాయణరావు, వి.రమాదేవి, ఆర్.ఎస్.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవీ దేవాలయంలో పాము కలకలం



కేశవగిరి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయంలో పాము ప్రత్యక్షమైంది. ఈ ఘటన చాంద్రాయణగుట్టలోని చారిత్రక శ్రీదేవీ దేవాలయంలో శనివారం రాత్రి జరిగింది. గుడిలోని సమాధి మందిరం గదిలో పాము కనిపించడంతో భక్తుడు విషయం అందరికీ చెప్పారు. ఆలయ ప్రధానార్చకులు ప్రమోద్‌కుమార్ కర్వాంకర్, విఠల్ కర్వాంకర్‌లు పాములు పట్టే సలీంకు సమాచారం ఇచ్చారు. ఆయన గుడికి వచ్చి దాన్ని పట్టుకున్నారు. పాము ఆఫ్రికన్ రసెల్ వైపర్ అని సలీం తెలిపారు. అడవిలో వదిలేస్తానని చెప్పారు.

యతి నర్సింహానంద మహారాజ్‌పై చర్యలకు డిమాండ్


గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

గోల్కొండ: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యతి నర్సింహానంద మహారాజ్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం రాత్రి గోల్కొండ కోట నుంచి ఠాణా వరకు స్థానిక ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆల్ ఇండియా ఖీరత్ అకాడమీ అధ్యక్షుడు సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ మాట్లాడుతూ.. మతాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసిన వారిని ఉపేక్షించొద్దన్నారు. అన్నీ మతాలను గౌరవించాలన్నారు. కుతుబ్‌షాహీ ఈద్గా అధ్యక్షుడు గులాం మొయినుద్దీన్ పాషా, షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి నిజాం పాలకుల కృషి


పురానీహవేలీలో ప్రిన్సెస్ అస్రా తదితరులు

చార్మినార్, న్యూస్‌టుడే: దక్కన్ హైదరాబాద్‌లో నిజాం పాలకులు విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని 8వ నిజాం నవాబ్ మీర్ బర్కత్‌అలీఖాన్ ముక్రమ్ జాహ బహదూర్ సతీమణి ప్రిన్సెస్ అస్రా పేర్కొన్నారు. ఆదివారం పురానీహవేలీ మస్రత్‌మహల్‌లోని ముక్రమ్ జాహ పాఠశాల వ్యవస్థాపక దినోత్సవం, ముక్రమ్ జాహ బహదూర్ జయంతిలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సెస్ అస్రా మాట్లాడుతూ.. పురానీహవేలీలోని ఎనమిది ప్యాలెస్‌లతో కూడిన మస్రత్‌మహల్‌ను పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లల విద్యకు కేటాయించడం నిజాం దాతృత్వానికి నిదర్శనమన్నారు. ముక్రమ్ జాహ పాఠశాలకు దేశంలో ఉత్తమ గుర్తింపు ఉందనారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టర్కియే కౌన్సిల్ జనరల్ ఓర్హాన్ యల్మాన్ ఓకాన్, గౌరవ కౌన్సిల్ జర్మనీ అమితాదేశాయి, ముక్రమ్ జాహ పాఠశాల ప్రిన్సిపల్ రేఖావాదే, నిజాం ట్రస్టీ నవాబ్ అబుల్ ఫైజ్‌ఖాన్, నవాబ్ ఫైజ్ బిన్ జంగ్ తదితరులు ముక్రమ్ జాహకు నివాళులర్పించారు.

సన్మానం



బిహార్ మాజీ మంత్రి తేజ్ ప్రతాప్‌యాదవ్ నగరానికొచ్చిన సందర్భంగా రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్ తదితరులు సన్మానించారు. – న్యూస్‌టుడే, అబిడ్స్

అక్రమంగా బాణసంచా నిల్వ

చార్మినార్: మీర్‌చౌక్ ఠాణా పరిధి అలీజాకోట్లలో అక్రమంగా బాణసంచా నిల్వ చేసిన దుకాణంపై టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడి చేశారు. రూ.1.50 లక్షల విలువ చేసే బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు అదనపు డీసీపీ అందె శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌చౌక్ అలీజాకోట్లకు చెందిన వ్యాపారి శివకుమార్ గోయల్(45) అక్రమంగా తన దుకాణంలో ప్రమాదకరమైన టపాసులు నిల్వ చేసి విక్రయిస్తున్నాడు.

రాజేంద్రనగర్

• రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

స్థానికుల చొరవ.. రహదారికి మరమ్మతులు



రోడ్డుపై గుంతలు పూడుస్తూ..

మణికొండ: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. మణికొండ పైప్‌లైన్ రోడ్డులో సుందర గార్డెన్స్ ప్రాంతంలోని రహదారి గోతులుగా మారడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో స్థానికులే పలువురు భారాస నాయకులతో కలిసి సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. సొంత ఖర్చులతో ఆదివారం రహదారికి మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన వారిని స్థానికులు, వాహనదారులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

చిన్నప్పటి నుంచే ఇతిహాసాలు చదివించాలి



ప్రవచిస్తున్న భాస్కర యోగి

చేవెళ్ల, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలను చదివించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డా.భాస్కరయోగి సూచించారు. హిందూ ధార్మిక సమితి చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీమద్రామాయణ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 10 వరకు జరగనున్న ప్రవచనాన్ని బాల రామాయణంతో ప్రారంభించారు. ప్రపంచ దేశాలన్నింటిలో భారత చరిత్ర ఎంతో ప్రాచీనమైనదన్నారు. అనేక దేశాల చరిత్రలు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ భారత చరిత్ర మాత్రం ఇప్పటికీ వర్ధిల్లుతుందంటే ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి



షాబాద్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా షాబాద్ మండలం అప్పారెడ్డిగూడకు చెందిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పార్టీకి చేసిన సేవలు గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న నాయకులు, భక్తులు

కేశంపేట, న్యూస్‌టుడే: కేశంపేట మండల పరిధిలోని సంగెంలో ఆదివారం పురోహితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య వనం కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు తాండ్ర విశాల, ఇబ్రహీం, శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్య, వినయ్‌కుమార్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, వీరారెడ్డి, మధు, లింగమయ్య, మహేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వైరం.. ప్రారంభానికి వీడని గ్రహణం

● బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ పరిధిలో వింత పరిస్థితులు ● రూ.12 కోట్లతో కార్యాలయ భవన నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాది

'రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. భారాస ప్రతిపక్షంలో ఉంది.. కానీ బండ్లగూడజాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మాత్రం 'రాజకీయం' మారడం లేదు. భారాస అధికారంలో ఉన్నప్పటి పరిస్థితులే ఇంకా కొనసాగుతున్నాయి. దీంతో ఇక్కడ పలు అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కార్పొరేషన్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రావడం లేదు. ఇప్పటివరకు ఇక్కడ జరిగిన, చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు కార్పొరేషన్ నిధులనే వెచ్చించారు. కార్పొరేషన్ కార్యాలయానికి పక్కా భవనం నిర్మాణం పూర్తయి పది మాసాలు గడుస్తున్నా.. ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. దీని వెనుక పెద్ద కథే నడుస్తోందన్న ప్రచారం జరుగుతోంది'.

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: గండిపేట మండలం బండ్లగూడజాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాజకీయ గ్రహణం వీడటం లేదు. అప్పటి మేయర్ బి.మహేందర్‌గౌడ్ ఏకపక్ష నిర్ణయాలు, కార్పొరేటర్లతో సఖ్యత కొరవడటంతో.. వైరివర్గం ఏర్పడిన 16మంది ఆయనపై అవిశ్వాసం ప్రకటించి పదవీచ్యుతుడిని చేశారు. కొత్తగా మద్దెల లత మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆమె బాధ్యతలు చేపట్టి అయిదు మాసాలు కావస్తోంది. ఇంతలో ఆమెకు మద్దతుగా నిలిచిన కార్పొరేటర్లు వైరివర్గంగా ఏర్పడ్డారు. గత నెలలో కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాన్ని రెండు సార్లు ఏర్పాటు చేయగా.. మెజారిటీ సభ్యులు దాన్ని బహిష్కరించారు. దీంతో మేయర్, కార్పొరేటర్ల మధ్య దూరం పెరిగిందనే ప్రచారానికి బలం చేకూరింది. దీనికితోడు ప్రస్తుత మేయర్ ఎం.లత, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ల మధ్య ఇప్పటికీ వైరం కొనసాగుతూనే ఉంది. తనని కాదని మేయర్‌గా ఎన్నికవడంతో ఎమ్మెల్యే వారిపై గుర్రుగా ఉన్నారు. వీరి మధ్య ఉన్న రాజకీయ విభేదాల కారణంగా అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడుతోంది. కిస్మత్‌పూర్‌లో రెండెకరాల స్థలంలో కార్పొరేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్పొరేషన్ నిధుల రూ.12కోట్లతో పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయగా.. పది మాసాలుగా ప్రారంభోత్సవ తేదీని ఖరారు చేయకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారన్న ప్రచారం నెలకొంది.



కిస్మత్‌పూర్‌లో ప్రారంభానికి సిద్ధంగా కార్యాలయ భవనం

సీఎం సమయం కోసం..

కార్పొరేషన్ కార్యాలయ భవన ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని నిర్ణయించారు. వాస్తవానికి సీఎం పేరుతో ప్రారంభోత్సవానికి కావాలనే కాలయాపన చేస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి. ఎమ్మెల్యేతో మేయర్‌కు పొసగకపోవడం, మరో మూడు నెలల్లో కార్పొరేటర్లు, మేయర్ పదవీకాలం ముగియనుండటంతో ఇప్పటి వరకు కార్యాలయ భవన ప్రారంభాన్ని వాయిదా వేయాలని ప్రయత్నిస్తున్నట్లు అనుమానాలున్నాయి. నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్ పురపాలిక నూతన భవనానికి దీని తర్వాత శంకుస్థాపన చేసి పది నెలల్లోనే పూర్తిచేసి శనివారం అందుబాటులోకి తెచ్చారు. కానీ బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి మాత్రం తేదీని నిర్ణయించకపోవడం గమనార్హం. ఈ విషయమై కమిషనర్ బి.శరత్‌చంద్రను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. సీఎం సమయం కోసం వేచి చూస్తున్నట్లు తెలిపారు. నూతన భవన ప్రారంభోత్సవంతో పాటు కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రత్యేకంగా నిధుల మంజూరు కోసం సీఎంను కోరాలనే తలంపుతోనే కొంత కాలయాపన జరుగుతోందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్: 8008573330
శంకర్‌పల్లి : 8008573266
షాద్‌నగర్: 8008573907
శంషాబాద్: 9963096353

నార్సింగి, రాజేంద్రనగర్, న్యూస్‌టుడే

? నార్సింగి బృందావన్ కాలనీ పెట్రోల్‌బంకు వెనకాల ఖాళీ ప్లాట్ల మధ్య నివాస భవనానికి సంబంధించి డ్రైనేజీ పొంగి పారుతోంది. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. –శివశంకర్

✓ సిబ్బందిని పంపించి పరిశీలిస్తాం. అవసరమైతే కొత్తగా డ్రైనేజీ పైపు లైన్ వేయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –శ్రీనివాస్, ఏఈ, నార్సింగి పురపాలక సంఘం

? బుద్వేల్ గ్రీన్‌సిటీకాలనీలో రహదారుల నిర్మాణం చేపట్టడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. –నరేష్, గ్రీన్‌సిటీకాలనీ

✓ బుద్వేల్ గ్రీన్‌సిటీలో రహదారుల నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరయ్యాయి. మరికొన్నింటికి ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన పనులు చేయించడానికి గుత్తేదారులతో చర్చిస్తాం. –నాగేందర్‌గౌడ్, డీఈ, రాజేంద్రనగర్ సర్కిల్

విద్యాభివృద్ధికి కృషి చేయాలి: ఎమ్మెల్యే



డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఎస్జీటీ ఫలితాల్లో జిల్లా ఏడో ర్యాంక్ సాధించిన జిల్లేడు చౌదరిగూడ మండలం జాకారానికి చెందిన వెంకటేష్, స్కూల్ అసిస్టెంట్ బయాలజికల్ సైన్స్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించిన శ్రీనివాసులును షాద్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, కమ్మరి నర్సింహులు, సి.ఆనంద్, రాఘవేందర్, మహేష్, యాదయ్యగౌడ్, నరేందర్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించిన ఆరెస్సెస్ పథసంచాలన్



షాద్‌నగర్ పురవీధుల్లో పథసంచాలన్ నిర్వహిస్తున్న సంఘ్ సేవకులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా షాద్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన స్వర్ణోత్సవ పథసంచాలన్ పురవాసుల్లో దేశభక్తిని పెంపొందించింది. పట్టణంలోని సరస్వతి శిశుమందిరం నుంచి ప్రారంభమైన పథసంచాలన్ పురవీధుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా వీధులు, రహదారుల మీదుగా కవాతు చేస్తున్న సంఘ్ సేవకులపై పలువురు వ్యాపారులు, కాలనీవాసులు పూలవర్షం కురిపించారు. దాదాపు 500మందికిపైగా సేవక్‌లు లయబద్ధంగా సంచాలన్ చేటపట్టడం చూపరులను ఆకట్టుకుంది. డాక్టర్ కేశవ బలరాం హెడ్గేవార్ ఆశయాలను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారు. విపత్తులు, యుద్ధాలు లెక్కచేయకుండా ప్రజాసంక్షేమం, సమాజసేవలో నిరంతరం పాల్పంచుకునే స్వయంసేవకుల నిస్వార్థ సేవలను కొనియాడారు.

ఏనాటికైనా ధర్మమే విజయం సాధిస్తుంది

శంషాబాద్: అధర్మంపై ఏనాటికైనా ధర్మమే విజయం సాధిస్తుందని ఆరెస్సెస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచార ప్రముఖ్ నడింపల్లి ఆయూష్ అన్నారు. ఆరెస్సెస్ మహేశ్వరం బాగ్ సంఘ చాలక్ మల్‌రెడ్డి బలవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం శంషాబాద్‌లో నిర్వహించిన విజయ దశమి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఏకరూప దుస్తులు ధరించి చేతిలో కర్రలు పట్టుకుని వందల సంఖ్యలో ఆరెస్సెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్బీనగర్ మైదానంలో అమృత వచనం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో దేవిరెడ్డి రఘునాథ్ రెడ్డి, గుండమోని నరేందర్, వర్కాల కృష్ణ, కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొండుపల్లిలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న శంషాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుష్మారెడ్డి తదితరులు

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ మున్సిపల్ పరిధి తొండుపల్లిలో జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని శంషాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుష్మారెడ్డి ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు తొండుపల్లి, ఊటుపల్లి, కిషన్‌గూడ ప్రాంతాలకు చెందిన స్థానిక నాయకులతో కలిసి ఆమె ఆదివారం ప్రకాష్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల తొండుపల్లిలో నిర్మించిన పైవంతెనను బస్టాప్ వద్ద ల్యాండింగ్ చేయడంతో వాహనాలు వేగంగావస్తున్నాయని, అక్కడ రహదారి దాటుతున్నవారికి ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోకముందే బస్టాప్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని ప్రకాష్‌గౌడ్ వారికి హామీ ఇచ్చారు.

క్యాండ్యూట్ కాలువ చుట్టూ డ్రైనేజీ పైపులా?

వర్షం నీరు వెళ్లే పైపులైన్ పనులను అడ్డుకున్న జలమండలి అధికారులు



కోకాపేటలో క్యాండ్యూట్ కాలువ సమీపంలో చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ పనులు

నార్సింగి, న్యూస్‌టుడే: తాగు నీటిని సరఫరా చేసే క్యాండ్యూట్ కాలువ సమీపంలో మున్సిపల్ అధికారులు చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి అధికారులు అడ్డుకున్నారు. ఉస్మాన్‌సాగర్ జలాశయం నుంచి నగరానికి శుద్ధి చేయని నీటిని తరలించే క్యాండ్యూట్ కాలువకు గొప్ప చరిత్ర ఉంది. దాదాపు చెరువు నిర్మించిన కాలంలోనే ఈ కాలువ ఏర్పాటు చేశారు. చారిత్రక సంపదగా గుర్తించి పరిరక్షించాల్సిన ఈ క్యాండ్యూట్ కాలువ కొన్ని సంవత్సరాలుగా అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కోకాపేట పరిధిలోని ఈ కాలువ లీకేజీలతో నిత్యం వేలాది లీటర్ల నీరు రోడ్డుపాలవుతున్న పరిస్థితి స్థానికులను ఆవేదనకు గురిచేస్తోంది. దీనికితోడు ఇటీవల కాలువ వెంబడి వర్షం నీరు వెళ్లేందుకు డ్రైనేజీ పైపులైన్ వేస్తుండటం విస్మయానికి గురిచేస్తోంది. ఈ విషయమై జలమండలి డీజీఎం నరహరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన మేనేజర్‌ను పంపించి పనులను నిలిపివేయించారు. ఎలాంటి అనుమతులు, సమాచారం లేకుండా తమ ఆధీనంలోని క్యాండ్యూట్ కాలువ బఫర్ స్థలంలో ఎలా పనులు చేస్తారని డీజీఎం నరహరి అభ్యంతరం చెప్పారు. జలమండలి అధికారులు గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ వరకున్న క్యాండ్యూట్ కాలువ పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, క్యాండ్యూట్ కాలువ, బఫర్ స్థలాన్ని పరిరక్షించేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో విజయదశమి వేడుకలు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకొని షాద్‌నగర్‌లో నిర్వహించే విజయదశమి వేడుకలు, శమీపూజను వేంకటేశ్వరస్వామి దేవాలయంలో చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్ తెలిపారు. ఇందుకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని ఆదివారం స్థానిక పతంజలి యోగా కేంద్రంలో ఏర్పాటు చేశారు. దీనికి ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, పురపాలిక ఛైర్మన్ కొందూటి నరేందర్, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, విష్ణు వర్ధన్‌రెడ్డితోపాటు పలువురు హాజరై పలు తీర్మానాలు చేశారు. గతంలో పాలశీతలీకరణ కేంద్రంలో నిర్వహించే ఉత్సవాలను ఈ ఏడాది జానంపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. 12న పట్టణంలోని శివమారుతి దేవాలయం నుంచి శోభాయాత్ర చేపట్టి సాయంత్రం 4 గంటలకు వేంకటేశ్వర ఆలయానికి చేరుకుంటుందన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



చేవెళ్లలో వేంకటేశ్వర స్వామివారి ఊరేగింపు

చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని హంస వాహనంపై ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు



పద్మశ్రీహిల్స్‌లోని పోచమ్మ దేవాలయంలో లలితాత్రిపుర సుందరిగా



షాద్‌నగర్ రైతు కాలనీలోని కట్టమైసమ్మ దేవాలయంలో వారాహి దేవిగా అమ్మవారు



షాద్‌నగర్‌లోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అన్నపూర్ణాదేవిగా



అత్తాపూర్‌లో అమ్మవారి పూజలో ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రామిరెడ్డి, అమరేందర్ తదితరులు



కిస్మత్‌పూర్‌లో నిర్వహించిన దుర్గామాత పూజలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్, బండ్లగూడజాగీర్, షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజైన ఆదివారం అమ్మవారు లలితాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. దేవాలయాలు, పలు చోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గమ్మ వివిధ రూపాల్లోనూ దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బండ్లగూడజాగీర్ నగరపాలిక పరిధిలోని కిస్మత్‌పూర్ దుర్గామాత ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత వద్ద పూజలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ గోకరి శ్రీలతాసురేష్‌గౌడ్ పాల్గొన్నారు. అత్తాపూర్ పాండురంగానగర్ శివాజీయూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విగ్రహాన్ని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రామిరెడ్డి సందర్శించారు. షాద్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎలికట్ట భవానీమాత దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తెలంగాణ ప్రజా ఫ్రంట్ సదస్సును విజయవంతం చేద్దాం

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రజా ఫ్రంట్ 15వ వార్షికోత్సవ సదస్సును సోమవారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు టీపీఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అర్జునప్ప తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ సుధాకర్, పాలమూరు అధ్యయన వేదిక రంగారెడ్డి జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్, టీజీ శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓడినా గెలిచినా క్రీడాస్ఫూర్తి చాటాలి

కొందుర్గు, న్యూస్‌టుడే: గ్రామీణ స్థాయిలో నిర్వహించే క్రీడాపోటీలు క్రీడాకారులకు ఉపయుక్తంగా ఉంటాయని మాజీ వైస్‌ఎంపీపీ రాజేశ్ పటేల్, రామకృష్ణ, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తంగెళ్లపల్లిలో ప్రీమియర్ లీగ్ 08 క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. పోటీల్లో గెలిచినా, ఓడినా క్రీడాస్ఫూర్తి అలవరుచుకోవాలని సూచించారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు



హిందును సన్మానిస్తున్న ప్రభాకర్ తదితరులు

చేవెళ్ల, న్యూస్‌టుడే: చదువుకు పేదరికం అడ్డుకాదని దళితరత్న అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్ అన్నారు. చేవెళ్ల గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు కందాడ సాయన్న కుమార్తె హిందు కాళోజీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ఉచిత సీట్ సాధించడంతో చేవెళ్ల అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని సత్కరించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. పట్టుదలతో చదివితే విజయం దక్కుతుందనడానికి హిందు సాధించిన విజయం నిదర్శనమన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బ్యాగరి రాములు, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా గుంతలమయం.. రాకపోకలు ఆగమాగం



అప్పారెడ్డిగూడ శివారులో వాహనదారుల కష్టాలు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ మండలంలోని పాత జాతీయ రహదారి నుంచి వీర్లపల్లి వరకున్న రహదారి గుంతలమయంగా మారడంతో అటుగా రాకపోకలు సాగించే మామిడిపల్లి, శ్రీనివాసులగూడ, మంచన్‌పహాడ్, మొదళ్లగూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వీర్లపల్లి శివారులో శివశక్తి స్పాంజ్, ఐరన్ పరిశ్రమలకు నిత్యం వచ్చే భారీ వాహనాల కారణంగా రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. అసలే ఒకవరస రహదారి. దీనికి తోడు రోడ్డుపై గోతులు. దీంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం పరిశ్రమకు వచ్చే లారీ, సింబియాసిస్ యూనివర్సిటీకి వచ్చే బస్సు ఎదురుపడటంతో గుంతల్లో దిగబడ్డాయి. దీనివల్ల కొంత సమయం రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతోనే ఈ సమస్య ఏర్పడిందని, ఇప్పటికైనా స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

విజ్ఞానం తలుపులు తెరిచేదెప్పుడు?



కొత్తూరు శాఖా గ్రంథాలయ భవనాన్ని సుమారు రూ.75 లక్షలతో పునర్నిర్మించారు. బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు తాళం వేసి 10 నెలలు అవుతోంది. స్థలం లేక పుస్తకాలు, ఫర్నిచర్‌ను హైదరాబాద్ బడంగ్‌పేటలోని గ్రంథాలయంలో ఉంచాల్సి వచ్చింది. ప్రభుత్వం ఇటీవల పోటీ పరీక్షలకు ప్రకటనలు విడుదల చేస్తుండటంతో నిరుద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

–న్యూస్‌టుడే, కొత్తూరు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



కాటేదాన్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మైలార్‌దేవుపల్లి ఠాణా పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్‌కు చెందిన **రాజు(40)** జీవనోపాధి కోసం కొంతకాలం క్రితం కుటుంబంతో వలస వచ్చి అత్తాపూర్‌లో నివసిస్తున్నాడు. గృహనిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న ఆయన తోటి కార్మికుడు రమేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై తెల్లవారుజామున చాంద్రాయణగుట్టకు బయల్దేరాడు. దుర్గానగర్ సమీపంలోకి చేరుకోగానే వీరి వాహనాన్ని వెనకనుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ చక్రాల కింద పడ్డ రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

మూడేళ్ల చిన్నారిపై వీధి కుక్క దాడి



శంషాబాద్, న్యూస్‌టుడే: ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై ఓ వీధి కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన శంషాబాద్ మండల పరిధిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఘాన్సిమియాగూడకు చెందిన నీరటి రాజు-అపర్ణ దంపతులు రోజువారీ కూలీలు. వీరికి అక్షిత(3) ఒక్కగానొక్క కుమార్తె. ఎప్పటిలా ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై తల్లిదండ్రులు చూస్తుండగానే ఓ వీధి కుక్క దాడి చేసింది. తల్లిదండ్రులు గుర్తించి కేకలు వేయడంతో వదిలేసి పరారైంది. తీవ్రంగా గాయపడిన అక్షితను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ఉన్నతాధికారులు స్పందించి వీధి శునకాలను పట్టుకొని దూరప్రాంతాలకు తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

శంషాబాద్, మొయినాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్, మొయినాబాద్ మండలాల్లో వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం కావడంపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆర్జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. గగన్‌పహాడ్‌కు చెందిన ప్రభాకర్ రోజువారీ కార్మికుడు. ఎప్పటిలా ఈ నెల 1న పనుల కోసం బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికిరాలేదు. అలాగే శంషాబాద్‌కు చెందిన యువతి(21) ఈ నెల 4న ఉదయం దేవాలయానికి వెళ్లి ఇంటికి రాలేదు. తెలిసిన వారిని, బంధువులను విచారించినా వారి ఆచూకీదొరకలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొయినాబాద్ మండలంలోని ఓగ్రామానికి చెందిన మహిళ(21) మండలకేంద్రంలోని ఓహోటల్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తోంది. శనివారం ఉదయం విధులకు వెళ్లిన ఆమె సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో భర్త హోటల్‌కు వెళ్లి విచారించారు. అప్పటికే ఆమె బంధువుల వద్దకు వెళుతున్నట్లు చెప్పి వెళ్లిందని హోటల్ యజమాని తెలిపారు. బంధువులు, ఇతరత్రా ప్రదేశాల్లో వెతికినా ఆమె జాడ కనిపించకపోవడంతో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

రెడ్డి జేఏసీ సన్మాన సభకు తరలిన నాయకులు

కొందుర్గు: హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రెడ్డి నేతల సన్మాన కార్యక్రమానికి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పలువురు బయల్దేరి వెళ్లారు. వీరిలో బల్వంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, శివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జంగారెడ్డి బుచ్చిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి ఉన్నారు.

దుర్వాసన నుంచి గ్రామస్థులను రక్షించండి

షాద్‌నగర్ న్యూటౌన్: సోలీపూర్ గ్రామస్థులను గ్రామశివారులో ఉన్న డంప్‌యార్డు నుంచి వచ్చే దుర్వాసన నుంచి రక్షించాలని తెఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య ఓ ప్రకటనలో కోరారు. దాబాలు, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను డంప్‌యార్డులో పారబోయడం, రసాయనాలు చల్లడం, జేసీబీలతో వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే క్రమం తదితర సమయాల్లో విపరీతంగా విషవాయువులు వస్తుండడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

వడ్డెర సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వడ్డెర సంఘం నాయకులు

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: వడ్డెర వృత్తిదార్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ వడ్డెర సంఘం అధ్యక్షుడు నర్ర పాండు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్ షేర్‌రెడ్డి కోశయ్య, ఐలయ్య, వడ్డెర సంఘం సభ్యులు నవీన్‌సాగర్, నర్ర శ్రీధర్, వాసు, వేముల శంకర్, సాయిలు పాల్గొన్నారు.

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

రావిర్యాల ప్రజలకు రుణపడి ఉంటా



రావిర్యాలలో భాజపా నేత అందెల శ్రీరాములుయాదవ్

మహేశ్వరం: తుక్కుగూడ రావిర్యాలలో స్థానిక కౌన్సిలర్ శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నియోజకవర్గ భాజపా బాధ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ హాజరయ్యారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో భాజపా సంపూర్ణమైన మెజార్టీ ఇచ్చినందుకు రావిర్యాల ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రచ్చలక్ష్మణ్, కృష్ణగౌడ్, లింగంరాజ్‌కుమార్, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డిజిటల్ కార్డులు

మహేశ్వరం: భవిష్యత్తులో తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ కార్డులు అందిస్తుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్న అధికారులతో కేఎల్‌ఆర్ మాట్లాడారు. డిజిటల్ కార్డులతో అందరికీ మేలు జరుగుతుందన్నారు.

నాగన్‌పల్లిలో శ్రమదానం



ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం నుంచి నాగన్‌పల్లి మార్గంలో ఆదివారం మూడవ బెటాలియన్ కమాండెంట్ జమీల్‌పాషా, ఏసీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న పోలీసులు శ్రమదానం చేశారు. నాగన్‌పల్లిలో పిచ్చి మొక్కలు తొలగించారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తుల అందజేత

మంచాల, న్యూస్‌టుడే: నోముల గ్రామ పంచాయతీ సిబ్బందికి మాజీ సర్పంచి భారస నాయకులు డి.రవి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వర్షిణి, జయనందం, ముత్తయ్య, బల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బాలయ్య

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బోళ్ల బాలయ్యను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా బి.శ్రీరాములు, కె.రాములు, కోశాధికారిగా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసనను జయప్రదం చేయండి

తలకొండపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న శంషాబాద్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ నిరసనను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కిరణ్‌పూలె మాదిగ ఆదివారం తెలిపారు. వర్గీకరణను ప్రభుత్వం అమలు చేసే వరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, ఎంఎస్‌పీ సంఘాలు ఆందోళన చేస్తాయని ఆయన అన్నారు.

దసరా రోజుల్లోనూ దుర్గంధమేనా?

అసంపూర్తి పనులతో అవస్థలు

బాలాపూర్, న్యూస్‌టుడే: పండగ వస్తే అందరూ ఇళ్లు, పరిసరాలు శుభ్రం చేసుకుంటారు. తెలంగాణలో దసరా, బతుకమ్మ ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. బడంగ్‌పేటలో కొన్ని కాలనీల్లో రహదారులపై మురుగు పారుతోంది. ఈ సమస్య వారిని పండగ ఆనందాన్ని ఆస్వాదించకుండా చేస్తోంది. నేతలు, అధికారులు సమస్యలు పరిష్కరించకపోయినా పర్వాలేదు.. కానీ, కొత్తవి సృష్టించి బడంగ్‌పేట కార్పొరేషన్ ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేయడం దారుణం. ఔట్‌లెట్ సమస్యతో సతమతమవుతున్న వీరికి.. అసంపూర్తి పనులు మరిన్ని ఇక్కట్లు తెచ్చిపెడుతున్నాయి. ఇళ్ల చుట్టూ అంతా మురుగుచేరింది. దీంతో కాలనీవాసులు అనారోగ్యాలకు గురవుతున్నారు. తమ గోడును అధికారులకు విన్నవించినా కాలయాపన చేస్తున్నారే కానీ పరిష్కారం చూపట్లేదని సీతారామ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సీతారామకాలనీలో ఇళ్ల మధ్య ఇలా..

పూర్తి చేయడానికి ఎన్నాళ్లు?.. బడంగ్‌పేట కార్పొరేషన్ 30వ డివిజన్‌లో సీతారామ కాలనీని కొన్నిరోజులుగా మురుగు సమస్య వెంటాడుతోంది. సుమారు 60 ఇళ్లల్లో సుమారు 300 మంది జనాభా మురుగు సమస్యతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. నాలుగు నెలల క్రితం పీఎంఆర్ గార్డెన్ దగ్గర స్థలం సమస్యతో ఔట్‌లెట్ నుంచి వెళ్లే మురుగునీరు పూర్తిగా నిలిచిపోయింది. ఇది ప్రధాన సమస్యగా ఉంది. కాలనీలో ఉన్న మురుగునీరు ఖాళీగా ఉన్న స్థలంలోకి చేరుతోంది. అక్కడే ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి చేరుతోంది. ఎగువున ఉన్న రోమాఎన్‌క్లేవ్ 1, 2, 3, సుమా ప్యారడైజ్, వెంకటాద్రి, ఎంసీఆర్ కాలనీల మురుగునీరు.. కిందకు వెళ్లేందుకు అధికారులు సీతారామ కాలనీ మీదుగా మరో పెద్ద లైన్ వేయడానికి నిర్ణయించారు. రెండున్నర నెలల క్రితం పైప్‌లైన్ పనులు చేపట్టారు. దీంతో ప్రస్తుతం ఉన్న పైపులైన్ పూర్తిగా ధ్వంసమైంది. మురుగు అంతా ఇళ్ల పక్కనే ఉన్న ఖాళీ స్థలాలు, రహదారులపై వచ్చి చేరుతోంది.



పొంగుతున్న మ్యాన్‌హోల్



అసంపూర్తి పనులు

రోగాలబారిన జనం..

చేపట్టిన పనిని పూర్తి చేయకుండా వదిలేయడంతో రహదారులపైనే మురుగునీరు నిలిచిపోతోంది. ప్రయాణికులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. దుర్వాసనతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. కాలనీ వాసి రాములు గౌడ్ ఇంట్లో ఉన్న ఇద్దరు చిన్నారులతో పాటు మరో నలుగురు వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. యాదగిరి యాదవ్ కుటుంబంలో నలుగురు ఆసుపత్రిలోనే ఉన్నారు. గౌతం కుటుంబంలోని ఇద్దరు జ్వరాలతో బాధపడుతున్నారని కాలనీ అధ్యక్షుడు జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ తెలిపారు. కొత్త లైన్ పేరుతో అధికారులు కొత్త సమస్య తెచ్చారని వారు వాపోతున్నారు.

నిధులు రావాల్సి ఉంది..

–యాదయ్య, డీఈ, బడంగ్‌పేట

నిధులు ఉన్న వరకు పనులు పూర్తి చేశాం. నిధులు వచ్చిన వెంటనే మిగిలిన పనులు చేపడతాం. మురుగుకు తాత్కాలిక పరిష్కారం చూపించి కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే:

? యాచారం బస్టాండ్ గుంతల మయంగా మారింది. వెంటనే మరమ్మతులు చేయాలి. **– వేణుగోపాల్, యాచారం**

✓ సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే పనులు చేయిస్తాం. **– వెంకట నరసప్ప, డీఎం ఇబ్రహీంపట్నం**

? 15 రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావట్లేదు. **– వెంకటేశ్వర కాలని, ఆరుట్ల**

✓ పైపులైన్ మరమ్మతులతో కొంత ఇబ్బంది జరిగింది. ఇకపై సక్రమంగా అందిస్తాం. **– బాలశంకర్, ఎంపీడీఓ మంచాల**

? 15 రోజుల నుంచి తాగునీరు సక్రమంగా రావట్లేదు. **–వెంకటేశ్వర కాలనీ, ఆరుట్ల**

✓ పైపులైన్ మరమ్మతులకు గురైంది. పనులు పూర్తి చేశాం. ఇక నుంచి సక్రమంగా అందిస్తాం. **–బాలశంకర్, ఎంపీడీఓ మంచాల**

? టెలిఫోన్ కాలనీలో పాదబాటపై వ్యర్థాలు పేరుకుపోయాయి. **–శ్రావ్య, టెలిఫోన్ కాలనీ**

✓ వెంటనే సమస్య పరిష్కరిస్తాం. **– సుజాత, సరూర్‌నగర్ డీసీ**

? ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పైపులు వేయడానికి రోడ్డు తవ్వి వదిలేశారు. గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **–గుంటి బాబు, ఇబ్రహీంపట్నం**

✓ వెంటనే పనులు పూర్తి చేయిస్తాం. **– రవీంద్రసాగర్, కమిషనర్, ఇబ్రహీంపట్నం**

మరమ్మతు పనులు ప్రారంభం

స్పందనకు వందనం

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి నుంచి మిడ్జిల్ వరకు ఉన్న రహదారిపై ఉన్న అసంపూర్తి పనులకు శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేశారు. గత నెల 30న ఈనాడులో ప్రచురితమైన 'జారుతారు.. జాగ్రత్త' కథనానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ ఏఈ రవితేజ గుత్తేదారులతో రహదారిపై అసంపూర్తిగా ఉన్న వంతెనలను, బీటీ నిర్మాణ పనులు పరిశీలించారు. రహదారిపై పేరుకుపోయిన బురద, నీళ్లను గుత్తేదారులు తొలగించి, మరమ్మతు పనులు చేస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంబాజీ, అజీజ్, రవీందర్, నర్సింహులు పాల్గొన్నారు.

పరిశీలించారు.. పరిష్కరించారు



మహేశ్వరం, న్యూస్‌టుడే: మహేశ్వరం మండలం అమీర్‌పేటలో మిషన్‌భగీరథ పైపులైన్ మరమ్మతులు చేసిన తర్వాత గుంతను మట్టితో పూడ్చడంతో వర్షం నీటికి రోడ్డుపై వెళ్లిన వాహనాలు అందులో దిగబడ్డాయి. ఇబ్బందులను న్యూస్‌టుడే మిషన్‌భగీరథ ఏఈ కార్తీక్ దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులు చేయించారు.

దోమల బెడదకు ఫాగింగ్

ఆర్కేపురం: ఆర్కేపురంలోని టెలిఫోన్ కాలనీలో దోమల బెడద ఎక్కువ ఉందని మేమున్నాం మీకు తోడుగా శీర్షికన గురువారం 'ఈనాడులో' ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఫాగింగ్ చేపట్టారు.

మాడ్గుల విజయ డెయిరీకి నిధులు మంజూరు



హైదరాబాద్‌లో సాయిరెడ్డికి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మాడ్గుల, న్యూస్‌టుడే: మాడ్గుల మండలంలోని విజయ డెయిరీకి రూ.30.30 లక్షలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లో ఆదివారం సంబంధిత పత్రాన్ని విజయ డెయిరీ ఛైర్మన్ సాయిరెడ్డికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాడ్గుల మాజీ సర్పంచి కొండల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కడ్తాల్‌లో తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

కడ్తాల (ఆమనగల్లు), న్యూస్‌టుడే: కడ్తాల్ మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. 2016లో కడ్తాల్ గ్రామం మండల కేంద్రంగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా కడ్తాల్ తహసీల్దార్ కార్యాలయానికి కొత్త భవనం నిర్మించారు. సోమవారం మధ్యాహ్నం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దీనిని ప్రారంభించనున్నారు. ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు పాల్గొన్నారు.

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం కల్వకుర్తి నియోజకవర్గంలో మంత్రి మొత్తం రూ.43.42 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించనుండటంతో పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలి రావాలన్నారు. వెల్దండ మండల కేంద్రంలో గురుకుల విద్యాలయం అదనపు గదులు ప్రారంభోత్సవంతో పాటు నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారన్నారు. కల్వకుర్తి పట్టణంలో కేజీబీవీ కళాశాల భవనానికి భూమిపూజ, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, సీసీ దారుల నిర్మాణానికి భూమిపూజ, మినీస్టేడియంలో రూ.1.30 కోట్లతో మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి



షాబాద్: రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా షాబాద్ మండలం ఆస్పల్లిగూడకు చెందిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పార్టీకి చేసిన సేవలు గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నాగార్జునహిల్స్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



మీర్‌పేట, న్యూస్‌టుడే: మీర్‌పేట కార్పొరేషన్‌లోని నాగార్జునహిల్స్‌కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. కాలనీలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎన్నిక జరిగినట్లు తెలిపారు. అధ్యక్షులుగా కె.గణేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.నవీన్‌కుమార్, కోశాధికారిగా కె.రాముతో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

కబడ్డీ సంఘం ఛైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి నియామకం



మద్ది కరుణాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న సంఘ సభ్యులు

మహేశ్వరం, న్యూస్‌టుడే: మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ మాజీ సర్పంచి మద్ది కరుణాకర్‌రెడ్డి.. రంగారెడ్డి జిల్లా కబడ్డీ సంఘం ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆదివారం సరూర్‌నగర్ జ్యోతి క్లబ్‌లో జిల్లా కబడ్డీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. సీఈవోగా కె.జగదీశ్వర్‌యాదవ్, అధ్యక్షులుగా ఎం.రవికుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పి.సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా ఎం.రాజు, సంయుక్త కార్యదర్శులుగా చంద్రమోహన్‌గౌడ్, లింగంగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు. . కరుణాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

సీతా మెడోస్ కార్యవర్గం ఏర్పాటు



బాలాపూర్, న్యూస్‌టుడే: బడంగ్‌పేట సీతా మెడోస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా పి.నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సీహెచ్.రామారావు, వీఎం.మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ సుభాష్, కోశాధికారిగా వైవీఎస్.రామకృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బి.రాముడు, కార్యవర్గ సభ్యులుగా మురళీకృష్ణ, క్రాంతికుమార్, వంశీగౌడ్, రాము తదితరులు ఎన్నికయ్యారు.

కాటికాపరుల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా నర్సింహ



కాటికాపరుల కమిటీతో సంఘం నేతలు

కందుకూరు, న్యూస్‌టుడే: శ్మశాన వాటికల సంక్షేమ సంఘం కందుకూరు మండలాధ్యక్షుడిగా తిరుమల్ల నర్సింహను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం కందుకూరులో ఆ సంఘం సమావేశం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదే సత్తయ్య, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్‌ల ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారులుగా శేఖర్, ప్రశాంత్, గౌరవ అధ్యక్షులుగా లక్ష్మయ్య, రాములు, కార్యదర్శులుగా కరుణాకర్, సుధాకర్, చెన్నయ్య, దానయ్య, వీరయ్యలను, సహాయ కార్యదర్శులుగా మహేందర్, రాములు, పరుశరామ్‌లను ఎన్నుకున్నారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామంలో ఆదివారం కేవీపీఎస్ సంఘం ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాశ్ కారత్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ చెన్నయ్య, ఎల్లమ్మ, తిరుపతయ్య, బి.యాదయ్య, అంజయ్య, యాదయ్య, రాములు, ప్రభాకర్, కుమార్, జంగయ్య పాల్గొన్నారు.

మైనింగ్ వ్యాపారిపై దాడి కేసులో నలుగురి అరెస్టు

కడ్తాల్ (ఆమనగల్లు), న్యూస్‌టుడే: కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద శనివారం మైనింగ్ వ్యాపారి పిట్ల కతాల్‌పై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. కతాల్ కుమారుడు పిట్ల శ్యామ్‌కుమార్.. తన తండ్రిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులు బద్రియాదవ్, నిజాం, అఫ్రోజ్, సురేష్‌ను ఆదివారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి ముగ్గురికి గాయాలు

యాచారం, న్యూస్‌టుడే: కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వ్యక్తిని లారీ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. ఈ రోడ్డు ప్రమాద సంఘటన రంగారెడ్డి జిల్లా మాల్ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా వెంకటేశ్వర నగర్ నివాసి గున్నాల భాస్కర్(45) వారంతపు సంతల్లో చిల్లర వ్యాపారులకు హోల్‌సేల్‌గా కూరగాయలు సరఫరా చేస్తాడు. నల్గొండ గట్టుప్పల్‌లో శనివారం నిర్వహించిన సంతలో కూరగాయలు సరఫరా చేసి ఆటోలో ఇంటికి తిరిగి వస్తున్నాడు. మాల్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ.. ఆటో ఢీకొట్టడంతో భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతనితో వస్తున్న అతని చెల్లెలు జయమ్మ, అక్క వెంకటమ్మ, ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. మరో 5 నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వీరంతా రోడ్డు ప్రమాదం పాలయ్యారు. భాస్కర్‌కు ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు, భార్య ఉన్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు యాచారం సీఐ శంకర్‌కుమార్ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి వేడుకలు

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మీర్‌పేట, తలకొండపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయంజాల్, ఆదిభట్ల, యాచారం, కందుకూరు, ఆమనగల్లు, కడ్తాల్, మంచాల, ఆర్కేపురం, న్యూస్‌టుడే: మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని పలుచోట్ల శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మహేశ్వరంలో



కొంగర రావిర్యాల-సర్దార్‌నగర్‌లో..



అబ్దుల్లాపూర్‌మెట్‌లో..



ఇబ్రహీంపట్నంలో ..



యాచారంలో ..



నందివనపర్తిలో..



ఆమనగల్లులో వాసవీమాత



మైసిగండి శివాలయంలో..



తలకొండపల్లిలో..



ఆమనగల్లు మార్కేండేస్వామి ఆలయంలో

కార్మికులకు దుస్తుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఆర్థికంగా ఉన్నవారు పేదలకు సహాయం అందించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్ సూచించారు. ఆదివారం ఇబ్రహీంపట్నం, ఆదిభట్లలో పేదలకు, మున్సిపాలిటీ కార్మికులకు దసరా సందర్భంగా నూతన దుస్తులు, మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పాండాల శంకర్‌గౌడ్, రాష్ట్ర లీగల్‌సెల్ వైస్‌ఛైర్మన్ దేవాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు



కానుగుబావితండాలో గిరిజనులు



అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్, కడ్తాల్, ఆమనగల్లు, న్యూస్‌టుడే: అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బొడ్రాయి అమ్మవారి వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బొడ్రాయి అమ్మవారి వద్ద హోమం నిర్వహించి అభిషేకం చేశారు. మండల మాజీ ఎంపీపీ బుర్ర రేఖగౌడ్, మాజీ సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, పలువురు గ్రామ పెద్దలు ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ కడ్తాల్ మండలం కానుగుబావితండాలో ఆదివారం గిరిజనులు నాభి శిల (బొడ్రాయి) వార్షిక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తండాలో గిరిజనులు ఉపవాస దీక్షలతో పాలు, నెయ్యి తదితర వాటితో కలశాలను తయారుచేసి ఊరేగిస్తూ నాభిశిల వద్దకు చేరుకొని అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భీక్యానాయక్, మాజీ ఉపసర్పంచి శారద, నాయకులు పాండునాయక్, నర్సింగ్, శ్రీను, లక్ష్మణ్, రాజు, వినోద్ జాన్యానాయక్, దేవులానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మురుగు పొంగింది.. రహదారిని ముంచెత్తింది

షేక్‌పేట, న్యూస్‌టుడే: షేక్‌పేట పాస్‌పోర్టు సేవాకేంద్రం సమీపంలో మురుగునీటి మ్యాన్ హోల్ పొంగిపొర్లుతోంది. అక్కడి ప్రధాన రహదారిపై మురుగు పరవళ్లు తొక్కుతోంది. మ్యాన్‌హోల్ మూత పగిలిపోవడంతో జలమండలి సిబ్బంది దానికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో రహదారి ఇరుగ్గా మారి ట్రాఫిక్ జామ్ అవుతుంది. వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

షేక్‌పేట పాస్ పోర్ట్ సేవా కేంద్రం సమీపంలో ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

రాహుల్ బొజ్జకు మంత్రుల పరామర్శ



విజయభారతి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం తదితరులు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ఇటీవల కన్నుమూసిన పౌర హక్కుల నేత బొజ్జా తారకం సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జా మాతృమూర్తి, ప్రముఖ రచయిత్రి విజయభారతి సంస్మరణ కార్యక్రమం ఆదివారం బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పలువురు ఐఏఎస్ అధికారులు, విశ్రాంత అధికారులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే సమయంలో రాహుల్ బొజ్జా, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

న్యూస్‌టుడే, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ

? బంజారాహిల్స్ రోడ్ నం.3 జర్నలిస్ట్ కాలనీలోని ప్లాట్ నం.17లో ఉన్న వీధిలో నాలుగు వీధి దీపాలు నెల రోజులకు పైగా వెలగడం లేదు. అధికారులకు చెప్పినా స్పందన లేదు.

-జ్యోత్స్న, స్థానికురాలు, జర్నలిస్ట్ కాలనీ

✓ ఆ సమస్య గురించి మాకు సమాచారం లేదు. సిబ్బందిని పంపి తనిఖీ చేయించి, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధి దీపాల విభాగం), సర్కిల్– 18

– సుష్మ, మున్సిపల్ ఏఈ, వీధిదీపాల విభాగం, సర్కిల్– 18

? అమీర్‌పేట్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని నల్లపోచమ్మతల్లి ఆలయం వీధి దెబ్బతినడంతో ఇబ్బందికరంగా మారింది. రోడ్డంతా గుంతలమయంగా మారడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నాం.

– పురుషోత్తమ్‌రావు, సీనియర్ సిటిజన్

✓ సమస్య మా దృష్టికి రాలేదు. దెబ్బతిన్న రహదారిని వెంటనే మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం.

–చరణ్, ఏఈ, జీహెచ్‌ఎంసీ సర్కిల్ నెం.17

ముందుచూపు లేక.. ముందుకు కదల్లేక

పెద్దమ్మ గుడి చుట్టూ ట్రాఫిక్ కష్టాలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడికి భక్తుల తాకిడితో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ముఖ్యమంత్రి నివాసానికి కూతవేటు దూరంలోని ఈ పెద్ద ఆలయంలో ఉత్సవాల నేపథ్యంలో పోలీసు విభాగాలు, జీహెచ్‌ఎంసీ మధ్య సమన్వయం, ముందస్తు ప్రణాళిక పూర్తిగా లోపించాయి. సాధారణ రోజుల్లోనే పెద్దమ్మ తల్లిని దర్శించుకొనేందుకు దాదాపు పదివేల మందికి పైగా.. ఆదివారం రోజు 40 నుంచి 50 వేల భక్తులు హాజరవుతుంటారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుంది. ఉత్సవాల సమయంలో వారాంతాల్లో భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ఆలయానికి తరలివచ్చే భక్తుల వాహనాలతో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయి. రోడ్ నంబరు 36 నుంచి ఆలయానికి వెళ్లే దారి గుంతలమయమై మురుగు పారుతుంటుంది. ఉత్సవాల నిర్వహణకు ముందు ఇటు శాంతిభద్రతల విభాగం, ట్రాఫిక్ విభాగం, జీహెచ్‌ఎంసీ సంయుక్తంగా ఉత్సవాల సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై కనీసంగా సమావేశాలు ఏర్పాటు చేసుకోలేదు. దీంతో ఆలయానికి వెళ్లే దారిలో ఆలయ సిబ్బందే బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను క్రమబద్ధీకరించాల్సి వస్తోంది. వాహనాల మళ్లింపు ప్రభావం రోడ్ నంబరు 36పై పడటంతో ఈ దారిలో వాహనదారులు ఆదివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు కిలోమీటరు మేర వాహనాలు నెమ్మదించాయి. దాదాపు 70 నుంచి 80 వేల మందికి పైగా భక్తులు హాజరవడంతో ఇక్కడ ట్రాఫిక్ ఒక్కసారిగా అదుపుతప్పింది. భక్తులతోపాటు, ఈ దారిలో ప్రయాణించిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆలయంలో తగినంత పార్కింగ్ సౌకర్యం లేక చాలా మంది రహదారికి ఇరువైపులా వాహనాలు నిలపాల్సి వచ్చింది. రద్దీ ఉన్న రోజుల్లో మళ్లింపు, రహదారులపై మురుగు, ఇతర ఇబ్బందులను తొలగించటానికి ఇకనైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



పెద్దమ్మగుడికి భక్తులు పోటెత్తడంతో రోడ్ నంబరు 36లో నిలిచిన ట్రాఫిక్

రెచ్చిపోయిన చోరులు..

మరోవైపు పెద్దమ్మగుడి వద్ద భక్తుల తాకిడిని అదునుగా తీసుకొని దొంగలు రెచ్చిపోయారు. పోలీసులు కనీసంగా నిఘా పెట్టకపోవడంతో దొంగల పని సులువైంది. ఈ క్రమంలోనే ఆదివారం పెద్దమ్మ తల్లి దర్శనానికి వచ్చిన ఎస్సార్‌నగర్ ప్రాంతానికి చెందిన తేజస్విని, పావని, మాదాపూర్ ప్రాంతానికి చెందిన మాధవి, లింగంపల్లికి చెందిన సువర్చల అనే మహిళలు తమ చరవాణులు చోరీ అయినట్లు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యజ్ఞ మహోత్సవానికి నిధుల కేటాయింపుపై హర్షం

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ప్రయత్నంతో గత రెండేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ సంక్షేమ శాఖ, జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో 'విశ్వకర్మ 'యజ్ఞ' మహోత్సవం, పూజాదికాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం యజ్ఞ మహోత్సవానికి రూ.13 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంలకు సంఘం అధ్యక్షుడు డా.వేములవాడ మదన్మోహన్, గౌరవ అధ్యక్షుడు డా.లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నా అని పిలిస్తే.. అసభ్యంగా ప్రవర్తించాడు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సోదరుడి వరసయ్యే వ్యక్తి ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్‌కాలనీ ప్రాంతంలో నివసించే ఓ యువతి (27) తన బంధువు (సోదరుడు) అయిన అనీష్‌కు ఇల్లు చూపించడానికి తీసుకెళ్లింది. ఇంటిని చూపించే క్రమంలో ఆమెతో అనీష్ అసభ్యంగా ప్రవర్తించాడు. అతడు చేసిన పనికి ఒక్కసారిగా కంగుతింది. దీనిపై శనివారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం పెట్టుబడి పేరుతో మోసం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బంగారం వ్యాపారంలో పెట్టుబడి పెడితే రెండింతలు అవుతుందని నమ్మించిన ఓ యువకుడిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన శీలారాణి కుమార్తె తన స్నేహితుడైన కార్తిక్‌రెడ్డిని తల్లికి పరిచయం చేసింది. దీంతో కార్తిక్ రెడ్డి నమ్మకంగా నటించి పలు వ్యాపార అవకాశాలు చూపుతానంటూ డీఎస్ఆర్ గ్రూపు తన బంధువులదని చెప్పాడు. బంగారం వ్యాపారంలో బంగారాన్ని పెట్టుబడి పెడితే వారంలోనే రెండింతలు అవుతుందని శీలారాణిని నమ్మించాడు. దీంతో ఆమె తన వద్ద ఉన్న ఆభరణాలను కుదువపెట్టి వచ్చిన డబ్బుతో కేజీ బంగారాన్ని కొనుగోలు చేసి ఇచ్చింది. శ్రీనివాసచారి అనే వ్యక్తి ద్వారా తొలుత పంజాగుట్ట ప్రాంతంలో తీసుకుంటానని చెప్పాడు. అనంతరం జూబ్లీహిల్స్‌లోని అల్కజార్ మాల్ వద్ద ఆగస్టు 13న బంగారాన్ని తీసుకున్నాడు. వారం గడిచినా బంగారం తిరిగి ఇవ్వకపోవడంతోపాటు సందేశాలు పెట్టి సమయాన్ని సాగదీస్తూ వచ్చాడు. దీంతో అనుమానించిన శీలారాణి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీసులకు బదిలీ చేశారు. దీంతో కార్తిక్‌రెడ్డిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కుచ్చుటోపీ

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఎంఎన్‌సీ కంపెనీల్లో బ్యాక్‌డోర్ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పిస్తానని, డబ్బు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌కాలనీలోని ఓ వసతిగృహంలో ఉంటున్న ఏపీకి చెందిన లక్ష్మీ కోటేశ్వరమ్మ ఉద్యోగ ప్రయత్నంలో ఉంది. ఆమె స్నేహితుడు శివకృష్ణ ద్వారా గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన వెంకటేష్ పరిచయమయ్యాడు. బ్యాక్‌డోర్ ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆమెను నమ్మించాడు. ఇందుకు రూ.30 వేలు అడ్వాన్సుగా ఇవ్వాలని చెప్పాడు. అతడి మాటలను నమ్మి తనతో పాటు మరో 20 మందికి ఉద్యోగాలు కల్పించాలని, వారి నుంచి డబ్బు వసూలు చేసి రూ.3.3 లక్షలను వెంకటేష్‌కు ఇచ్చింది. ఉద్యోగాల పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు పంపాడు. ఉద్యోగంలో చేరాలంటే ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుందని చెప్పాడు. గత నెలలో గచ్చిబౌలి ప్రాంతంలోని ఒక ఓయో గదిలో పది మంది అభ్యర్థులకు ల్యాప్‌టాప్‌లను సమకూర్చి ఫేక్ ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహించాడు. తమను మోసం చేస్తున్నాడని గ్రహించిన లక్ష్మీ కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోకాపేటలో స్థలాన్ని అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న రామకృష్ణయ్య, చిత్రంలో మారుతి, పార్వతయ్య, నరేష్, కిషన్, ఉమామహేశ్వర్, శంకరయ్య

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: అఖిల గాండ్ల తెలికుల సామాజిక వర్గానికి గత ప్రభుత్వం కేటాయించిన ఎకరం భూమిని పలు విధాలుగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు ఆ సంఘం సీనియర్ నేత పాలూరి రామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో ఆ సామాజిక వర్గంలోని ఏడు సంఘాల నేత రామకృష్ణయ్య నేతృత్వంలో సమావేశమై చర్చించారు. కోకాపేటలో తమ సామాజిక వర్గానికి ఎకరం స్థలం కేటాయించారని, అది 2018లో పట్టా చేయించామన్నారు. అక్కడ తమ సామాజికవర్గం నుంచి దేశ విదేశాల్లో ఉన్న వారందరి సహకారంతో పాఠశాల ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అక్కడ తమ సమాజానికి ఆర్థికంగా తోడ్పాటుగా ఉండేలా సహకారం బ్యాంకును ఏర్పాటుపైనా చర్చించామన్నారు. ఏడు సంఘాల్లో ఒక్కో సంఘం నుంచి ముగ్గురిని ఎంపిక చేసి అడ్‌హక్ కమిటీని ఏర్పాటుచేసి ఆ కమిటీ ఆధ్వర్యంలో ముందుకు వెళతామన్నారు. సమావేశంలో తెలంగాణ గాండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జూపల్లి నరేష్, తెలంగాణ గాండ్ల సంఘం అధ్యక్షుడు జి.పార్వతయ్య, గాండ్ల తెలికుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రావు, తెలంగాణ గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇందల్వాయి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పండగల గొప్పదనం చాటి చెబుదాం



ప్రెస్‌క్లబ్ కార్యవర్గంతో మంత్రి సీతక్క

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మన పండగల గొప్పదనాన్ని భావితరాలకు తెలియజెప్పాలని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం రాత్రి సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొని మహిళా పాత్రికేయులతో కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణలో ఆచరించే పండగలన్నీ ప్రకృతితో ముడిపడి ఉన్నాయని, వీటి ప్రాధాన్యతను తర్వాత తరాలు మర్చిపోకుండా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, మహిళా పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ పద్మావతి కాలనీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

పంజాగుట్ట: ఖైరతాబద్ డివిజన్‌లోని పద్మావతి కాలనీలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో టీపీసీసీ ప్రధానకార్యదర్శి పి.విజయారెడ్డి పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

మల్లు రవికి సత్కారం



యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: తెలంగాణ ఎంపీల ఫోరమ్ కన్వీనర్‌గా నియమితులైన నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు మల్లు రవిని కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ.రవిశేఖర్‌రెడ్డి ఆదివారం కలిసి సన్మానించారు.

మానసిక వ్యాధులపై అవగాహనకు వాకథాన్



సంజీవయ్య పార్కులో నిర్వహించిన వాకథాన్‌లో వైద్యులు తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: వరల్డ్ మెంటల్ హెల్త్ అవేర్నెస్ వీక్‌లో భాగంగా ఎర్రగడ్డలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ (ఐఎంహెచ్) ఆధ్వర్యంలో మానసిక వ్యాధులపై అవగాహన కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కులో మానసిక వ్యాధులపై పనిచేస్తున్న పలు సంస్థలతో కలిసి దీన్ని నిర్వహించారు. ఐఎంహెచ్ సూపరింటెండెంట్ డా.అనిత, హెచ్ఓడీ సుధ ఆధ్వర్యంలో జరిగిన వాకథాన్‌లో సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.అశోక్, ప్రధాన కార్యదర్శి డా.విశాల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు డా.నరేష్, మెంటల్ హెల్త్ కమిటీ ఛైర్మన్ డా.జార్జ్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు డా.ఫణికాంత్, డా.రిషికేష్, డా.రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ హబీబ్ ఫాతిమానగర్ ఫేజ్-2 సయిదా ఫాతిమా మసీదులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. బేగంపేటలోని మెడికవర్ హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో వందమందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, సంఘసేవకుడు మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో మసీదు కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గేసుదరాజ్, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సౌత్‌వెస్ట్ జోన్ హెచ్.ఎఫ్.నగర్ అధ్యక్షుడు నయీముద్దీన్, తెలంగాణ మైనారిటీస్ క్యాబ్‌డ్రైవర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు మహమ్మద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ కార్మికుల సంక్షేమానికి కృషి



ఎన్నికైన సంఘం నూతన కార్యవర్గం


ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు, ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికుల సంక్షేమానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలంగాణ ఫ్లెక్స్ ప్రింటర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పేర్కొంది. ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రెండేళ్లపాటు కొనసాగే ఈ సంఘానికి నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సప్పిడి నరేష్‌కుమార్, కొట్ల వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస్, కోశాధికారిగా ఎండీ ఖదీర్, సంయుక్త కార్యదర్శిగా పొలాస శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా ఎస్‌డీ ప్రసాద్, మహమ్మద్ అలీ ఉద్దీన్, కొండ రాజు కొనసాగుతారని సంఘం మాజీ అధ్యక్షుడు అన్సారి తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న యజమానులు, కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. నూతన సంఘాన్ని సత్కరించారు.



జూబ్లీహిల్స్‌లోని సీతారామ స్వామి దేవాలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా..



రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-2లో..



బోరబండ సైట్-I కాలనీ రామాలయం వద్ద..



శ్రీనగర్‌కాలనీలోని ఆలయంలో శ్రీమహాలక్ష్మీదేవిగా..



కామధేనుదేవిగా నల్లపోచమ్మ

అమ్మ దర్శనం.. భక్త జన పరవశం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్‌లోని శ్రీసీతారామ స్వామి దేవాలయంలో కొలువుదీరిన పర్వతవర్ధిని దేవి ఆదివారం లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు, శ్రీవారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.



బోరబండ స్వరాజ్యనగర్ హరిహర క్షేత్రంలో అన్నపూర్ణదేవికి పూజలు

తాగునీరు రోడ్డు పాలు



బంజారాహిల్స్ రోడ్డు నం.3లోని గ్రీన్ మసీదు ప్రధానగేటు ఎదురుగా దారిలో ఇలా..

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: రహదారిపై తాగునీరు వృథాగా పోతోంది. స్థానిక బంజారాహిల్స్ రోడ్డు నం.3 ప్రధాన రహదారి నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలోని గ్రీన్ మసీదు (హుస్సేనియా మసీదు) ప్రధాన గేటు ఎదురుగా ఉన్న తాగునీటి పైపులైను మ్యాన్‌హోల్ ఉంది. ఈ క్రమంలో గత పది రోజులుగా నీటి సరఫరా జరిగినప్పుడల్లా దీన్నుంచి లీకై రోడ్డుపై వృథాగా పోతోందన్నారు. నీరు వృథా కావడమే కాకుండా రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని చెప్పారు. జలమండలి బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివను వివరణ కోరగా.. సరఫరా జరిగే సమయంలో తనిఖీ చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం



సభ్యత్వ నమోదులో చింతల రామచంద్రారెడ్డి, బోజిరెడ్డి తదితరులు

ఫిలింనగర్, న్యూస్‌టుడే: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యున్నతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ 139 బూత్‌లో ఆదివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, స్థానిక సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.బోజిరెడ్డి, భాజపా డివిజన్ అధ్యక్షులు ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను అడ్డుకునేందుకు పోరాటం సాగిస్తాం



ప్రసంగిస్తున్న కృష్ణ స్వరూప్, నాయకులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: వర్గీకరణ, క్రీమిలేయర్‌పై రివ్యూ పిటిషన్‌లను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ డిస్మిస్ చేసినా.. క్యూరేటివ్ పిటిషన్ దాఖలుకు రాజ్యాంగపరమైన వెసులుబాటు ఉందని దళిత బహుజన పార్టీ (డీబీఎస్) జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ ఛైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని డీబీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం తీర్పుతో మాల, బేగరి, నేతకాని, దాసరి, మహర్ వంటి కులాలు ఆందోళన చెందవద్దని చెప్పారు. డిసెంబరు రెండో వారంలో దళితుల తిరుగుబాటు పేరుతో 'వర్గీకరణ వద్దు. . రాజ్యాధికారం కావాలి' నినాదంతో భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా సత్తా చాటాలని సమావేశంలో తీర్మానం చేశారు. వర్గీకరణ, క్రీమిలేయర్‌కు అనుకూలంగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుపై పోరాటం చేస్తామని ప్రకటించారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జె.ఎన్.రావు, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సీహెచ్ రోజాలీల, డీబీఎస్ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.అశోక్, వీబీఐ రాష్ట్ర కార్యదర్శి తీగల శేఖర్, మాలమహానాడు (శ్రీకృష్ణ వర్గం) జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ, తెలంగాణ బేగరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.సుచంద్ర, దర్జీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల సునీల్ చంద్ర రావ్, ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ కొర్రా హరీష్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మలోవత్ రవీంద్ర, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి

రక్తదానం ప్రాణాలు నిలబెడుతుంది: ఎమ్మెల్యే


శిబిరాన్ని ప్రారంభించి పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: రక్తదానం అవసరమైన వారి ప్రాణాలు నిలబెడుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి సంకల్ప్ ప్రింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతినగర్ చింతపట్ల వెంకయ్య పార్కులో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 48మంది రక్తదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యయనోత్సవాలు ప్రారంభం



బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ సాయినగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ ఉత్సవం ప్రారంభించారు. వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఉత్సవాలు 8వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 9వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని వివరించారు.

ఆకర్షణీయంగా నవరాత్రుల ఆలయ నమూనా



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాప్‌లో నవరాత్రుల నమూనా ఆలయం ఆకట్టుకుంటోంది. మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లోని తుల్జాభవానీ ఆలయం మాదిరి కేపీహెచ్‌బీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నమూనా ఆలయం తీర్చిదిద్దారు. నమూనా ఆలయం తయారీదారులు కూడా మహారాష్ట్ర నుంచే వచ్చారు. ఆలయం లోపల దుర్గామాత అమ్మవారికి నవరాత్రుల విశేష పూజలు చేయనున్నారు.

ఆకట్టుకున్న కవాతు



కూకట్‌పల్లి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూకట్‌పల్లి భాగ్ ఆధ్వర్యంలో ఆదివారం పాపారాయుడునగర్ అశోక్ గార్డెన్స్‌లో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం సంఘ్ సభ్యులు 4కిలోమీటర్ల మేర కవాతు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి వి.భాగయ్య, భాగ్ సంఘసంచాలక్ సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పూర్తి..

జాబితా నుంచి 5,483 మంది తొలగింపు

కొందరి సమాచారం అసంపూర్తి


కూకట్‌పల్లిలో ఇంటింటి సర్వేలో బీఎల్‌వోలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రక్షాళనకు చేపట్టిన సర్వేలో భారీగా మార్పులేమీ జరగడం లేదని తేలిపోయింది. ఇంటింటి పరిశీలనను ఈసారి అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో గతంకంటే కొంత ఫర్వాలేదనే చెప్పాలి. సర్వే పూర్తయినప్పటికీ.. కొందరి వివరాలు లభ్యం కాకపోవడంతో కొంత సమాచారం అసంపూర్తిగానే మిగిలిపోనుంది. సర్వేలో గుర్తించిన అంశాలను బీఎల్‌వోలు యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో ఎన్నికల విభాగం సిబ్బంది వాటిని సరిచూసే పనిలో నిమగ్నమయ్యారు. తొందరలో జాబితా ముసాయిదా సిద్ధం చేయాల్సి ఉండడంతో.. సవరణ కార్యక్రమానికి ఇటీవల శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.

గుర్తించిన ఓటర్లు.. 99.41శాతం

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో ఓటరు జాబితా సవరణ కోసం గతనెలలో ఇంటింటి సర్వే మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ప్రారంభంలో జాప్యం జరగడం.. తరువాత కొంత వెనుకబడి ఉండడంతో రాష్ట్ర ఎన్నికల నిర్వహణ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సర్వేపై సమీక్ష సైతం నిర్వహించి పూర్తి చేశారు. అందరి ఇళ్లకు బీఎల్‌వోలు వెళ్లగా.. 99.41 శాతం ఓటర్లు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. నియోజకవర్గం ఓటర్లు 4,85,139మంది ఉండగా.. 4,82,296మంది వివరాలు పరిశీలించారు. 2,843మంది ఆయా ఇళ్లల్లో లేకపోవడం.. కొందరి వివరాలు ఆన్‌లైన్‌లో లభ్యం కాకపోవడం తదితర సమస్యలున్నాయి. దీంతో వారిని పక్కన పెట్టి సర్వే జరిగినంత వరకు వివరాలను అప్‌డేట్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. చాలావరకు పరిశీలన పూర్తికాగా.. మిగతావాటి ధ్రువీకరణ కూడా తొందరలోనే పూర్తవుతుందని అధికారులు వివరించారు.


చిరునామాలు మారారు.. కొందరు చనిపోయారు

● సర్వేలో మొత్తం అన్ని డివిజన్లలో కలిపి 3,492మంది ఓటర్ల జాబితాలో ఇచ్చిన చిరునామాలో లేరని గుర్తించారు. వీరందరూ ఇదే నియోజకవర్గంలో ఉన్నారా? ఇతర ప్రాంతాలకు వెళ్లారా? అన్నది ధ్రువీకరించాల్సి ఉంది.

● జాబితాలో ఉన్న వారిలో 1,691మంది మృతి చెందినట్లు తేలింది. వీరి వివరాలను కుటుంబ సభ్యుల నుంచి ధ్రువీకరించుకున్నారు.

● నకిలీ ఓటర్లు 300మంది ఉన్నట్లు తేలగా.. వారి వివరాలు కూడా ధ్రువీకరించారు.

మొత్తం 5,483మంది పేర్లు జాబితా నుంచి తొలగించాల్సి ఉంది. ●లభ్యంకాని వారి సంఖ్య 2,843మంది ఉండగా.. చిరునామా మారినవారు, మృతులు, నకిలీలతో కలిపి మొత్తం 8,326మందిని తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 31న ముసాయిదా ప్రచురిస్తామని అధికారులు వివరించారు.



రాజేంద్రప్రసాద్‌కు పరామర్శ



కేపీహెచ్‌బీ కాలనీ, న్యూస్‌టుడే: కుమార్తెను కోల్పోయిన సినీనటుడు రాజేంద్రప్రసాద్‌ను ఆదివారం జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పరామర్శించారు. కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్‌లోని ఇందూ విల్లాస్‌లో ఉంటున్న రాజేంద్రప్రసాద్‌తోపాటు అతని కుటుంబసభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రహదారి మురమ్మతులకు శ్రీకారం

ఈనాడు కథనానికి స్పందన

మూసాపేట, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం దొరికింది. భరత్‌నగర్‌లోని సీనియర్ సిటిజన్స్ భవనం పక్కన ఉన్న రెండు గల్లీల్లో జలమండలి ఆధ్వర్యంలో భూగర్భ మురుగు కాల్వ నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో చేపట్టిన తవ్వకాలను సరిగా పూడ్చకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనిపై 'ఈనాడు'లో 1న 'ఎనిమిది నెలలుగా తొలగని యాతన' శీర్షికతో వచ్చిన కథనానికి జలమండలి ప్రాంతీయ మేనేజర్ విలియమ్స్ ప్రకాష్ స్పందించారు. మిగిలిపోయిన రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.

అమ్మ దర్శనం..
తరిస్తున్న భక్తజనం

కూకట్‌పల్లి, మూసాపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం నాలుగోరోజు అమ్మవారు విభిన్న అలంకరణల్లో ఆలయాల్లో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. సామూహిక కుంకుమార్చన, హోమం, అభిషేకం తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రత్యేక మండపాల వద్ద అన్నసమారాధన జరిగింది.


వివేక్‌నగర్‌లోని ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి ఆలయంలో గాయత్రీదేవి అలంకరణ


అన్నపూర్ణాదేవిగా ఓల్డ్‌బోయిన్‌పల్లి కాశీ విశాలాక్షి అమ్మవారు


మూసాపేట ఆంజనేయనగర్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు


కూకట్‌పల్లి ప్రకాశ్‌నగర్‌లో అమ్మవారి పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్


లలితాదేవిగా ఫతేనగర్ జవహర్‌కాలనీలోని కనకదుర్గాదేవి


గౌరీదేవిగా మూసాపేట రేణుకా ఎల్లమ్మ

550మంది పోలీసులకు వైద్య పరీక్షలు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రాందేవ్‌రావు ఆసుపత్రిలో ఆదివారం బాలానగర్ జోన్ పరిధిలోని 12ఠాణాల పోలీసు అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏసీపీ శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. 550మందికి ఒక్కొక్కరికి రూ.17వేల విలువ చేసే అన్నిరకాల వైద్య పరీక్షలు చేశారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్‌రావు, సీఈవో డాక్టర్ ఎన్.యోబు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరం.. ఉట్టిపడుతున్న సంప్రదాయం


బతుకమ్మతో చిన్నారులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో బతుకమ్మ సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం కూకట్‌పల్లి గ్రామం, దేవిస్థానా హోమ్స్‌లో మహిళలు బతుకమ్మ ఆట, పాటలతో అలరించారు. సంస్కృతి, సంప్రదాయాన్ని చాటుతున్న ఉత్సవాల్లో పెద్దల నుంచి చిన్నారుల వరకు మహిళలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. దేవిస్థానా హోమ్స్‌లో దాండియాతో సందడి చేశారు.


కూకట్‌పల్లి దేవిస్థానా హోమ్స్‌లో అతివలు



మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

చెట్లకొమ్మల తరలింపు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి రంగధాముని చెరువు, రెయిన్‌బో విస్టాస్ రోడ్లలో పక్కన ఇటీవల చెట్ల కొమ్మలను సిబ్బంది కొట్టేసి కాలిబాటపై గుట్టలుగా వదిలేశారు. దీంతో పాదచారులు నడవడానికి వీలు లేక పరిసరాలు అధ్వానంగా మారాయి. ఈ విషయాన్ని మూసాపేట సర్కిల్ అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా సిబ్బందితో చెట్లకొమ్మలను తీయించి వాహనాల్లో తరలించి కాలిబాటను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు.

రహదారి శుభ్రం



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ ధర్మారెడ్డికాలనీ ఫేజ్-1లో అధ్వానంగా మారిన రహదారిని జీహెచ్ఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు. ఎంఐజీ నివాసాల సముదాయాల్లో రహదారిని ఊడ్చక చెత్తచెదారం పేరుకుపోయింది. వ్యర్థాల ప్రభావానికి రహదారి జారిపడే విధంగా తయారైంది. మట్టి నిలిచిపోయింది. రహదారిని శుభ్రం చేయాలని సిబ్బంది దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లడంతో శుభ్రం చేశారు.

బాలానగర్ సీఐగా నర్సింహరాజు

బాలానగర్: బాలానగర్ సీఐగా నర్సింహరాజు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న పి.నవీన్‌కుమార్ రాజేంద్రనగర్ ఠాణా డీఐగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో పేట్‌బషీరాబాద్ డీఐగా పనిచేస్తున్న నర్సింహరాజును నియమించారు. సోమవారం కొత్త సీఐ బాధ్యతలు స్వీకరించనున్నారు.

మైత్రీనగర్ నూతన కార్యవర్గం ఎన్నిక

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి మైత్రీనగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా టి.అర్జున్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.నవీన్‌కుమార్, కోశాధికారిగా లక్ష్మీనారాయణరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మాణిక్యం, ఉపాధ్యక్షులుగా సాయికుమార్, శీలారాజన్ తదితరులు ఎన్నికయ్యారు. వీరిని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ శాలువాలతో సత్కరించారు.

ఎప్పుడు కూలునో.. ఎవరి మాడు పగులునో


జేఎన్‌టీయూ క్లాస్‌రూం కాంప్లెక్స్ భవనం ఎదురు రోడ్డులో


ఇదే రోడ్డులో మరోచోట

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో ఓ ప్రమాదం పొంచి ఉంది. క్లాస్‌రూం కాంప్లెక్స్ ఎదురు రోడ్డులో రెండుచోట్ల రెండు వీధి దీపాల స్తంభాలు ఒరిగి ఉన్నాయి. క్యాంపస్ నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు. గోల్డెన్ జూబ్లీ భవనం నిర్మాణ పనుల నేపథ్యంలో క్రమం తప్పకుండా ఇంజినీరింగ్ అధికారులు ఇటుగా రాకపోకలు సాగిస్తున్నా.. ఈ స్తంభాలు వారి కంట పడకపోవడం గమనార్హం.

జేఎన్‌టీయూలో క్యాంపస్‌లో మురుగు ప్రవాహం



జేఎన్‌టీయూ క్యాంపస్ రెండో గేటుకు సమీపంలో కొన్ని రోజులుగా మురుగు లీకవుతుంది. లీకవుతున్న మురుగు కాలిబాటపై నుంచి రోడ్డుపైకి చేరుతుంది. దీంతో అపరిశుభ్రత నెలకొని దుర్వాసన వ్యాపిస్తుంది. మరమ్మతుల నిర్వహణలో జాప్యం జరుగుతుంది.

- న్యూస్‌టుడే, కూకట్‌పల్లి

వంతెనను గాలికొదిలేశారు!

జేఎన్‌టీయూ-మలేషియన్ టౌన్‌షిప్ దారిలో అధ్వానం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: అధికారులు జేఎన్‌టీయూ-మలేషియన్ టౌన్‌షిప్ వంతెన నిర్వహణను మరిచారు. వంతెన వచ్చి ఆరేళ్లవుతున్నా.. కళ లేదు. పచ్చదనం లేక బోసిపోయింది. వంతెన కింద సుందరీకరణ పనులపై దృష్టి సారిస్తున్న అధికారులు పైన మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఈ వంతెన రహదారులు ఊడ్చి నెల దాటిందని కాలనీలవాసులు చెబుతున్నారు. వంతెన దారి అధ్వానంగా మారింది. సన్న కంకర పేరుకుని వాహనాలు జారిపడే విధంగా ఉండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.


పైపుల రంధ్రాల వద్ద చెత్తాచెదారం


వంతెన ఎక్కే రహదారిలో సన్న కంకర

మూసుకుపోయిన పైపుల రంధ్రాలు

వంతెన రహదారులపై పారే వరద కింద విభాగినిలో మొక్కలకు అందిలే పైపులైన్లు ఏర్పాటుచేశారు. పైపుల ధ్వంసం విషయం పక్కనపెడితే వంతెనపై రంధ్రాలు చెత్తాచెదారం, మట్టి, ఇసుకతో మూసుకుపోయాయి. వర్షానికి ముందు రహదారులపై పేరుకున్న వ్యర్థాలు, మట్టి నిత్యం శుభ్రం చేయకపోవడంతోనే వరద ప్రవాహానికి రంధ్రాల వద్ద వచ్చి ఆగిపోతున్నాయి. ఫిర్యాదు అందితేనే ఊడ్వడం. లేదంటే ఇంతేసంగతులు. వంతెనపై రహదారులు అపరిశుభ్రంగా ఉంటున్నాయని తరచూ మూసాపేట సర్కిల్ ఉపకమిషనర్‌కు ఫిర్యాదులు అందుతున్నా సకాలంలో తరలించకపోవడంపై ఫిర్యాదుదారులు మండిపడుతున్నారు.

ప్రతిపాదన ఉంది: పద్మనాభం, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరక్టర్

వంతెనపై విభాగినిలో మొక్కలు ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన ఉంది. ప్రక్రియ కొనసాగిస్తున్నాం. తొందర్లోనే పచ్చదనం అందుబాటులోకి తీసుకొస్తాం.

సన్న కంకర, దుమ్ముధూళి

రైతుబజారు దాటి వంతెన ఎక్కితే ఎడమ వైపు పొడవునా సన్న కంకర పేరుకుంది. రెడీమిక్స్ లారీల ధాటికి కాంక్రీట్ మిశ్రమం జారిపడి రహదారికి అతుక్కుపోతోంది. వాహనాల ధాటికి చెల్లాచెదురై కంకర విడిపోయి వాహనాలు జారిపడే విధంగా రహదారులు మారుతున్నాయి. వాహనాల రద్దీకి దుమ్ము, ధూళి కమ్ముకుంటోంది. వాహనదారులకు ఇది ప్రమాదమే. వంతెన అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి ఇదే పరిస్థితి.

పచ్చదనం పత్తాలేదు

సాధారణంగా వంతెన విభాగినిలోని కుండీల్లో వివిధ రకాల మొక్కలు ఉంచుతారు. ఇక్కడ వంతెన నిర్మించిన నాటి నుంచి పచ్చదనంపై అధికారులకు ధ్యాసే లేదు. విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. పచ్చదనంతో కళకళలాడాల్సిన విభాగిని బోసిపోయింది. వరద పారే రంధ్రాల్లో మాత్రం మొక్కలు పెరుగుతున్నాయి.


కట్టపై గేటు ధ్వంసం కావడంతో ఏర్పాటుచేసిన బారికేడ్


మరోచోట ఊడిపోవడంతో పక్కకు పెట్టిన గేటు


ఇంకోచోట గొల్లెం లేకపోవడంతో తెరిచి ఉంచిన గేటు

ఊడిన గేట్లు.. ప్రమాదకర పరిస్థితులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రంగధాముని చెరువు కట్టపై ఇటీవల వినాయక నిమజ్జనం కారణంగా కట్ట పొడవునా ఏర్పాటు చేసిన కంచె పలుచోట్ల ధ్వంసమైంది. అవసరమైనప్పుడు తీసేందుకు గేట్లు ఏర్పాటుచేయగా.. కొన్ని ధ్వంసమయ్యాయి. మరి కొన్ని ఊడిపోయాయి. దీంతో ఆయాచోట్ల తాత్కాలికంగా బారికేడ్లు పెట్టారు. బతుకమ్మ వేడుకలు జరుగుతుండడం.. కట్టపై నిత్యం జనం సంచారం ఉండడం.. వాకర్ల రద్దీ నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న కంచెను పునరుద్ధరించాల్సి ఉంది. ఈనెల 10న సద్దుల బతుకమ్మ వేడుకలు ఇక్కడ నిర్వహించనున్న నేపథ్యంలో ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి •పటాన్‌చెరు

ఫ్లెక్సీ కార్మికుల సంక్షేమానికి కృషి

ఖైరతాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు, ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికుల సంక్షేమానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలంగాణ ఫ్లెక్స్ ప్రింటర్స్ అండ్ ఎసోసియేషన్ అసోసియేషన్ పేర్కొంది. ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రెండేళ్లపాటు కొనసాగే ఈ సంఘానికి నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సప్పిడి నరేష్‌కుమార్, కొట్ల వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస్, కోశాధికారిగా ఎండీ జబీర్, సంయుక్త కార్యదర్శిగా పొలాస శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా ఎన్వీ ప్రసాద్, మహమ్మద్ అలీ ఉద్దీన్, కొండ రాజు కొనసాగుతారని సంఘం మాజీ అధ్యక్షుడు అన్నారి తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ఈ రంగంపై ఆధార పడి జీవిస్తున్న యజమానులు, కార్మికుల సంక్షేమా నికి పెద్దపీట వేస్తామని చెప్పారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో కుచ్చుటోపీ

యూసుఫ్‌గూడ: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌కాలనీలో ఉంటున్న ఏపీకి చెందిన లక్ష్మీ కోటేశ్వరమ్మ స్నేహితుడు కిషన్ ద్వారా గచ్చిబౌలికి చెందిన వెంకటేష్ పరిచయమయ్యారు. ఇన్ఫోటెక్ ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో ఆమె రూ.30 వేలు అడ్వాన్సుగా ఇవ్వాలని చెప్పాడు. అతడి మాటలు నమ్మి మరో 20 మందినుంచి డబ్బు వసూలు చేసి రూ.3.8లక్షలు వెంకటేష్‌కు ఇచ్చింది. నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు పంపాడు. ఉద్యోగంలో చేరాలంటే ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుందని చెప్పాడు. గత నెలలో గచ్చిబౌలిలోని ఒక ఓయో గదిలో పది మంది అభ్యర్థులకు ఫేక్ ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహించాడు. తమను మోసం చేస్తున్నాడని గ్రహించిన లక్ష్మీ కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.



దేవీస్తుతి వైభవం..
నృత్య వందనం

మాదాపూర్: శిల్పారామంలో ఆదివారం సాయంత్రం కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. డా.సరోజ, డా.సుజాత సంగీత కచేరి అలరించింది. అక్కాచెల్లెలు తమ గానామృతంతో సంగీత ప్రియులను కట్టిపడేశారు. జ్యోత్స్న శిష్యబృందం దేవీస్తుతి వైభవం పేరిట ప్రదర్శించిన కూచిపూడి నృత్యం నయనానందకరంగా సాగింది. అమ్మవారి 9 రూపాలను చక్కటి నృత్యాభినయంతో ప్రదర్శించి అలరించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి



షాబాద్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా షాబాద్ మండలం ఆస్పల్లిగూడకు చెందిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పార్టీకి చేసిన సేవలు గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సురక్షా ఎన్‌క్లేవ్ కార్యవర్గం ఏర్పాటు

చందానగర్, న్యూస్‌టుడే: చందానగర్ సురక్షా ఎన్‌క్లేవ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం కాలనీ సామాజిక భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా దేవినేని.రవి, ఉపాధ్యక్షులుగా షేక్‌హుస్సేన్, కె.రంగస్వామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.విజేందర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా ఎం.పోచయ్య ఎన్నికయ్యారు.



అన్నపూర్ణ దేవి అలంకరణలో జెపీహెచ్‌కాలనీ కనకదుర్గ



చందానగర్‌లో భజరంగ్ యూత్ అసోసియేషన్ మండపంలో పూజల్లో ఎమ్మెల్యే గాంధీ



రాయదుర్గంలో 56 వంటకాలతో అమ్మవారికి నైవేద్యం



హెచ్‌ఎంటీహిల్స్ కాలనీ రామాలయంలో లలితాత్రిపుర సుందరి దేవిగా



శంషీగూడ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో లలిత త్రిపుర సుందరిగా అమ్మవారు

విజయరూపిణి అభయ ప్రదాయిని

ఆల్విన్‌కాలనీ, హెల్ (శేరిలింగంపల్లి), మియాపూర్, చందానగర్, రామచంద్రాపురం రూరల్, రాయదుర్గం, న్యూస్‌టుడే: దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో సాగుతున్నాయి. పలు ఆలయాలు, మండపాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు, హోమాలు కొనసాగుతున్నాయి. అన్నదానాలు చేశారు.

వివాదాస్పదంగా స్థలాల కేటాయింపు

శాఖల మధ్య సమన్వయ లోపం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: ప్రజా భాగస్వామ్య అభివృద్ధికి కేటాయించిన స్థలాల విషయంలో శాఖల మధ్య సమన్వయ లోపం రాజకీయ జోక్యానికి దారి తీసింది. రోడ్డు పక్కన స్థలం మాకే కావాలంటూ రెండు శాఖల అధికారులు పోరాటం చేస్తుండగా పోలీసులు మాదంటూ బోర్డు ఏర్పాటు చేశారు. అమీన్‌పూర్ 2018లో పురపాలక పట్టణంగా ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాలు అన్నిటికీ శాశ్వత భవనాలు నిర్మించడానికి వీలుగా స్థలాలు కేటాయించారు. రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీస్, వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖ, మార్కెట్ యార్డ్‌లకు రెండెకరాల చొప్పున స్థలాలు కేటాయించారు.

● గుట్ట పైభాగంలో విద్యాశాఖకు కేటాయించారు. పూర్తిగా వెనుక భాగంలో పోలీసులకిచ్చారు. రోజువారీ కేసులు ఎక్కువగా ఉన్న సందర్భంలో రాకపోకలకు ఇబ్బందులు వస్తాయంటూ పోలీస్‌శాఖ రెవెన్యూ శాఖకు కేటాయించిన స్థలాన్ని తమకివ్వాలంటూ పెట్టిన అర్జీకి జిల్లా కలెక్టర్ ఆమోదించారు.



కేటాయించిన స్థలంలో బోర్డు ఏర్పాటు చేసుకున్న పోలీసులు

● ఇందుకు అనుగుణంగా రెవెన్యూశాఖ పంచనామా నిర్వహించి రెండెకరాల స్థలాన్ని పోలీస్ శాఖకిస్తూ ఉత్తర్వులిచ్చింది.

● మరోవైపు విద్యాశాఖకు ఇవ్వాలంటూ మున్సిపల్ ఛైర్మన్ పాండురంగారెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు. గుట్టపై భాగం వరకు విద్యార్థులు వెళ్లాలంటే ఇబ్బందిపడతారని పోలీసులకిచ్చిన స్థలాన్ని పాఠశాలకివ్వాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులు అభ్యంతరం తెలిపారు.

రంగంలోకి ఎంపీ

కోకాకోలా పరిశ్రమ రూ.20లక్షల సీఎస్‌ఆర్ నిధులతో పాఠశాల భవనాన్ని నిర్మించడానికి ముందుకొచ్చినందున రోడ్డు పక్కనే రెండెకరాల స్థలాన్ని ఇవ్వాలని ఎంపీ రఘునందన్‌రావు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా ఎస్పీ రూపేష్‌కుమార్‌లను కోరారు. ఎంపీ అభ్యర్థనను ఉన్నతాధికారులు తిరస్కరించారు.

● గుట్ట పైభాగంలో చదును చేసుకోవాలంటే నిధుల సమస్య ఉందని పాండురంగారెడ్డి విన్నవించారు. ఇది గమనించిన పోలీసులు తమకు కేటాయించిన స్థలంలో ముగ్గు పోసి బోర్డు ఏర్పాటు చేసుకున్నారు.

● చర్చల అనంతరం శ్మశాన వాటికకు ఆనుకుని ప్రధాన రహదారి పక్కనే పాఠశాల భవనానికి స్థలం కేటాయించారు. దీనిపై గ్రామస్థులు అభ్యంతరం పెట్టారు. శ్మశానంలో మృతదేహాలు కాలుస్తున్న సమయంలో వచ్చే పొగతో విద్యార్థులు ఇబ్బందిపడతారని ఆందోళన వ్యక్తంచేశారు.

పంచనామా ప్రకారమే స్థలాల కేటాయింపు: రాధ, తహసీల్దార్, అమీన్‌పూర్

అన్ని శాఖలకు పంచనామా ప్రకారమే రెండెకరాల చొప్పున కేటాయించాం. ఇప్పుడు మార్చాలంటే అన్ని రకాల పత్రాల హద్దులు మార్చాలి. ఇది ఉన్నతాధికారుల అనుమతితోనే జరగాల్సి ఉంటుంది.

నిబంధనల మేరకే మేమున్నాం: నాగరాజు, సీఐ, అమీన్‌పూర్

రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలంలోనే బోర్డు పెట్టాం. అక్కడే భవనం నిర్మిస్తాం. పంచనామా నిబంధనల మేరకే స్థలాన్ని స్వాధీనం చేసుకున్నాం.



చందానగర్ పీజేఆర్ స్టేడియంలో బతుకమ్మ సంబరాలకు హాజరైన మహిళలు

చిత్తూచిత్తూల బొమ్మ.. శివునీ ముద్దులగుమ్మ..

చందానగర్, మియాపూర్, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబరాలను మహిళలు ఉత్సాహంగా జరుపుకొంటున్నారు. పూలు పేర్చి అందంగా బతుకమ్మలను తీర్చిదిద్ది ఆడిపాడి సందడి చేస్తున్నారు. ఆదివారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో వేడుకలు శ్రీకృష్ణా యూత్ అసోసియేషన్, కార్పొరేటర్ పూజిత ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇంఛార్జి జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న కార్పొరేటర్లు పూజిత, జగదీశ్వర్‌గౌడ్



మియాపూర్ శిల్పాస్ ఆర్ వి ధర్మిష్టాలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు



ఎస్‌ఎంఆర్ వినయ్ సిటీలో కోలాటం

నిర్వహణ లేక నిరుపయోగం


హైటెక్‌సిటీ ప్రాంతంలో ప్రజా మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన జీహెచ్‌ఎంసీ అధికారులు వాటి నిర్వహణను గాలికొదిలేశారు. ఫలితంగా లోపల అడుగుపట్టలేని విధంగా తయారయ్యాయి. కొన్ని చోట్ల తలుపులు విరిగిపోగా మరికొన్ని చోట్ల కుండీలు ధ్వంసమయ్యాయి. నీటి సరఫరా చేసే పైపులైన్లు విరిగిపోయాయి. చాలాచోట్ల చుట్టూ ముళ్లపొదలు మొలిచాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని బాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మాదాపూర్



శిల్పావ్యాలీ కాలనీలో..



మాదాపూర్ గఫూర్‌నగర్ కాలనీలోని పార్కు వద్ద..



మాదాపూర్ ఎన్ఐఏ రోడ్డులో..



భాగ్యనగర్‌కాలనీ ఫేజ్-2 రోడ్డు నం.1లోని అపార్ట్‌మెంట్ల ముందు నిలిచిన నీరు



రోడ్డు చివరలో వెళ్లే వీలులేక నిలిచిన నీరు

దంచి కొట్టి.. దారుల్ని ముంచి

భాగ్యనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: హైదర్‌నగర్, వివేకానందనగర్‌కాలనీ డివిజన్ల పరిధిలో ఆదివారం సాయంత్రం పలు ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడగా.. కొన్నిచోట్ల దంచి కొట్టింది. భాగ్యనగర్‌కాలనీ ఫేజ్-2 రోడ్డు నంబర్-1లో వర్షపు నీరెళ్లే దారిని ప్రైవేటు వ్యక్తులు మూసివేయడంతో నీరు నిలిచి అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి చేరింది. స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిపడ్డారు. గతంలో ఒకసారి ఇదే పరిస్థితి తలెత్తగా అప్పట్లో పీఎన్‌ఆర్ ఎంపైర్ ఆవరణలోని కాలువలోకి వెళ్లే ఏర్పాట్లు చేశారు. తర్వాత వారు మూసివేయడంతో మరోసారి సమస్య పునరావృతమైంది. విషయాన్ని కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది నీటిని తొలగించే ఏర్పాట్లు చేపట్టారు. మూసివేసిన కాలువ గోడ తొలగిస్తామని చెప్పారు.

డ్రైవర్, క్లీనర్ సహా ట్రాలీ తీసుకెళ్లిన ఆకతాయిలు

పటాన్‌చెరు అర్బన్: ఆకతాయిలు బలవంతంగా ట్రాలీని డ్రైవర్, క్లీనర్‌తో సహా తీసుకెళ్లారు. పటాన్‌చెరు శివారులో ఈ ఘటన జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. నార్సింగి నుంచి బాహ్యవలయ రహదారి గుండా ముత్తంగి ఎగ్జిట్ దిగి ఓ ట్రాలీ వచ్చింది. కిరాయికి వెళ్లేందుకు అక్కడిపార్కింగ్ ప్రాంతంలో డ్రైవర్ మహ్మద్‌షహన్షా, క్లీనర్ పర్వాన్‌లు వేచి ఉన్నారు. ద్విచక్రవాహనాలపై నలుగురు యువకులు వచ్చి బెదిరించి ట్రాలీతో సహా ఇద్దరినీ కుల్నుంపుర సమీపానికి తీసుకెళ్లారు. నవరాత్రి ఉత్సవాలు పూర్తయ్యే వరకు ట్రాలీని ఇవ్వబోమని దాడికి దిగారు. డ్రైవర్ లారీ యజమానికి ఫోన్ చేయడంతో ఆయన బంధువును పంపి లారీ నిలిచిన ప్రాంతాన్నికనుగొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీని కుల్నుంపుర ఠాణాకు తరలించారు. పిట్టీ కేసు నమోదుచేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

న్యూస్‌టుడే, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి

? తెల్లాపూర్ పురపాలక పరిధి పోచారంలో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. భూగర్భ పైపులైన్ శుభ్రం చేయించాలి. –సంతోష్, పోచారం

✓ మున్సిపాలిటీలోకి పోచారం కొత్తగా చేరినందునా సిబ్బందిని పంపించి పరిశీలన చేయిస్తాం. –సంగారెడ్డి, కమిషనర్, తెల్లాపూర్

? లింగంపల్లి పరిధిలో కొన్ని ప్రాంతాల్లో 4 నెలల నుంచి రాత్రీపగలు వీధి దీపాలు వెలగడం లేదు. ఫిర్యాదు చేసిన స్పందించే వారు లేరు. కంప్లైంట్ ఇచ్చిన సరి చేయడం లేదు.
–యూవీ రమణ, పాత ఎంఐజీ కాలనీ, శేరిలింగంపల్లి సర్కిల్

✓ సిబ్బందికి వెంటనే ఆదేశాలిచ్చి తగిన చర్యలు తీసుకుంటాం.
–మల్లికార్జున్, ఈఈ, ఎలక్ట్రికల్ విభాగం, శేరిలింగంపల్లి జోన్

? గోకుల్‌ఫ్లాట్స్ నుంచి హఫీజ్‌పేట వైపు వచ్చే రహదారి ముఖ్యంగా జలమండలి రిజర్వాయర్ ప్రహరీ పక్కన ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనదారులు పడిపోయి గాయపడుతున్నారు. చర్యలు తీసుకోవాలి. – రాజేశ్వర్‌రెడ్డి, గోకుల్‌ఫ్లాట్స్

✓ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. –మోహన్‌రెడ్డి, ఉపకమిషనర్, చందానగర్ సర్కిల్

? మియాపూర్ ప్రధాన రహదారి పక్కన మరుగుదొడ్డి శిథిలమై ఉంది. పూర్తిగా నిరుపయోగంగా మారడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా తయారవుతుంది. –శ్రీనివాస్, మియాపూర్.

✓ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.
–కేఎస్ రవి, సహాయ వైద్యాధికారి, చందానగర్ సర్కిల్

మంత్రి ఉత్తమ్‌కు ఎంపీల పరామర్శ



గచ్చిబౌలి, న్యూస్‌టుడే: ఇటీవల పితృ వియోగం పొందిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావు పరామర్శించారు. కొండాపూర్ సైబర్ మీడోస్‌లోని తన చెల్లెలు నివాసంలో ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎంపీలు రవిచంద్ర, దామోదర్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం రాత్రి పరామర్శించారు. ఉత్తమ్ తండ్రి పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్ ఠాణా పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. చనిపోయిన వ్యక్తిం కొంతకాలంగా మియాపూర్ చౌరస్తా సమీపంలోని అడ్డా వద్దే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రాత్రి అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతుని వద్ద గుర్తింపు ఆధారాలేవీ లభించలేదు.

బధిర బాలుడి అదృశ్యం



లక్కీ

మియాపూర్: ఓ బధిర బాలుడు అదృశ్యమయ్యాడు. మియాపూర్ పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ కాలనీ సమీపంలోని ఓంకార్ నగర్ బస్తీకి చెందిన మహేష్ తొమ్మిదేళ్ల కుమారుడు లక్కీ ఆదివారం ఉదయం మెట్రో స్టేషన్ సమీపంలో ఆడుకునేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీకెమెరాలు పరిశీలిస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 87126 63179కు సమాచారం ఇవ్వాలని సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ కోరారు.

దొంగల హల్‌చల్

పటాన్‌చెరు అర్బన్: పటాన్‌చెరు ఠాణా పరిధిలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. 4 ఇళ్ల తాళాలు పగలగొట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. పటాన్‌చెరు శాంతినగర్‌కాలనీలో శనివారం రాత్రి నాలుగు ఇళ్లలో ఎవరూ లేని సమయంలో చూసి దొంగలు పడ్డారు. నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టారు. ఒక ఇంట్లో మాత్రమే దొంగతనం జరిగింది. సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో దాదాపు 2 తులాల బంగారం ఎత్తుకెళ్లారు.

ఓబన్న ఆశయాలు అనుసరణీయం



వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: బ్రిటిషర్ల వెన్నులో వణుకు పుట్టించిన వడ్డే ఓబన్న ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు అన్నారు. ఆదివారం వడ్డే ఓబన్న వర్ధంతి సందర్భంగా ఇస్నాపూర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నీలం మధు నివాళి అర్పించారు. వడ్డెర సంఘం సభ్యులు పొక్లెయిన్లతో నీలం మధుకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రత్యేకంగా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. వడ్డెర కార్పొరేషనుకు ఛైర్మన్‌ను సైతం నియమించిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీశైలం, మాజీ సర్పంచి రవీందర్ తదితరులున్నారు.





బండి చిక్కాలి.. ఊరు చేరాలి

దసరా పండక్కి నగరవాసులు స్వగ్రామాలకు బయల్దేరి వెళ్తున్నారు. బస్సులు, రైళ్లు, సొంత వాహనాలతోపాటు దొరికిన ఏ బండైనా ఎక్కి సొంతూరుకు వెళ్తున్నారు. పలు కూడళ్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువైంది. పిల్లాపాపలు, లగేజీతో తమ ఊరెళ్లే బస్సులు, ఇతర వాహనాల కోసం నిరీక్షిస్తున్నారు. ఆదివారం గచ్చిబౌలి కూడలి ఊరెళ్లే ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది.



అసంపూర్తి పనులన్నీ పూర్తిచేస్తాం: ఎమ్మెల్యే



గాంధీకి వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీవాసులు

వివేకానందనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: అసంపూర్తి పనులన్నీ తొందరలోనే పూర్తిచేస్తామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ ఆదిత్యా నగర్ కాలనీవాసులు వివేకానందనగర్‌కాలనీలో ఆయన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. మిగిలిపోయిన సీసీరోడ్లు, వీధి దీపాల సమస్య, నియంత్రికలు ఏర్పాటుచేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన్ని కలిసిన వారిలో ఖాసిం, లియాకత్ అలీ, మొయిస్, అజీమ్ ఉన్నారు. ● రాయదుర్గానికి చెందిన ఆసిఫ్ అలీఖాన్‌కు రూ.లక్ష సీఎం సహాయ నిధి చెక్కును గాంధీ అందజేశారు.

కుత్బుల్లాపూర్

మల్లికార్జునాలయంలో వాయు ప్రతిష్ఠ

దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్ పురపాలిక పరిధి బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన దేవతా విగ్రహాలకు ఆదివారం ఘనంగా వాయు ప్రతిష్ఠ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాలనీవాసులు 51 కలశాలతో అభిషేకం, గణపతి హోమం నిర్వహించారు.


హోమం నిర్వహణలో భక్తులు

వెంకటేష్‌గౌడ్ సేవలు మరువలేనివి

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: కూన వెంకటేశం గౌడ్ గౌడ కులస్థులకు చేసిన సేవలు మరువలేనివని, సహకార సంఘాల ఏర్పాటు కోసం ప్రభుత్వంతో చర్చించి వృత్తి రక్షణకు కృషి చేశారని ఎవిజీటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడు అయిలయ్య అన్నారు. శ్రీనివాసనగర్ కాలనీలో ఆదివారం ఐలయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన కల్లుగీత సహకార సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. టీసీఎస్ డైరెక్టర్లు అంజన్‌గౌడ్, విఠల్‌గౌడ్, సాయిగౌడ్, స్వామిగౌడ్, రాజలింగంగౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో గౌడసంఘం ప్రతినిధులు



దేవీస్తుతి వైభవం.. నృత్య వందనం

మాదాపూర్, న్యూస్‌టుడే: శిల్పారామంలో ఆదివారం సాయంత్రం కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. డా.సరోజ, డా.సుజాత సంగీత కచేరి అలరించింది. అక్కాచెల్లెలు తమ గానామృతంతో సంగీత ప్రియులను కట్టిపడేశారు. జ్యోత్స్న శిష్యబృందం దేవీస్తుతి వైభవం పేరిట ప్రదర్శించిన కూచిపూడి నృత్యం నయనానందకరంగా సాగింది. అమ్మవారి 9 రూపాలను చక్కటి నృత్యాభినయంతో ప్రదర్శించి అలరించారు.

తాఖీదులు.. తాటాకు చప్పుళ్లేనా!

☛ ప్రమాదకర గోదాములపై చర్యలు శూన్యం
☛ సెల్లార్లలో కొనసాగుతున్న దుకాణాలు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే

జనావాసాల మధ్య శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లు, భవనాలకు, అగ్ని ప్రమాదాలకు ఆస్కారమున్న పరిశ్రమలు, గోదాములను జనావాసాలకు దూరంగా తరలించాలని గత ఏడాది ఏప్రిల్ 13న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఆదేశించారు. ఈ మేరకు జంట సర్కిళ్లలో పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేక బృందాలతో సర్వే చేయించి బాధ్యులకు తాఖీదులు జారీచేశారు. సీఎస్ ఆదేశాల ప్రకారం మూడు నెలల్లో చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు ఈ పని పూర్తిచేయకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


గాజుల రామారంలో శిథిలావస్థలోని ఇంటికి నోటీసులు అతికిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

ఆ పరిస్థితి ఎక్కడంటే?

కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో పట్టణ ప్రణాళిక డీసీపీల ఆధ్వర్యంలో ఆయా కాలనీలు, బస్తీలలో సర్వే నిర్వహించారు. ఎన్టీ కోఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, సుభాష్‌నగర్, రాంరెడ్డినగర్, గంపల బస్తీ, ఎస్ఆర్‌నాయక్ నగర్, అపురూపకాలనీ, వినాయకనగర్, జేకేనగర్, పద్మానగర్-2, శ్రీరాంనగర్, సూరారం, జీడిమెట్ల ప్రాంతాల్లో జనావాసాల మధ్య 130 ప్రమాదకరమైన దుకాణాలు, గోదాములు, వాహనాల పార్కింగ్‌ నిర్దేశించిన సెల్లార్లలో 69 దుకాణాలు, 12 శిథిల భవనాలు, ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదకర దుకాణాలు, గోదాములు తరలింపునకు మూడు నెలలు, సెల్లార్లలోని దుకాణాలు, శిథిల భవనాల తొలగింపునకు వారం రోజుల గడువు ఇస్తూ యజమానులకు తాఖీదులు జారీచేశారు. గడువు లోపు తరలించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తామే వాటిని తొలగిస్తామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం జనావాసాల మధ్య పరిశ్రమలు, గోదాములు ఏర్పాటు చేయకూడదు. ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలు, రసాయన, ప్లాస్టిక్, స్క్రాపు గోదాములను విచ్చలవిడిగా ఏర్పాటుచేశారు.

సర్కిళ్లు	ప్రమాదకర షాపులు, గోదాములు	సెల్లార్లలో ఉన్నవి	శిథిల భవనాలు
కుత్బుల్లాపూర్	76	14	5
గాజులరామారం	54	55	7

గాలిలో కలుస్తున్న ప్రాణాలు

గతంలో సుమారు 47 రసాయన గోదాములను గుర్తించి జనావాసాలకు దూరంగా తరలించారు. అనంతరం వాటిపై నియంత్రణ కొరవడటంతో నిర్వాహకులు యథావిధిగా మళ్లీ అదే చోట ఏర్పాటు చేసుకున్నారు. వీటిలో మండే స్వభావం ఉన్న తెలిపాటి సాల్వెంట్లు కలిగి ఉన్న గోదాములు ఎక్కువగా ఉన్నాయి. దీంతో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవించి అమాయక కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ సందర్భంగా వెలువడే హానికర రసాయన వాయువులతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జనవాసాల మధ్య పరిశ్రమలు, రసాయన, ప్లాస్టిక్, స్క్రాపు గోదాములను విచ్చల విడిగా ఏర్పాటుచేయడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
శాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

న్యూస్‌టుడే: కుత్బుల్లాపూర్, దుండిగల్, నిజాంపేట.

? మల్లంపేటలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. – కృష్ణ, మల్లంపేట
✓ త్వరలో వీధి కుక్కలను పట్టుకునేలా చర్యలు తీసుకుంటాం. –సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్
? చింతల్ శ్రీనివాసనగర్ కాలనీ వెంకటేశ్వర ఆలయం వెనక వీధిలో వీధి కుక్కలు తిష్ట వేస్తున్నాయి. – సుక్క నాగేంద్రప్రసాద్, శ్రీనివాసనగర్
✓ వెంటనే సిబ్బందిని పంపించి వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –ఈశ్వర్‌రెడ్డి, వైద్యాధికారి, పశుసంవర్ధక విభాగం కుత్బుల్లాపూర్
? జీడిమెట్ల నుంచి సూరారం కట్ట మైసమ్మ వరకు పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. – వీరారెడ్డి, సూరారం
✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార చర్యలు చేపడతాం. – రఘుపతిరెడ్డి, డీఈ, విద్యుత్‌పంపిణీ కుత్బుల్లాపూర్
? నిజాంపేట ఈశ్వర్ విల్లాల సముదాయం నుంచి వజ్ర ప్రైడ్ వరకు ఉన్న రోడ్డులో నెలల తరబడి వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. –ఉమాశంకర్, నిజాంపేట
✓ వీధి దీపాల నిర్వహణ బాధ్యతలు స్వీకరించిన సంస్థ ప్రతినిధులు ఏడాది కాలంగా బాధ్యతల నిర్వహణలో చేతులెత్తేశారు. వారి కాంట్రాక్టును రద్దు చేసే అనుమతిని ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశాం. ఆ అనుమతి రాగానే వీధి దీపాలను బాగుచేస్తాం. అప్పటి వరకు మా వద్ద అందుబాటులో ఉన్న దీపాలను అమర్చి.. సమస్య పరిష్కరిస్తాం. –సత్యనారాయణ, ఈఈ, నిజాంపేట నగర పాలక సంస్థ

పూల పండుగ.. కనుల నిండుగ


చింతల్ భాగ్యరథి జూనియర్ కళాశాలలో ఆదివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. సంప్రదాయ వస్త్రధారణలో హాజరైన మహిళా అధ్యాపకులు విద్యార్థినులతో కలిసి బతుకమ్మ చుట్టూ జ్ఞతిరుగుతూ ఆడిపాడారు. బతుకమ్మ గీతాలతో ప్రాంగణం మార్మోగింది. –కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే

మెట్రో దీక్షకు ఎంపీ సంఘీభావం

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: మెట్రో మార్గాన్ని సుచిత్ర మీదుగా మేడ్చల్, శామీర్‌పేట వరకు పొడగించాలని కోరుతూ భాజపా ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ పరిధి కొంపల్లిలో చేస్తున్న దీక్షలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జాతీయ రహదారిలోని సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాల వరకు జూబ్లీ బస్టాండ్ నుంచి మెట్రో మార్గాన్ని పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందేలా బాధ్యత తీసుకుంటానని హామీఇచ్చారు. మేడ్చల్ మెట్రో సమితి సభ్యులు సంపత్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి శేఖర్‌యాదవ్, జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్ మండల సీపీఎం కార్యదర్శిగా లక్ష్మణ్

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శిగా మరోసారి కీలుకాని లక్ష్మణ్ ఎన్నికయ్యారు. షాపూర్‌నగర్‌లోని కమలాకర్‌రెడ్డి ప్రాంగణంలో ఆదివారం కుత్బుల్లాపూర్ మండల పార్టీ మహాసభలు ప్రారంభమయ్యాయి. సీనియర్ నేత వరప్రసాద్ హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ముందుగా పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రతినిధులనుద్దేశించి లక్ష్మణ్ మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుతం రోజురోజుకు నిత్యావసర సరకుల ధరలను పెంచుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను అడ్డంపెట్టుకుని పేదల ఇళ్లు కూలిస్తే సీపీఎం ఊరుకోదన్నారు. పార్టీ మండల కమిటీ సభ్యులుగా అంజయ్య, సత్యం, రావుల స్వాతి, దేవదానం, కరుణాకర్, జాకీర్‌హుస్సేన్ ఎన్నియ్యారు.


పార్టీ కార్యాలయం వద్ద శ్రేణులతో లక్ష్మణ్

'ఫ్లెక్సీ కార్మికుల సంక్షేమానికి కృషి'

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు, ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికుల సంక్షేమానికి తమవంతుగా కృషి చేస్తామని తెలంగాణ ఫ్లెక్స్ ప్రింటర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పేర్కొంది. ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సప్పిడి నరేష్‌కుమార్, కొట్ల వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస్, కోశాధికారిగా ఎండీ ఖదీర్, సంయుక్త కార్యదర్శిగా పొలాస శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా ఎస్‌డీ ప్రసాద్, మహమ్మద్ అలీ ఉద్దీన్, కొండ రాజు కొనసాగుతారని సంఘం మాజీ అధ్యక్షుడు అన్సారి తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ, యజమానులు, కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. నూతన సంఘాన్ని సత్కరించారు.


మంత్రి ఉత్తమ్‌కు ఎంపీల పరామర్శ

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: ఇటీవల పితృ వినియోగానికి గురైన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావు పరామర్శించారు. కొండాపూర్ సైబర్ మీడోస్‌లోని తన చెల్లెలు నివాసంలో ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎంపీలు రవిచంద్ర, దామోదర్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం రాత్రి పరామర్శించారు. ఉత్తమ్ తండ్రి పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.


గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయంలో లలితా త్రిపురసుందరి దేవిగా చిత్తారమ్మ


చెరకుపల్లికాలనీలో లలితాదేవిగా దుర్గాదేవి


అన్నపూర్ణగా బాచుపల్లి సాయిఅనురాగ్‌కాలనీలో..


నిజాంపేట దక్షిణముఖ ఆంజనేయ ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా..


మల్లంపేటలోని గడీల మైసమ్మ గుడిలో లలితా త్రిపుర సుందరిగా..


నిజాంపేటలో కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్‌రెడ్డి పూజలు

అపురూపం.. అమ్మ దర్శనం

నియోజకవర్గ వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచే అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలతో సందడి నెలకొంది. గాజులరామారంలోని చిత్తారమ్మ దేవాలయంలో అమ్మవారిని త్రిశక్తిరూప లలితా త్రిపుర సుందరిదేవిగా బంగారువర్ణం చీరతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, షాపూర్‌నగర్, దుండిగల్, నిజాంపేట – న్యూస్‌టుడే


మల్లంపేటలో పూజల్లో కాంగ్రెస్ ఇన్‌ఛార్జి హన్మంత్‌రెడ్డి, ఇతర నేతలు


గాంధీనగర్‌లో..


సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌నాయక్‌నగర్ మండపంలో భారాస నేతల పూజలు


జగద్గిరిగుట్ట సంజయ్‌పురి కాలనీలో పూజల్లో భాజపా నేత శేఖర్‌యాదవ్, భక్తులు


బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలో..

మూలలో ముప్పుంది..



పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: భూమిరెడ్డి నగర్ నుంచి శివారెడ్డి నగర్‌కు వెళ్లే దారిలో మూలమలుపు వద్ద సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక.. రహదారికి ఇరువైపులా మొరం పోసి చదును చేయకుండా వదిలేశారు. మూలమలుపు కావడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' జీడిమెట్ల ఏఈ మహదేవ్ అనురాగ్‌ను సంప్రదించగా.. పరిశీలించి పరిష్కార చర్యలు చేపడతామన్నారు.

కుంట ఇలా.. వేడుక ఎలా?



జీడిమెట్ల, న్యూస్‌టుడే: సుభాష్ నగర్ డివిజన్ వెంకటాద్రినగర్ సమీపంలోని ఫాక్స్‌సాగర్ చెరువుకట్ట కింద రెండేళ్ల క్రితం రూ.14 లక్షల వ్యయంతో బతుకమ్మ కుంట నిర్మించారు. ప్రస్తుతం బతుకమ్మ మొదలైనా అక్కడ ఏవిధమైన ఏర్పాట్లు చేయలేదు. గతంలోని నీటిని తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. వెంటనే కుంట వద్ద సౌకర్యాలు కల్పించి.. బతుకమ్మ ఆడుకునేలా చూడాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, పలువురు ఇతర నేతలు కోరారు.

550మంది పోలీసులకు వైద్య పరీక్షలు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి రాందేవ్‌రావు ఆసుపత్రిలో ఆదివారం బాలానగర్ జోన్ పరిధిలోని 12ఠాణాల పోలీసు అధికారులు, సిబ్బంది 550 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏసీపీ శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. పోలీసులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్‌రావు, సీఈవో డాక్టర్ ఎన్.యోబు తదితరులు పాల్గొన్నారు.

పండుగకు ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త!

పలు సూచనలు వెల్లడించిన పోలీసులు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2 నుంచి 14 వరకు విద్యాసంస్థలకు దసరాల సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వగ్రామాలకు వెళ్లేవారు కనీస జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని పోలీసులు సూచిస్తున్నారు. ప్రధానంగా తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉండటంతో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పలు సూచనలు జారీచేసింది.

70 శాతం స్థానికేతరులే..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 70 శాతం మంది స్థానికేతరులే ఉంటున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారూ ఉన్నారు. పండుగ సెలవుల్లో చాలా మంది స్వగ్రామాలకు వెళ్తుంటారు. పలు కాలనీలు, బస్తీలలో చాలా వరకూ ఇళ్లకు తాళాలు పడే అవకాశం ఉండటంతో దొంగలు విజృంభించే అవకాశం ఉంది. ఈ పరిస్థితి దృష్ట్యా సొంతూళ్లకు వెళ్లే వారు స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలోని ఠాణాల సీఐల చరవాణి నంబర్లు

జీడిమెట్ల	94906 17220
పేట్‌బషీరాబాద్	94906 17229
దుండిగల్	94906 17219
జగద్గిరిగుట్ట	94906 17157
బాచుపల్లి	94910 60942
సూరారం	87126 63337

ఈ జాగ్రత్తలు పాటిస్తే బాగు

● ఇంట్లో నగలు, నగదు వంటి విలువైన వస్తువులు ఉంచకూడదు. వాటిని బ్యాంకు లాకర్లలో, మీ ఇంట్లో రహస్య ప్రదేశాల్లో, తెలిసిన వారి వద్దగాని ఉంచుకోవాలి. ● సెలవుల్లో బయటికి వెళ్తున్నప్పుడు సెక్యూరిటీ అలారం, మెషిన్ సెన్సార్‌ను ఏర్పాటు చేసుకోవడం మంచిది. ● ఇంట్లో సెంట్రల్ లాక్ సిస్టమ్ తాళం అమర్చుకోవాలి. ● విధిగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ● మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. లేదా 100 నంబరుకు ఫోన్‌చేసి చెప్పవచ్చు. ● నమ్మకమైన వ్యక్తులను మాత్రమే కాపలాదారులుగా నియమించుకోవాలి. ● ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. ● ఇంటి ముందు న్యూస్ పేపర్లు, పాల ప్యాకెట్లు పోగవ్వకుండా చూడాలి. ● ప్రధాన ద్వారానికి తాళం వేసినప్పుడు కన్పించకుండా కర్టెన్ వేసుకోవాలి. ● ఇంటిలోపల లైట్లు వేసి ఉంచాలి. ● రోజుకు ఒకట్రెండుసార్లు తమకు నమ్మకమైన ఇరుగుపొరుగు వారికి ఫోన్‌చేసి తమ ఇంటి వివరాలు తెలుసుకోవాలి. ● సామాజిక మాధ్యమాల్లో బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయకూడదు.


దూలపల్లిలోని ఇటీవల చోరీ జరిగిన ఇంట్లో గది ఇలా..

నీటి వృథాకు అడ్డుకట్ట

ఈనాడు కథనానికి స్పందన

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం రోడ్డులో తాగునీటి లీకేజీకి మరమ్మతులు చేశారు. నెలనుంచి మూడు చోట్ల తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడి వేలాది లీటర్ల తాగునీరు వృథా అయింది. ఈ నేపథ్యంలో ఈ నెల 3న 'తరచూ లీకేజీ.. తాగు నీరు కలుషితం' శీర్షికతో 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేశారు. మరుసటి రోజే తిరిగి లీకేజీ ఏర్పడి తాగునీరు రోడ్డుపై పారడం మొదలైంది. దీంతో ఈనెల 5న 'నిన్న మరమ్మతులు.. నేడు లీకేజీలు' శీర్షికతో వచ్చిన కథనానికి జలమండలి ఉన్నతాధికారులు స్పందించారు. జలమండలి టాస్క్‌ఫోర్స్ అధికారి ముస్తఫా అలీ క్షేత్రస్థాయిలో లీకేజీ ప్రాంతాన్ని సందర్శించారు. స్థానిక అధికారులు, గుత్తేదారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వయంగా దగ్గరుండి లీకేజీకి మరమ్మతులు చేయించారు. సీఆర్ఎంపీ రోడ్డుకు అనుమతి నిరాకరించడంతో రాత్రికి రాత్రి గాజులరామారం ప్రధాన రహదారిలో రోడ్డుపై తవ్వకాలు చేసి మరమ్మతులు చేశారు. డీజీఎం రవి పనులను పర్యవేక్షించారు.


గాజులరామారం రోడ్డులో మరమ్మతులు చేస్తున్న జలమండలి సిబ్బంది

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

జీడిమెట్ల: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన జీడిమెట్ల ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో షాపూర్‌నగర్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ వద్ద గుర్తు తెలియని యువకుడు(30) రోడ్డు మధ్యలో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఓ బస్సు ముందుకు ఒక్కసారిగా వెళ్లడంతో స్థానికులు గుర్తించి పక్కకు తీసుకొచ్చి కూర్చోబెట్టారు. మరి కొంత సమయానికి మళ్లీ రోడ్డు మధ్యలోకి వెళ్లాడు. అదే సమయంలో ఆర్టీసీ బస్సు రావడంతో తగిలి కింద పడిపోయాడు. వాహనదారులు గుర్తించి 108కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై స్థానికంగా ఓ దుకాణ నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదుచేశారు. మృతుడిని స్థానికంగా ఉన్నవారు గుర్తించలేదని, అతడి దుస్తుల్లో కూడా గుర్తింపు పత్రాలేవీ దొరకలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.